

# కూర్మ గ్రామం సందర్శించిన న్యాయ విద్యార్థులు

**ఆధ్యాత్మిక చింతన, సాంప్రదాయ జీవన విధానంపై అవగాహన**

శ్రీకాకుళం - జూన్ 14, ప్రభాతవార్త :

శ్రీకాకుళం జిల్లా కూర్మగ్రామాన్ని విశాఖపట్నం జిల్లాకు చెందిన ఎన్.బి.ఎం న్యాయ కళాశాల విద్యార్థులు ఆదివారం సందర్శించారు. గ్రామంలోని ప్రత్యేక జీవన విధానం, వేద సంస్కృతి ఆధారిత సామాజిక వ్యవస్థ, ఆధ్యాత్మిక చింతన గురించి విద్యార్థులు ప్రత్యక్షంగా తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామ నిర్వాహకులు విద్యార్థులకు కూర్మగ్రామం ఆవిర్భావం, లక్ష్యాలు, అనుసరిస్తున్న జీవన విధానం గురించి వివరించారు. ప్రకృతికి అనుగుణంగా జీవించడం, స్వయం సమృద్ధిని పెంపొందించడం, సనాతన ధర్మ విలువలను ఆచరణలో పెట్టడం గ్రామ ప్రధాన లక్ష్యాలని తెలిపారు. ఆధునిక జీవనశైలిలో పెరుగుతున్న (తరువాయి 8వ పేజీలో)

## ఎస్ఐఆర్ కార్యక్రమానికి
# ప్రజలంతా సహకరించాలి

**ప్రజాస్వామ్య వ్యవస్థకు ఓటరు జాబితాలే పునాది**

**బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్**

విశాఖపట్నం, జూన్ 14 (ప్రభాత వార్త)

ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో సోమవారం నుంచి ప్రారంభం కానున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని ప్రజలందరూ విజయవంతం చేయాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్య వ్యవస్థకు ఓటరు జాబితాలే పునాదిగా నిలుస్తాయని, వాటిని మరింత ఖచ్చితత్వంతో, పారదర్శకంగా రూపొందించేందుకు ఎన్నికల సంఘం ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు.



ఆదివారం నుంచి జూలై 15 వరకు బూత్ స్థాయి అధికారులు (బీఎల్‌వోలు), ఎన్నికల గణన సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలను సేకరిస్తారని తెలిపారు. ఒకవేళ ఓటర్లు అందుబాటులో లేకపోతే మూడు విడతల్లో తిరిగి సందర్శించి వివరాలు నమోదు చేస్తారని పేర్కొన్నారు.

జూలై 21 నుంచి ఆగస్టు 20 వరకు క్లెయిమ్స్, అభ్యంతరాల స్వీకరణ ప్రక్రియ కొనసాగుతుందని చెప్పారు. జూలై 14లోపు ఎన్యూమరేషన్ ఫారమ్ సమర్పించలేని వారు కూడా ఫారమ్-6 ద్వారా ఓటరు నమోదుకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందన్నారు. అందిన దరఖాస్తులు, అభ్యంతరాలను సెప్టెంబర్ 18 వరకు పరిశీలించి పరిష్కరిస్తారని వివరించారు. ఓటరు జాబితాల్లో ఇప్పటికే పేర్లు ఉన్నవారు తమ వ్యక్తిగత వివరాలు, చిరునామా, వయస్సు తదితర అంశాలను పరిశీలించి అవసరమైతే సవరణలు చేయించుకోవాలని సూచించారు. కొత్తగా 18 సంవత్సరాలు పూర్తి చేసుకున్న యువత పెద్ద సంఖ్యలో ఓటరు నమోదుకు ముందుకు రావాలని కోరారు.

అలాగే మరణించిన వ్యక్తులు, శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు మారిన వారు, ద్వంద్వ నమోదులు ఉన్న వారి వివరాలను అధికారులకు తెలియజేసి ఓటరు జాబితాల ప్రక్షాళనకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఓటరు జాబితాల్లోని తప్పులను సరిదిద్దడం, అనర్హుల పేర్లను తొలగించడం, అర్హులైన ప్రతి పౌరుడికి ఓటు హక్కు కల్పించడమే ఎస్ఐఆర్ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు.

బీఎల్‌వోలు ఇంటికి వచ్చినప్పుడు ప్రజలు అవసరమైన వివరాలు, పత్రాలు అందించి సహకరించాలని కోరిన మాధవ్, ఏవైనా సందేహాలు ఉంటే టోల్‌ఫ్రీ నంబర్ 1950 లేదా సంబంధిత ఎన్నికల కార్యాలయాల్లోని హెల్ప్‌డెస్క్‌లను సంప్రదించాలని సూచించారు. రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలు, యువత, మహిళలు, సామాజిక సంస్థలు, రాజకీయ పార్టీలు ఎన్నికల సంఘం చేపడుతున్న ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు.

## విశాఖ కూటమిలో
# ఆధిపత్య పోరు..!

- ఇన్‌చార్జిల మధ్య విభేదాలు
- పదవుల రాజకీయంతో పెరుగుతున్న దూరం

(ప్రభాతవార్త-విశాఖపట్నం)

విశాఖ జిల్లాలో కూటమి రాజకీయాలు కొత్త మలుపు తిరుగుతున్నాయి. ఎన్నికల సమయంలో ఐక్యంగా ముందుకు సాగిన టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు అధికారంలోకి వచ్చిన తర్వాత స్థానిక స్థాయిలో ఆధిపత్య పోరుకు దిగినట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ముఖ్యంగా నియోజకవర్గాల వారీగా కూటమి పార్టీల ఇన్‌చార్జిలు, కీలక నాయకుల మధ్య పెరుగుతున్న విభేదాలు ఇప్పుడు కూటమిలో కొత్త తలనొప్పిగా మారినట్లు తెలుస్తోంది. నామినేటెడ్ పదవులు, ట్రస్ట్ బోర్డులు, మార్కెట్ కమిటీలు, కార్పొరేషన్ పోస్టుల పంపకాల వ్యవహారం ఈ విభేదాలకు మరింత ఆజ్యం పోస్తోందని రాజకీయ పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు. క్షేత్రస్థాయిలో పార్టీ కోసం పనిచేసిన తమకు తగిన గుర్తింపు దక్కడం లేదని జనసేన, బీజేపీ నాయకులు భావిస్తుండగా, అధికార పార్టీగా టీడీపీ నేతలు కీలక పదవులపై తమ ఆధిపత్యాన్ని కొనసాగించేందుకు ప్రయత్నిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. విశాఖ నగరంతో పాటు దక్షిణ, ఉత్తరం, పెందుర్తి, అనకాపల్లి, యలమంచిలి నియోజకవర్గాల్లో కూటమి పార్టీల స్థానిక నాయకుల మధ్య సమన్వయం లోపిస్తోందన్న ప్రచారం జరుగుతోంది. కొన్ని చోట్ల కార్యక్రమాల నిర్వహణ, ప్రభుత్వ పథకాల ప్రచారం, అధి కారుల వద్ద ప్రాధాన్యం వంటి అంశాల్లోనూ విభేదాలు బయట పడుతున్నట్లు సమా చారం. ప్రత్యేకంగా పెందుర్తిలో ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు, టీడీపీ నియోజకవర్గం ఇంచార్జ్ గండి బాబ్జికి పొసగడం లేదు. యలమంచిలిలో ఎమ్మెల్యే సుందరపు విజయ కుమార్, టీడీపీ ఇంచార్జ్ ప్రగడ నాగేశ్వరరావు మధ్య, అనకాపల్లిలో ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, టీడీపీ ఇంచార్జ్ పీలా గోవింద్ మధ్య, దక్షిణంలో ఎమ్మెల్యే వంశీకృష్ణ, సీతంరాజు సుధాకర్ మధ్య కొనసాగుతున్న ఆధిపత్య పోరు శ్రేణుల్లో చర్చనీయాంశంగా మారింది. అయితే.. దక్షిణంలో మాత్రం ఎమ్మెల్యే వంశీకృష్ణ పనితీరు పట్ల సీఎం చంద్రబాబు నాయు డు ప్రశంసలు కురిపిం చినట్టు తెలు స్తోంది.



కాగా... పలు నియో జకవర్గాల్లో నేతల మధ్య ఆదిపత్య పోరుతో కూటమి కిందిస్థాయి క్యాడర్ నలిగిపోతుంది. కాగా.. ప్రజా కార్యక్రమాల్లో ఎవరి ప్రాధాన్యం ఎక్కువగా ఉండాలి, పార్టీ నిర్ణయాల్లో ఎవరి మాటకు విలువ ఉండాలి, స్థానిక సంస్థల ఎన్నికల్లో సీట్ల కేటాయింపు ఎలా ఉండాలనే అంశాలపై అంతర్గతంగా పోటీ నెలకొన్నట్లు తెలుస్తోంది. అయితే విశాఖ దక్షిణ నియోజకవర్గంలో జనసేన ఎమ్మెల్యే, నగర అధ్యక్షుడు వంశీకృష్ణ శ్రీనివాస్ కూటమి సమన్వయంతో ముందుకు సాగుతున్నారని, ప్రజా సమస్యల పరిష్కారంలో చురుకుగా వ్యవహరిస్తున్నారని కూటమి వర్గాలు చెబుతున్నాయి. ఇటీవల ఆయన పనితీరుపై ముఖ్యమంత్రి ఎన్.చంద్రబాబు నాయుడు కూడా సానుకూలంగా స్పందించినట్లు రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఇదిలా ఉండగా, స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో సీట్ల పంపకం, పదవుల కేటాయింపు, నాయకత్వ ప్రాధాన్యం వంటి అంశాలు కూటమి పార్టీల మధ్య మరింత చర్చకు దారితీసే అవకాశాలు కనిపిస్తున్నాయి. పైస్థాయిలో కూటమి బలంగా ఉందని నాయకత్వం చెబుతున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో ఇన్‌చార్జిల మధ్య పెరుగుతున్న ఆధిపత్య పోరు భవిష్యత్ రాజకీయ సమీకరణాలపై ప్రభావం చూపుతుందా అన్నది ఆసక్తికరంగా మారింది.



## చిన్ననాటి జ్ఞాపకాల్లో మునిగిన ఎంపీ
# చింతకాయల విజయ్

విశాఖపట్నం, జూన్ 14, ప్రభాతవార్త:

రాజ్యసభ ఎంపీ చింతకాయల విజయ్ తన విద్యాభ్యాసానికి పునాది వేసిన గుడిలోవలోని విజ్ఞాన విహార్ పాఠశాలను ఆదివారం సందర్శించి చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఐదో తరగతి నుంచి పదో తరగతి వరకు ఈ పాఠశాలలోనే చదువుకున్న ఆయన, ఎన్నో మధుర స్మృతులను గుర్తుచేసుకుంటూ ఉపాధ్యాయులు, విద్యార్థులతో ఆత్మీయంగా మమేకమయ్యారు. ఈ సందర్భంగా తనతో కలిసి చదువుకున్న చిన్ననాటి స్నేహితుడు బత్తి అప్పల నాయుడుతో కలిసి పాఠశాల ప్రాంగణాన్ని సందర్శించారు. విద్యార్థి దశలో గడిపిన రోజులను గుర్తు చేసుకుంటూ ఆనాటి (తరువాయి 8వ పేజీలో)



## మత్స్య వేటకు
# మళ్లీ జోష్..!



- ముగిసిన 61 రోజుల చేపల వేట నిషేధం
- హార్బర్‌లో మత్స్యకారుల సందడి.. అర్ధరాత్రి నుంచి చేపల వేట పున:ప్రారంభం

విశాఖపట్నం, జూన్ 14, ప్రభాతవార్త :

సాధారణంగా తెల్లవారు జాము నుంచే తాజా చేపల సందడితో కళకళలాడే విశాఖప ట్నం ఫిషింగ్ హార్బర్ ప్రస్తుతం నిర్మానుష్య వాతావరణాన్ని తలపిస్తోంది. కారణం సముద్రంలో చేపల వేటపై అమల వుతున్న వార్షిక నిషేధం. ప్రతి ఏడాది ఏప్రిల్ 14 అర్ధరాత్రి నుంచి జూన్ 14 అర్ధరాత్రి వరకు 61 రోజుల పాటు చేపల వేటను నిలిపివేస్తారు. సముద్ర జీవుల సంతానోత్పత్తి, చేపల సంపద పరిరక్షణ కోసం అమలు చేసే ఈ నిషేధం ఇప్పుడు ముగింపు దశకు చేరుకుంది. ఈ క్రమంలో ఆదివారం రాత్రితో వేట నిషేధం గడువు ముగిసింది. దీంతో మత్స్యకారుల్లో కొత్త ఉత్సాహం కనిపిస్తోంది. వేట విరామం ముగియనుండటంతో విశాఖ ఫిషింగ్ హార్బర్లో ఏర్పాట్లు జోరుగా సాగుతున్నాయి. సముద్రంలోకి వెళ్లే బోట్ల మరమ్మతులు, వలల సన్నద్ధత, ఇంజిన్ల తనిఖీలు వేగంగా జరుగుతున్నాయి. గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించి సముద్రయానాన్ని ప్రారంభించే సంప్రదాయాన్ని ఈసారి కూడా కొనసాగించనున్నట్లు మత్స్యకారులు చెబుతున్నారు. రెండు నెలల విరామం తర్వాత సముద్రంలోకి అడుగుపెట్టేందుకు ఆసక్తి గా ఎదురుచూస్తున్నామని (తరువాయి 8వ పేజీలో)

## నర్సీపట్నంలో అట్టహాసంగా ప్రారంభమైన
# సురభి నాటక ప్రదర్శనలు

నర్సీపట్నం, జూన్ 14, ప్రభాతవార్త:

శ్రీ వినాయక నాట్యమండలి, సురభి సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించనున్న పౌరాణిక నాటక ప్రదర్శనలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఆంధ్రప్రదేశ్ శాసనసభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు గారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసి జ్యోతి





ప్రజ్వలన చేసి ప్రదర్శనలను ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా స్పీకర్ అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ.. ఆధునిక కాలంలో నేటి తరానికి నాటకాల విశిష్టత పెద్దగా తెలియడం లేదన్నారు. సురభి వారు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన 'మాయాబజార్' నాటకం అచ్చం సినిమా సెట్టింగ్స్ తరహాలో అద్భుతంగా ప్రదర్శించారని ఆయన ప్రశంసించారు. కళాకారులను ఆదరించడం మనందరి బాధ్యతని ఆయన గుర్తుచేశారు. సురభి కళాబృందం ప్రదర్శనలను ప్రజలు వీక్షించి సద్వినియోగం (తరువాయి 8వ పేజీలో)

## ఉక్కు నిర్వాసితుల
# పోరు బాట

- విశాఖ స్టీల్ ప్లాంట్కు భూములిచ్చి 45 ఏళ్లయినా న్యాయం చేయలేదని ఆవేదన
- జూలై 4 నుంచి భారీ ఎత్తున ఆందోళన

విశాఖపట్నం, జూన్ 14, ప్రభాతవార్త:

విశాఖ ఉక్కు నిర్వాసితులు ఆందోళన బాట పడుతున్నారు. స్టీల్ ప్లాంట్ కోసం భూములిచ్చిన తమకు 45 సంవత్సరాల తర్వాత కూడా న్యాయం జరగకపోవడంతో సమర శంఖం పూరిస్తున్నారు. విశాఖ ఉక్కు నిర్వాసితుల ఐక్య సంఘం, విశాఖ ఉక్కు నిర్వాసితుల కాంట్రాక్ట్ లేబర్ యూనియన్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 64 గ్రామాల నిర్వాసితుల జేఏసీ నెహ్రూ పార్క్ సమావేశమయింది. ఈ సమావేశంలో ఉక్కు నిర్వాసితులకు ప్రతి ఆర్ నెంబరికి ఎకరం భూమి చొప్పున వన్ టైం సెటిల్మెంట్ చేయాలని, అంత వరకు ప్రతి నెల జీవన జీవన భృతి కింద 25 వేల రూపాయలు ప్రభుత్వం చెల్లించాలని డిమాండ్ చేస్తూ సమావేశంలో తీర్మానం చేశారు. డిమాండ్ల సాధనకు వచ్చే నెల 4వ తేదీన 48 గంటల పాటు స్టీల్ ప్లాంట్ (తరువాయి 8వ పేజీలో)

# హోంమంత్రి అనితపై అనుచిత వ్యాఖ్యలు ఖండనీయం

**జిల్లా టీడీపీ కార్యాలయంలో మహిళా నేతల ఆగ్రహం**



విశాఖపట్నం, జూన్ 15, ప్రభాతవార్త :

రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనితపై ఇటీవల చేసిన వ్యాఖ్యలను తెలుగు మహిళ నాయకులు తీవ్రంగా ఖండించారు. జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో రాష్ట్ర పార్టీ కార్యదర్శి సర్వసిద్ధి అనంత లక్ష్మి మాట్లాడారు. హోంమంత్రి అనిత రాజకీయంగా ఎన్నో కష్టాలు ఎదుర్కొని నేటి స్థాయికి చేరుకున్నారని అన్నారు. ఆమె వ్యక్తిత్వాన్ని దెబ్బతీసేలా మాట్లాడటం సరికాదని పేర్కొన్నారు. ప్రతిపక్ష నాయకులు వాస్తవాలు తెలుసుకోకుండా ఆరోపణలు చేయడం మానుకోవాలని ఆమె హితవు పలికారు. ప్రభుత్వ వాహనాలను వ్యక్తిగత ఆస్తులుగా చిత్రీకరించడం, ప్రజలను తప్పుదోవ పట్టించేలా వ్యాఖ్యలు చేయడం బాధ్యతారాహిత్యమని విమర్శించారు. ప్రభుత్వ వాహనాలు ప్రజల సొత్తేనని, వాటి వినియోగం అధికారిక నిబంధనల ప్రకారమే జరుగుతుందని స్పష్టం చేశారు. రాష్ట్ర (తరువాయి 8వ పేజీలో)

## భోగాపురం ఎయిర్‌పోర్టు, కొత్త పరిశ్రమల్లో స్థానికులకు
# 85 శాతం ఉద్యోగాలు కల్పించాలి



**రాజు గౌడ్ యాతా**

విశాఖపట్నం, జూన్ 14, ప్రభాతవార్త:

భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయంతో పాటు ఉత్తరాంధ్రలో ఏర్పాటు కానున్న ప్రభుత్వ, ప్రైవేట్ పరిశ్రమల్లో స్థానిక యువతకు 85 శాతం ఉద్యోగాలు కల్పించాలని ఉత్తరాంధ్ర రాష్ట్రీయ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు రాజు గౌడ్ యాతా డిమాండ్ చేశారు. ఉత్తరాంధ్ర ప్రాంతం ఇప్పటికీ అభివృద్ధి పరంగా వెనుకబడిన ప్రాంతంగానే ఉందని, ఇక్కడ నిరుద్యోగం, పేదరికం అధికంగా ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ప్రాంతంలో ఏర్పాటయ్యే పరిశ్రమలు, సంస్థల్లో స్థానిక యువతకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. అవసరమైతే స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ అందించి ఉద్యోగాలకు అర్హులుగా తీర్చిదిద్దాలని సూచించారు. ఉత్తరాంధ్రలోని సహజ వనరులు, భూములను ఉపయోగించుకుని పరిశ్రమలు స్థాపించి, ఉద్యోగాల విషయంలో స్థానికులను విస్మరించడం సమంజసం కాదన్నారు. స్థానిక యువతకు తగిన అవకాశాలు కల్పించకపోతే ప్రజల్లో తీవ్ర అసంతృప్తి నెలకొనే ప్రమాదం ఉందని హెచ్చరించారు.

భోగాపురం ఎయిర్‌పోర్టు సహా రానున్న ప్రాజెక్టుల ద్వారా ఉత్తరాంధ్ర యువతకు ఉపాధి అవకాశాలు విస్తృతంగా లభించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. స్థానికులకు న్యాయం జరగకపోతే భవిష్యత్తులో ప్రజలు తమ అభిప్రాయాన్ని ప్రజాస్వామ్య పద్ధతుల్లో వ్యక్తం చేస్తారని పేర్కొన్నారు.

ఉత్తరాంధ్ర అభివృద్ధి, స్థానిక నిరుద్యోగ యువత సంక్షేమమే తమ ప్రధాన లక్ష్యమని రాజు గౌడ్ యాతా స్పష్టం చేశారు.

## స్టీల్ ప్లాంట్ మృతుల కుటుంబాల్ని
# తిప్పల దేవన్ రెడ్డి పరామర్శ





విశాఖపట్నం, జూన్ 14, ప్రభాతవార్త :

విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రమాదంలో మృతి చెందిన కుటుంబాల్ని వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ గాజువాక నియోజకవర్గం సమన్వయకర్త తిప్పల శ్రీనివాస దేవన్ రెడ్డి, 85వ వార్డు అధ్యక్షులు పూర్ణానంద శర్మ ఆదివారం పరామర్శించారు. స్టీల్ ప్లాంట్ ప్రమాదంలో మృతి చెందిన 85వ వార్డుకు చెందిన నక్కరాజు అప్పలరాజు కుటుంబాన్ని, 85వ వార్డుకు చెందిన గొంతిన భాను కుమార్ కుటుంబాన్ని పరామర్శించారు. మృతుడి కుటుం బానికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, ఈ కష్ట సమయంలో పార్టీ అండగా ఉంటుందని వారు భరోసా ఇచ్చారు. కుటుంబానికి ఎలాంటి అవసరం వచ్చినా సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు.

## కూర్మగ్రామం సందర్శించిన న్యాయ విద్యార్థులు

(7వ పేజీ తరువాయి) ఒత్తిళ్లు, సామాజిక సమస్యలకు వేద జీవన విధానం ప్రత్యామ్నాయ మార్గాన్ని చూపుతుందని పేర్కొన్నారు.విద్యార్థులు గ్రామంలోని గురుకుల విద్యా విధానం, గోసంరక్షణ, సేంద్రియ వ్యవసాయం, సామూహిక సేవా కార్యక్రమాలను పరిశీలించారు. ఆధ్యాత్మికత వ్యక్తిగత వికాసంతో పాటు సమాజ శ్రేయస్సుకు కూడా దోహదపడుతుందని నిర్వాహకులు వివరించారు. న్యాయ విద్యార్థులు గ్రామ జీవన విధానం తమకు కొత్త అనుభూతిని కలిగించిందని, విలువల ఆధారిత జీవనం, క్రమశిక్షణ, సామాజిక బాధ్యత వంటి అంశాలపై అవగాహన పెరిగిందని అభిప్రాయపడ్డారు. ఈ సందర్శన ద్వారా సంప్రదాయ భారతీయ జీవన విధానం, ఆధ్యాత్మిక దృక్పథంపై సమగ్ర అవగాహన లభించిందని వారు పేర్కొన్నారు.ఈ సందర్శనలో న్యాయ విద్యార్థులు బంగారు అశోక్ కుమార్,తేజ,మహేష్,రవి,శ్రీనివాస్,నితిన్ పాల్గొన్నారు

## చిన్ననాటి జ్ఞాపకాల్లో మునిగిన ఎంపీ చింతకాయల విజయ్

(7వ పేజీ తరువాయి) అనుభవాలను పంచుకున్నారు. పాఠశాలలో పొందిన విద్య, క్రమశిక్షణ, విలువలే తనను నేడు ఈ స్థాయికి తీసుకువచ్చాయని విజయ్ పేర్కొన్నారు. ఒకప్పుడు తనకు ప్రిన్సిపాల్‌గా ఉన్న డి. రామకృష్ణ ప్రస్తుతం పాఠశాల డైరెక్టర్‌గా కొనసాగుతుండటం ఆనందంగా ఉందన్నారు. విద్యార్థులు లక్ష్యసాధనకు కృషి చేయడంతో పాటు క్రమశిక్షణను అలవర్చుకోవాలని సూచించారు. జీవితంలో ఎదురయ్యే సవాళ్లను అధిగమించడానికి విద్యతో పాటు క్రమశిక్షణ ఎంతో అవసరమని పదో తరగతి విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు.

అనంతరం పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బందితో సమావేశమైన ఆయన ఫిజిక్స్ ప్రొఫెసర్ గంటి రామకృష్ణ, హాస్టల్ ఇన్‌చార్జ్ సతీష్, పీటీ శ్రీనివాస్‌తో పాటు నాన్–టీచింగ్ సిబ్బంది జనార్దన్, ఆఫీస్ సిబ్బంది సూరిబాబు, రామకృష్ణ, సురేష్‌లను ప్రత్యేకంగా పలకరించి వారి సేవలను అభినందించారు.

ఎంపీ పర్యటనతో పాఠశాలలో ఆత్మీయ వాతావరణం నెలకొనగా, విద్యార్థులు ఆయనతో ముచ్చటిస్తూ ఫొటోలు దిగేందుకు ఆసక్తి చూపారు.

## మత్స్య వేటకు మళ్లీ జోష్..!

(7వ పేజీ తరువాయి) ఈ సీజన్ మంచి వేటతో ప్రారంభమవుతుందనే ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. వేట నిషేధం ప్రభావం కేవలం మత్స్యకారులపైనే కాకుండా విశాఖ నగరవాసు లపై కూడా పడింది. సాధారణంగా ఫిషింగ్ హార్బర్కు వెళ్లి తాజా చేపలు కొనుగోలు చేసే ప్రజలు గత రెండు నెలలుగా ఆ అవకాశాన్ని కోల్పోయారు. జూన్ 14 అర్ధరాత్రి తర్వాత సముద్రంలోకి వెళ్లే బోట్లు భారీగా చేపల వేట చేపట్టనున్నాయి. ఆ తర్వాత ఫిషింగ్ హార్బర్ మళ్లీ చేపలతో నిండిపోనుండగా, రెండు నెలలుగా ఎదురుచూస్తున్న నగరవాసులు కూడా తాజా చేపల కొనుగోళ్లకు పెద్దఎత్తున తరలివచ్చే అవకాశం ఉంది. ప్రస్తుతం నిశ్శబ్దంగా కనిపిస్తున్న హార్బర్ మరోసారి కోలాహలంతో మారుమో గనుంది. ఈ నెల 15న తెల్లవారుజాము నుంచి చేపల వేట ప్రారంభమవుతుంది. ఇంధన ధరలు పెరిగిన నేపథ్యంలో తొలి విడతలో 50 శాతం బోట్లు వేటకు వెళ్లే అవకాశాలున్నాయి. చేపలరేవు కేంద్రంగా 700 మర పడవలు, మరో వెయ్యి ఇంజిను బోట్లు ఉన్నాయి. సుమారు 11 వేల మందికి పైగా మత్స్యకారులు వాటిపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. డీజిల్ ధర పెరిగిన నేపథ్యంలో ఒక్కో బోటుపై రూ.24 వేల వరకు అదనపు భారం పడనుంది. ప్రస్తుత ధరకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం రాయితీ పెంచుతుందని మత్స్యకారులు ఆశగా పలురుచుస్తున్నాయి.

## నర్సీపట్నంలో అట్టహాసంగా ప్రారంభమైన సురభి నాటక ప్రదర్శనలు

(7వ పేజీ తరువాయి) చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ?సోమవారం 'శ్రీనివాస కళ్యాణం' నాటక ప్రదర్శన ఉంటుందని, ప్రజలందరూ కుటుంబ సమేతంగా పిల్లలతో సహా విచ్చేసి ఈ నాటకాన్ని వీక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్పీకర్ సతీమణి చింతకాయల పద్మావతి, టీడీపీ పట్టణ అధ్యక్షుడు చింతకాయల రాజేష్, ఇతర కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొని నాటక ప్రదర్శనను ఆసాంతం ఆసక్తిగా వీక్షించారు.

## విశాఖలో విమానాశ్రయాన్ని కొనసాగించాలి

**విశాఖ జిల్లా కాపునాడు అధ్యక్షులు గుంటూరు వెంకట నరసింహారావు**

విశాఖపట్నం జూన్ 14 (ప్రభాత వార్త)

విశాఖ విమానాశ్రయాన్ని డొమెస్టిక్ ఎయిర్‌పోర్ట్‌గా కొనసాగించాలని విశాఖ జిల్లా కాపునాడు అధ్యక్షులు గుంటూరు వెంకట నరసింహారావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. విశాఖలోనే విమానాశ్రయాన్ని కొనసాగించా లన్నారు. అన్ని జిల్లాలో విమానాశ్రయాలు వున్నాయిని దేశంలో చాలా ఎయిర్ పోర్టుల్లో నేవీ సివిల్ , తమ కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయిని పేర్కొన్నారు. విశాఖ జిల్లాలో విమానాశ్రయాన్ని మూసివేయాలని నిర్ణయించడం సరికాదన్నారు. విశాఖను కనుమరుగు చేసే పరిస్థితి తీసుకువస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విశాఖ జిల్లా ఎయిర్ పోర్టు ఉండాల్సిందే నన్నారు అది విశాఖ ప్రజల కోరిక అని తెలిపారు. నగరానికి 60 కిలోమీటర్లు దూరంలో ఉండడం వలన ప్రయాణికులు సకాలంలో చేరుకోవడం ఇబ్బంది గా ఉంటుందన్నారు. నగరంలోనే ఉండటంతో ప్రయాణికులకు అత్యంత సౌకర్యవంతంగా ఉంటుందన్నారు. మంత్రులు, ఎమ్మెల్యే లు మాజీ ఎమ్మెల్యే లు ప్రజాప్రతినిధులు అందరు ఏకాత్రాటిపైకి వచ్చి ఎయిర్ పోర్టు ఇక్కడే ఉండాలని ప్రభుత్వం పై ఒత్తిడి తేవాలన్నారు. ఎమ్మెల్యే విష్ణు కుమార్ రాజు తప్ప ఎవరు స్పదించడం లేదన్నారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ను స్వాగత స్తున్నామని అక్కడ నుంచి అంతర్జాతీయ విమాన సర్వీసులను అక్కడ నుంచి నిర్వహించాలన్నారు.

# యారాడ సముద్రంలో బీటెక్ విద్యార్థి గల్లంతు

### మృతదేహం లభ్యం

గాజువాక,జూన్ 14,ప్రభాతవార్త :

సరదాగా గడుపుదామని స్నేహితులతో కలిసి వెళ్లిన ఓ బీటెక్ విద్యార్థి సముద్రపు అలల ఉధృతికి కొట్టుకుపోయి ప్రాణాలు కోల్పోయాడు. యారాడ తీరంలో ఆదివారం చోటుచేసుకున్న ఈ ఘటన స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది.

పోలీసుల కథనం ప్రకారం.. గాజువాక భానోజీతోట ప్రాంతానికి చెందిన పి.అభిషేక్ (19) బీటెక్ చదువుతున్నాడు. ఆదివారం సెలవు దినం కావడంతో స్నేహితులతో కలిసి యారాడ బీచ్‌కు వెళ్లాడు. అందరూ కలిసి సముద్రంలో దిగి స్నానాలు చేస్తుండగా, ఒక్కసారిగా వచ్చిన పెద్ద అల అభిషేక్‌ను లోపలికి లాగేసింది. అలల వేగం ఎక్కువగా ఉండటంతో క్షణాల వ్యవధిలోనే అతడు సముద్రంలో మునిగిపోయాడు.

సమాచారం అందుకున్న న్యూపోర్ట్ పోలీసులు,



మెరైన్ సిబ్బంది వెంటనే రంగంలోకి దిగారు. కోస్ట్ గార్డ్ హెలికాప్టర్, ఎన్డీఆర్ఎఫ్ బృందాలు స్థానిక మత్స్యకారుల సహాయంతో సముద్రంలో ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు. కొన్ని గంటల శ్రమ అనంతరం మత్స్యకారుల వలకు అభిషేక్ మృతదేహం చిక్కింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. కొడుకు మరణవార్త విని తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఆదాయవంతంగా సుస్థిర వ్యవసాయం చేయడం అవసరం

- **ఎల్ నినోని తట్టుకుని వ్యవసాయం చేయగలగాలి**
- **పాడీ, పంటా రెండూ చేయడం అవసరం**
- **అయిదు అంచెల వ్యవసాయం ఆదాయవంతం**
- **చిరంజీవి చౌదరి ప్రిన్సిపల్ సెక్రటరీ, ఎపి ఫుడ్ ప్రాసెసింగ్ డిపార్ట్మెంట్**





విశాఖపట్నం జూన్ 14 (ప్రభాత వార్త)

ఆధాయవంతంగా సుస్థిర వ్యవసాయం చేయడం అవసరం అని ఎపి ఫుడ్ ప్రాసెసింగ్ డిపార్ట్మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ చిరంజీవి చౌదరి కోరారు. ఆదివారం ఉదయం విశాలాక్షి నగర్ లోని బివికె కళాశాలలో గో ఆధారిత ప్రకృతి వ్యవసాయదారుల సంఘం నేతృత్వంలో ఉత్తరాంధ్రా ప్రకృతి రైతులకు శిక్షణ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఎల్ నినోని తట్టుకుని వ్యవసాయం చేయగలగాలి అని వివరించారు. పాడీ, పంటా రెండూ చేయడం అవసరం అని వివరించారు. శీతోష్ణస్థితి మార్పు వల్ల కలిగే విపరీతమైన పరిస్థితులు తట్టుకునే విధంగా దేశీయ విత్తనాలతొ పంటలు పండించడం అవసరం అని వివరించారు. అయిదు అంచెల ప్రకృతి ఆధారంగా వ్యవసాయం చేయడం ఆదాయవంతంగా ఉంటుంది అని పేర్కొన్నారు. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ లు ఏర్పాటు చేయాలి అనుకున్న ఎవరైనా తమను సంప్రదించాలని కోరారు.

భారతీయ కిసాన్ సంఘ్ జాతీయ కార్యవర్గ సభ్యులు జలగం కుమారస్వామి మాట్లాడుతూ విశాఖపట్నం లో రెండు ప్రకృతి పంటల రైతుల సంతలు నిర్వహించడం జరిగింది అన్నారు. అయితే రైతులు పెద్దసంఖ్యలో పంటలు పండిస్తె వాటికి మార్కెటింగ్ తాము కల్పించడం జరుగుతుంది అన్నారు. రసాయన ఎరువులు, రసాయన క్రిమి సంహారకాలు వినియోగించకుండా పంటలు పండించే రైతులను పెంపొందించేందుకు తాము కృషి చేస్తున్నామన్నారు.

ఈ కార్యక్రమంలో గేమ్ సంస్థ ప్రతినిధి సుభాష్ రైతు ఉత్పత్తి దారులకు ఎపెడా ద్వారా ఎగుమతి, దిగుమతి అనుమతి పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ నర్సరీల అసోసియేషన్ అధ్యక్షులు ఆకుల చలపతిరావు, గో ఆధారిత ప్రకృతి వ్యవసాయదారుల సంఘం జిల్లా అధ్యక్షులు దాట్ల సుబ్రహ్మణ్య వర్మ, మేంగో మేన్ అప్పాజీ, పాలెం నేచురల్స్ అశోక్, ప్రకృతి రైతులు రిషి, నరేంద్ర, కరుణాకర్, శంకర్, త్రివిక్రమ్, శ్రీనాథ్, బివిఆర్ రాజు, ప్రసాద్ రాజు, ఉషా గజపతి రాజు, శ్రీదేవి, సిఫా ట్రస్ట్ సిఇఒ డాక్టర్ శశిప్రభ, గ్రీన్ క్లైమేట్ టీం ఎన్జిఒ వ్యవస్థాపక కార్యదర్శి జెవి రత్నం, సమన్వయ కర్త పి. భాస్కర్ తదితరులు మాట్లాడారు.

## అవినీతిపై ఉక్కుపాదం..!

**కమిషనర్ కేతన్ గార్గ్**

- **జీవీఎంసీలో జీరో కరప్షన్ లక్ష్యం**
- **లంచం అడిగినా.. పనుల్లో జాప్యం చేసినా టోల్‌ఫ్రీకి ఫిర్యాదు చేయండి**

విశాఖపట్నం, జూన్ 14 (ప్రభాత వార్త):

మహా విశాఖ నగరపాలక సంస్థ (జీవీఎంసీ)లో అవినీతి నిర్మూలనకు ప్రత్యేక కార్యాచరణ ప్రారంభించినట్లు జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ ప్రకటించారు. అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది విధుల నిర్వహణలో జాప్యం చేసినా, అవినీతికి పాల్పడినా కఠిన శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో కమిషనర్ మాట్లాడుతూ, జీవీఎంసీని పూర్తిస్థాయి "జీరో కరప్షన్" సంస్థగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా చర్యలు చేపట్టామని తెలిపారు. ప్రజలకు సంబంధించిన పనులు, అనుమతులు, అభివృద్ధి కార్యక్రమాలు, మౌలిక సదుపాయాలు, సంక్షేమ కార్యక్రమాల్లో ఎలాంటి జాప్యం, నిర్లక్ష్యం లేదా అవినీతి సహించబోమన్నారు.

జీవీఎంసీ టౌన్ ప్లానింగ్, ఇంజినీరింగ్, ప్రజారోగ్యం, రెవెన్యూ, యూసీడీ, హార్టికల్చర్ తదితర విభాగాల్లో ఎవరైనా లంచాలు డిమాండ్ చేసినా, కావాలనే పనులు పెండింగ్‌లో పెట్టినా వెంటనే టోల్ ఫ్రీ నంబర్ 1800 4250 0009కు ఫిర్యాదు చేయాలని ప్రజలకు సూచించారు. ప్రజా ఫిర్యాదులు, అనుమతులు, ఇతర పరిపాలనా అంశాలకు సంబంధించిన ఫైళ్లపై రెండు రోజుల్లోగా చర్యలు తీసుకుని పరిష్కార మార్గం చూపాలని ఇప్పటికే అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. ప్రజల నుంచి వచ్చే ప్రతి ఫిర్యాదును తాను స్వయంగా పర్యవేక్షిస్తానని స్పష్టం చేశారు. జీవీఎంసీ పరిపాలనలో పారదర్శకత, జవాబుదారీతనం పెంపొందించేందుకు ఉన్నతాధికారులు, విభాగాధిపతులకు ఇప్పటికే పలుమార్లు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చామని కమిషనర్ పేర్కొన్నారు. ప్రజలు నిర్భయంగా ముందుకు వచ్చి అవినీతి, అక్రమాలపై సమాచారం అందించాలని, అవినీతి రహిత జీవీఎంసీ నిర్మాణానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

## ఉక్కు నిర్వాసితుల పోరు బాట

(7వ పేజీ తరువాయి)

కొవ్వాత్తులు జంక్షన్ వద్ద వంటావార్పు కార్యక్రమం చేయాలని కమిటీ తీర్మానం చేస్తూ కరపత్రం విడుదల చేసింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సంఘం అధ్యక్షుడు పితాన భాస్కరరావు మాట్లాడుతూ స్టీల్ ప్లాంటి కి భూములిచ్చి 45 సంవత్సరాలు అయినా ఇప్పటికీ శాశ్వత పరిష్కారం చేయలేదు కాబట్టి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి ఉక్కు నిర్వాసితులందరికీ న్యాయం చేయాలని కోరారు. వచ్చే నెల 4వ తేదీన స్టీల్ ప్లాంట్ కొవ్వాత్తుల జంక్షన్ వద్ద దగ్గర నిరసన కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున చేపడతామన్నారు. నిర్వాసితులందరూ పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చా రు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి ఉమ్మడి అప్పారావు, గల్లా రామకృష్ణ, శీర సంజీవ్రావు, జ్యోతి రెడ్డి, వడ్లపూడి చిన్న. కోన రమణ, అంగ దేముడు, ఒనము రాజు, ఈశ్వరరావు, కేత గణేష్, బాలు, సాంబ, గెద్దాడ అప్పలకొండ, 64 గ్రామాల నుంచి పెద్ద ఎత్తున నిర్వాసితులు, జేఏసీ కమిటీ పెద్దలు పాల్గొన్నారు.

## హోంమంత్రి అనితపై అనుచిత వ్యాఖ్యలు ఖండనీయం

(7వ పేజీ తరువాయి)

అభివృద్ధి, పెట్టుబడుల ఆకర్షణ కోసం ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను విమర్శించడం కంటే నిర్మాణాత్మక సూచనలు చేయాలని ప్రతిపక్షాలకు సూచించారు. ఈ సమావేశంలో తెలుగు మహిళ నాయకులు కేదారి లక్ష్మి, తాడి వేణికుమారి, బోయి రమాదేవి, దాడి రామలక్ష్మి, కంఠంశెట్టి భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు నగరంలో ఆనందంగా "హ్యాపీ సండే" కార్యక్రమాలు.

## నగరంలో ఆనందంగా 'హ్యాపీ సండే' కార్యక్రమాలు

**హ్యాపీ సండే కార్యక్రమాలలో ఉత్సాహంగా పాల్గొన్న నగర ప్రజలు**

**జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్**

విశాఖపట్నం, జూన్ 14 (ప్రభాత వార్త):

రాష్ట్ర మునిసిపల్ పరిపాలన ఠ పట్టణాభివృద్ధి శాఖ ఆదేశాలు, మార్గదర్శకాలతో విశాఖ నగరంలో అన్ని జోన్ల పరిధిలో ఆనందంగా "హ్యాపీ సండే" కార్యక్రమాలు ఆదివారం అద్భుతంగా నిర్వహించడమైనదని , హ్యాపీ సండే కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో ఉత్సాహంగా ప్రజలు ,నివాసిత సంక్షేమ సంఘాలు, విద్యార్థినీ విద్యార్థులు ,సీనియర్ సిటిజనులు, వాకర్స్ క్లబ్ అసోసియేషన్లు , స్వయం సహాయక సంఘ సభ్యులు , ఆర్పీలు పాల్గొని హ్యాపీ సండే కార్యక్రమాన్ని జయప్రదం చేశారని , అలాగే యోగా దినోత్సవం సందర్భంగా జరుగబోవు యోగాంధ్ర కార్యక్రమాల్లో ప్రజలు భాగస్వామ్యం కావాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ ఆదివారం పత్రికా ప్రకటన ద్వారా తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఈ కార్యక్రమాల ద్వారా ప్రజల్లో ఆరోగ్యకరమైన జీవనశైలి, సామాజిక ఐక్యత పెంపొందించడం లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమాలకు అన్ని వర్గాల ప్రజల నుండి మంచి స్పందన లభిస్తున్నదని ఆయన పేర్కొన్నారు. ఉదయం 6:00 గంటల నుండి 9:00 గంటల వరకు పార్కులు, ఓపెన్ స్పేసులు, కమ్యూనిటీ హాల్స్, కళ్యాణ మండపాలు, క్రీడా ప్రాంగణాలు ,బహిరంగ ప్రదేశాలు వంటి ప్రదేశాలలో కార్యక్రమాలు నిర్వహించబడ్డాయని యోగ క్రియలు వల్ల ఉపయోగాలు ఆరోగ్య పరిరక్షణ తదితర అంశాలపై అవగాహన కార్యక్రమాలు క్రీడలు, యోగా, నృత్యం, పాటలు, మిమిక్రీ , వేసవి అవగాహన కార్యక్రమాలు, సాంస్కృతిక మరియు వినోదాత్మక కార్యక్రమాలు నిర్వహించి ఉత్సాహభరిత వాతావరణం కల్పించామన్నారు.

## అర్హులైన ఓటర్లను తొలగించే ఎస్. ఐ. ఆర్.నిలిపివేయాలి

**ఆవాజ్ సెమినార్లో వక్తలు ఎం వీ ఎస్ శర్మ, ఆవాజ్ కార్యదర్శి ఎం. ఎ. బిష్టి**







విశాఖపట్నం జూన్ 14 ప్రభాత వార్త

ఆంధ్రప్రదేశ్లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్ ) ప్రక్రియ వలన అర్హులైన ఓటర్లను తొలగించే చర్యలతో పాటు అది పౌరసత్వాన్ని చాపక్రింద నీరులా అమలు చేసే ప్రక్రియ ఉత్తరాంధ్ర పట్టభద్రుల పూర్వ ఎమ్మెల్సీ ఎం.వి.ఎస్.శర్మ ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శి ఎం.ఏ. బిష్టి తెలిపారు.ఆవాజ్ విశాఖ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో సర్ ప్రక్రియ దాని పరిణామాలు అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. ఎ.ఎ. అష్రఫ్ అధ్యక్షతన జరిగిన ఈ సెమినార్లో వక్తలు మాట్లాడుతూ ఇప్పటికే అనేక రాష్ట్రాలలో ఎస్ఐఆర్ (ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ) అమలు వలన లక్షల ఓట్లు గల్లంతయ్యాయన్నారు. సుప్రీం కోర్టులో కేసు పెండింగ్లో ఉన్నా దీనిని ఆంధ్రరాష్ట్రంలో అమలుకు పూనుకోవడాన్ని తప్పుపట్టారు. పశ్చిమబెంగాల్లో 90 లక్షల ఓట్లు గల్లంతయ్యాయి. తమిళనాడు, బీహార్, కేరళ, అస్సాం వంటి రాష్ట్రాలలో అక్రమాలు జరిగి అర్హులైన లక్షల ఓట్లు తొలగించబడ్డారు. పేదలు, వలస కార్మికులు, మైనారిటీలు, బలహీనవర్గాలు, ఓటు హక్కు కోల్పోయినవారిలో అత్యధికంగా ఉన్నారు. హర్యానా, కర్నాటక రాష్ట్రాలలో లక్షలాదిమందిని అక్రమంగా ఓటర్ల జాబితాలో చేర్చినట్లు వెల్లడైంది. బహిర్గతమైన కేసులపై ఎన్నికల కమిషన్ (ఆసిలు) ఎటువంటి చర్యలూ తీసుకోలేదన్నారు. ఎపిలో అధికార, ప్రతిపక్షపార్టీల నాయకులకు భయపట్టుకున్నా దీనిని వ్యతిరేకించక పోవడం దురదృష్టకరమన్నారు. ఎస్.ఐ.ఆర్ వలన ఉన్న ఓటర్ల కూడా తమ గుర్తింపును నిరూపించుకోవాలని అన్నారు. ఇది ఓటర్ల సవరణ జాబితా కాదని తెలిపారు. దీనిని అన్ని వర్గాల ప్రజలు తీవ్రంగా ఖండించాలన్నారు. రేపటి నుండి జరిగే ఎస్.బి. ఆర్ను ముస్లిం సోదరులంతా ఎదుర్కొవాలన్నారు. ఎస్.కె. హుస్సేన్, రెహ్మాన్, ఎం.ఎ. రజాక్, మొహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

## వివాదాల సుడిగుండంలో 'ఐలా' ఎన్నికల ఫలితం!

గాజువాక,జూన్ 14,ప్రభాతవార్త :

గాజువాక ఆటోనగర్‌లోని (ఐలా)పారిశ్రామిక ప్రాంత సర్వీస్ సొసైటీ ఎన్నికల నిర్వహణ, లెక్కింపు ప్రక్రియ తీవ్ర వివాదాస్పదంగా మారింది. కేవలం ఒక్క ఓటు తేడాతో గెలుపోటములు మారిన ఈ ఎన్నికల్లో పెద్ద ఎత్తున అక్రమాలు చోటుచేసుకున్నాయని ప్రతిపక్ష ప్యానల్ నాయకులు ఆరోపిస్తున్నారు. అధికారుల ఏకపక్ష వైఖరి వల్లే తుది ఫలితం తారుమారైందని వారు ధ్వజమెత్తారు.

ఎన్నికల అధికారి ఆదిశేషు పర్యవేక్షణలో మొత్తం 1,030 మంది ఓటర్లకు గానూ 854 ఓట్లు పోలయ్యాయి. చైర్మన్ అభ్యర్థులుగా పోటీ పడిన కొల్లి ఈశ్వరరావు, యార్లగడ్డ సాంబశివరావుల మధ్య హోరాహోరీ పోరు సాగింది. అయితే, పోలింగ్ బూత్‌లో ఓటు వేయడానికి కేటాయించిన అధికారిక 'స్వస్తిక్' ముద్ర ముందే దెబ్బతిని ఉండటం తీవ్ర వివాదానికి దారితీసింది.

సగం ఊడిపోయిన ఆ ముద్రతో ఓటు వేసినా చెల్లుతుందని అధికారులు నమ్మబలికారని.. తీరా లెక్కింపు సమయానికి వచ్చేసరికి ఆ ఓట్లను 'చెల్లనివి'గా ప్రకటించారని నవభారత్ ఫౌండ్రీస్ ప్రతినిధి లంక సుబ్బారావు (పెద్దబాబు), శ్రీ లక్ష్మి ఎంటర్‌ప్రైజెస్ ప్రతినిధి లక్ష్మీదేవి అల్లాపర్తి ఆవేదన వ్యక్తం చేశారు. సిబ్బంది తప్పుకు ఓటర్లను బాధ్యులను చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

దీనికితోడు కొన్ని పోస్టల్ బ్యాలెట్లను సరైన ధృవీకరణ లేకుండానే లెక్కించారని, దీనిపై తాము అభ్యంతరం తెలిపి రీకౌంటింగ్ కోరినా ఎన్నికల అధికారి ఏకపక్షంగా నిరాకరించారని ప్యానల్ నేతలు ఆరోపించారు. అధికారుల పక్షపాత వైఖరికి నిరసనగా తాము ఫలితాల డిక్లరేషన్ ఫారమ్‌పై సంతకం చేయలేదని చైర్మన్ అభ్యర్థి స్పష్టం చేశారు. పక్కా ఆధారాలతో త్వరలోనే ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించి న్యాయపోరాటం చేస్తామని ప్రతిపక్ష ప్యానల్ శ్రేణులు వెల్లడించాయి.






## వేములవలస జాతీయ రహదారిపై ఘోర ప్రమాదం

### - లారీ చక్రాల కింద పడి యువకుడి దుర్మరణం .. యువతికి గాయాలు



ఆనందపురం, జూన్ 14, ప్రభాతవార్త:

ఆనందపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని వేములవలస జాతీయ రహదారిపై ఆదివారం ఉదయం చోటుచేసుకున్న ఘోర రోడ్డు ప్రమాదం స్థానికులను కలచివేసింది. అరిలోవకు చెందిన పతివాడ సుశాంత్ (18) అనే యువకుడు దారుణంగా ప్రాణాలు కోల్పోగా, అతనితో ప్రయాణిస్తున్న యువతి గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఆనందపురం ట్రాఫిక్ ఎస్ఐ పి. పాపారావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నగరంలోని ఆరిలోవ ప్రాంతానికి చెందిన పతివాడ శ్రీనుకు సుశాంత్ తో పాటు మరో కుమారుడు ఉన్నాడు. శ్రీను ఆటో నడుపుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కాగా విజయనగరంలో ఉంటున్న సుశాంత్ స్నేహితుడు మృతి చెందాడు. అతనిని చూడడానికని ఆదివారం ఉదయం సుశాంత్ ఒక యువతితో కలిసి ద్విచక్ర వాహనంపై అరిలోవ నుంచి బయలుదేరి విజయనగరం వెళ్తుండగా వేములవలసకు సమీపంలో జాతీయ రహదారిపై ద్విచక్ర వాహనం అదుపుతప్పి సెంటర్ డివైడర్‌ను బలంగా ఢీకొనగా ప్రమాద తీవ్రతకు ఇద్దరూ రోడ్డుపై పడిపోయారు. అయితే అదే దిశలో వెనుక నుంచి వస్తున్న లారీని డ్రైవర్ అదుపు చేయలేకపోవడంతో రోడ్డుపై పడిపోయిన సుశాంత్‌పైకి దూసుకెళ్లి తలపై నుంచి వెళ్లడంతో యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ దృశ్యం చూసిన స్థానికులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు.గాయపడిన యువతిని వెంటనే కేజీహెచ్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భీమిలి ప్రభుత్వ అస్పత్రికి తరలించారు. ఘటనపై ఆనందపురం సీఐ వాసునాయుడు కేసు నమోదు చేసి ప్రమా దానికి గల కారణాలపై దర్యాప్తు చేపట్టారు. యువకుడి ఆకస్మిక మృతితో కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరయ్యారు. ఒక చిన్న నిర్లక్ష్యం, వేగం ప్రాణాలను ఎలా బలి తీసుకుంటుందో ఈ విషాద ఘటన మరోసారి గుర్తు చేసింది.

## నైపుణ్యాభివృద్ధితో మహిళా సాధికారతకు కొత్త దిశ

ఆనందపురం, జూన్ 14, ప్రభాతవార్త:



విశాఖపట్నంలోని మర్రిపాలెం రైల్వే ఇన్‌స్టిట్యూట్‌లో ఆదివారం నిర్వహించిన నైపుణ్యాభివృద్ధి కార్యక్రమం మహిళల స్వయం ఉపాధి, ఆత్మనిర్భరతకు ప్రోత్సాహ కరంగా నిలిచింది. కార్యక్రమంలో ఆనందపురం గ్రామానికి చెందిన మామిడి వసుంధర టైలరింగ్ కోర్సును విజయవంతంగా పూర్తి చేశారు.శిక్షణ అనంతరం స్వయం ఉపాధి అవకాశాలను ప్రోత్సహించే భాగంగా విశాఖపట్నం నైపుణ్యాభివృద్ధి బృందం మామిడి వసుంధరను ఎంపిక చేయగా విశాఖపట్నం డీఎస్పీ భవ్యారెడ్డి చేతుల మీదుగా కుట్టు మిషన్‌ను అందజేసింది. ఈ సందర్భంగా వసుంధరకు అభినందనలు తెలియజేస్తూ, ఆమె భవిష్యత్తులో స్వయం ఉపాధి ద్వారా ఆర్థికంగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాన్ని ఆనందపురం భజన మండలి, శ్రీ సత్యసాయి సేవా సంస్థ జిల్లా విభాగం సహకారంతో నిర్వహిస్తున్నారు. మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడమే కాకుండా, వారి ప్రతిభను వెలికితీసి స్వతంత్రంగా నిలబడేలా చేయడమే శిక్షణ కార్యక్రమాల ప్రధాన లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న సత్య సాయి రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణరావు శిక్షణార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, నైపుణ్యాభివృద్ధి కోర్సులు మహిళల జీవితాల్లో సానుకూల మార్పులు తీసుకువస్తాయని, స్వయం ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని సూచించారు.

## అభాగ్యులకు అన్న ప్రసాద వితరణ

విశాఖపట్నం జూన్ 14 ప్రభాతవార్త



అక్కయ్యపాలెం వాగ్దేవి పాఠశాల ప్రాంగణం వద్ద అభాగ్యులకు అన్నార్తులకు అన్నప్రసాద వితరణ చేయడం జరిగింది. కార్యక్రమాన్ని వాగ్దేవి ప్రిన్సిపల్ ఎంవివి సత్యనారాయణ శ్రీ లక్ష్మీ శైలజ ఆధ్యాత్మికవేత్త ఎంవి రాజశేఖర్ ప్రారంభించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 14 సంవత్సరాలుగా ప్రతి ఆదివారం క్రమం తప్పకుండా అన్న ప్రసాద వితరణ చేస్తున్నామని తెలిపారు . కార్యక్రమంలో ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎం వి రాజశేఖర్ , ద్వారకా నగర్ లయన్స్ క్లబ్ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## సింహాచలంలో సాయి నగర్ ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నీ ప్రారంభం

### ప్రారంభించిన జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల

సింహాచలం, ప్రభాత వార్త, జూన్ 14:




క్రీడలతో ఉల్లాసం.. ఉత్సాహం కలగడంతో పాటు మానసిక ప్రశాంతత.. శారీరిక దేహ దారుఢ్యముతో పాటు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు కూడా లభిస్తాయని సింహాచలం దేవస్థానం ధర్మకర్తల మండలి మాజీ సభ్యులు.. జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి.. ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు అన్నారు.. ఆదివారం సింహాచలం ప్రాంతంలో సాయి నగర్ ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నీని ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు.. ఈ సందర్భంగా గంట్ల శ్రీనుబాబు మాట్లాడుతూ వారం రోజులు పాటు పలువురు క్రీడాకారులు ఈ టోర్నీలో పాల్గొనడం వల్ల గ్రామంలో ఉన్న యువత అంతా ఒకే చోట కలుసుకోవడానికి అవకాశం కలుగుతుందన్నారు.. అలాగే క్రీడల్లో ప్రతిభ పాటవాలు ప్రదర్శించడానికి యువతకు ఇటువంటి టోర్నీలు ఎంతగానో దోహదం చేస్తాయన్నారు.. సింహాచలం సాయి నగర్ లో నిర్వహిస్తున్న ఈ టోర్నీకి తన వంతు సంపూర్ణ సహకారం అందిస్తానన్నారు.. సింహాద్రి నాథుడు వెలసియున్న సింహాచలం గ్రామంలో మరిన్ని క్రీడా పోటీలు నిర్వహించి గ్రామానికి తద్వారా జిల్లాకు పేరు ప్రతిష్టలు తీసుకురావాలని ఈ సందర్భంగా గంట్ల శ్రీను బాబు నిర్వాహకులను కోరారు.గౌరవ అతిథిగా సింహగిరి గ్యాస్ ఏజెన్సీ యజమాని గంట్ల కిరణ్ బాబు.. నవయుగ సేవా సంఘం అధ్యక్షులు ఎన్ ప్రవీణ్ కుమార్.. టోర్నీ నిర్వాహకులు హరీష్ .. కోన శ్రీనివాస్..చైతన్య.. సువ్వాడ మణికంఠ..రాజేటి రాము .చిన్నారావు.. గంట్ల వెంకటేష్.. తిరుపతి శ్రీనివాస రావు.. సిడగం పేటకు చెందిన.. శ్రీనివాస్ రావుతో పాటు పెద్ద ఎత్తున క్రీడాకారులంతా పాల్గొన్నారు.

## ఏపీపీఎస్సీ ఫలితాల్లో కానిస్టేబుల్ భాస్కరరావు ప్రతిభ

### అర్థశాస్త్ర అధ్యాపకుడిగా ఎంపిక





ఆరిలోవ, జూన్ 14, ప్రభాతవార్త :

ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) డిగ్రీ లెక్చరర్ ఫలితాల్లో త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న రెడ్డి భాస్కరరావు అర్థశాస్త్ర అధ్యాపకుడిగా ఎంపికై ప్రతిభ కనబరిచారు. ఒక వైపు కానిస్టేబుల్‌గా బాధ్యతలు నిర్వహిస్తూనే మరోవైపు దూర విద్య ద్వారా పీజీ పూర్తి చేశారు. అనంతరం డిగ్రీ కళాశాలల అధ్యాపక పోస్టులకు సన్నద్ధమయ్యారు. 2025 జులైలో జరిగిన రాత పరీక్షకు హాజరవగా ఈనెల 13న ఏపీపీఎస్సి ప్రకటించిన తుది ఫలితాల్లో ఆయన ఎకనామిక్స్ లెక్చరర్‌గా ఎంపికయ్యారు. 2018లో పోలీస్ శాఖలో ఉద్యోగం సాధించి కానిస్టేబుల్‌గా తొలి పోస్టింగ్ ఆరిలోవ పోలీస్ స్టేషన్లో విధులు నిర్వహిస్తూనే ఎంఏ ఎకనామిక్స్ దూరవిద్య ద్వారా పూర్తి చేశారు. బదిలీపై త్రీ టౌన్ స్టేషన్ కి రాగా విధి నిర్వహణలోనే ఉంటూనే పట్టుదలతో చదివి డిగ్రీ కళాశాల అధ్యాపకుడిగా (లెక్చరర్) గా ఎంపిక కావడం విశేషం. ఎకనామిక్స్ లెక్చరర్ గా ఎంపికైన కానిస్టేబుల్ రెడ్డి భాస్కరరావును శాసనమండలి ప్రభుత్వ విప్ వేపాడ చిరంజీవి రావు, డీఈఓ ప్రేమ్ కుమార్ కలిసి సాలువా సాలువాతో సత్కరించి అభినందనలు తెలియజేశారు. భాస్కరరావు భవిష్యత్తులో మరిన్ని ఉన్నత విజయాలు సాధించాలని వారు ఆశీర్వదించారు.




## రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతి

ఎలమంచిలి, జూన్ 14, ప్రభాతవార్త:





జాతీయ రహదారి కొక్కిరాపల్లి జంక్షన్ సమీపంలో ఆదివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందినట్లు రూరల్ ఎస్సై ఉపేంద్ర తెలిపారు. రూరల్ ఎస్సై ఉపేంద్ర తెలిపిన వివరాలు ప్రకారం జాతీయ రహదారి కొక్కిరాపల్లి జంక్షన్ సమీపంలో అనకాపల్లి వైపు నుండి తుని వైపు వెళ్ళు రోడ్డు మార్గమున ఒరిస్సా నుండి కాకినాడకు వర్కటింగ్ మిషన్ తీసుకువెళ్తున్న ఐచర్ వ్యాన్ మెకానికల్ బ్రేక్ డౌన్ అయ్యి రోడ్డుపై ఆగిపోగా, సదురు వాహనాన్ని పరిశీలించడానికి ముందు క్యాబిన్లో నుండి ఇద్దరు వ్యక్తులు బయటకు వచ్చి సదరు వ్యాన్ వెనుక లో ఉన్న సమయంలో వెనుక నుండి వస్తున్న కంటైనర్ లారీ అతివేగంగా వచ్చి రోడ్డుపై ఆగి ఉన్న వ్యాన్ ను గుద్దడంతో ఈ ప్రమాదం లో వెనుక నుండి వ్యానుని పరిశీలిస్తున్న ఇద్దరు వ్యక్తులు బలమైన గాయాలు అవ్వగా వారిని హైవే అంబులెన్స్ లో అనకాపల్లి ఎన్టీఆర్ ఆసుపత్రికి తరలించిగా అక్కడ చికిత్స పొందుతూ ఇద్దరు మృతి చెందినట్లు తెలిపారు. మృతి చెందిన వారు వరి కటింగ్ మిషన్ యజమాని అయిన కాకినాడ జిల్లా కరప మండలం గొడ్డటి పాలెం గ్రామానికి చెందిన వాసంశెట్టి సుబ్రహ్మణ్యం, మరొక వ్యక్తి వ్యాన్ నడుపుతున్న డ్రైవర్ వర్మాకి చెందిన రతన్ పూజారి అని తెలిపారు. మృతి చెందిన సుబ్రహ్మణ్యం ఒక్క బావ ఇచ్చిన ఫిర్యాదు మేరకు రూరల్ ఎస్సై ఉపేంద్ర కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## స్టీల్ ప్లాంట్ మృతుల కుటుంబాలకు కోటి రూపాయల పరిహారమివ్వాలి

### -మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి డిమాండ్

గాజువాక,జూన్ 14,ప్రభాతవార్త :



విశాఖ స్టీల్ ప్లాంట్ ఎస్ఎంఎస్-1 ప్రమాదంలో మృతి చెందిన పది మంది కార్మికులకు ఆదివారం పెదగంట్యాడ జంక్షన్ వద్ద వైఎస్సార్సీపీ ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గాజువాక మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి పాల్గొని మృతులకు శ్రద్ధాంజలి ఘటించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ.. యాజమాన్య నిర్లక్ష్యం, రా మెటీరియల్ నాణ్యత లోపం వల్లే ఈ ఘోర ప్రమాదం జరిగిందని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం, మేనేజ్‌మెంట్ కేవలం రూ.25 లక్షల పరిహారంతో చేతులు దులుపుకోవడాన్ని అఖిలపక్ష యూనియన్లు, వైఎస్సార్సీపీ తీవ్రంగా ఖండిస్తున్నాయన్నారు. కూటమి ప్రభుత్వం ప్రైవేటీకరణపై చూపుతున్న శ్రద్ధ కార్మికుల రక్షణపై పెట్టడం లేదని, గత రెండేళ్లలో వేలాది మంది కార్మికులను తొలగించడం దారుణమన్నారు. మృతి చెందిన ప్రతి కుటుంబానికి రూ. కోటి నష్టపరిహారం, ఇంటికొక పర్మనెంట్ ఉద్యోగం ఇవ్వాలని, ప్రైవేటీకరణను రద్దు చేసి జీతాలు సక్రమంగా చెల్లించాలని నాగిరెడ్డి డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్సీపీ నాయకులు మారిటిపూడి పరదేశి, గొందేసి శ్రీనివాస్ రెడ్డి (బుజ్జి), గంట్యాడ గురుమూర్తి, మహేశ్వర్ రెడ్డి, పల్లా చిన్నతల్లి, తదితరులు పాల్గొన్నారు.

## ఓటర్ల జాబితా సవరణపై భాజపా 'బీఎల్ఏ-2' కార్యశాల

గాజువాక, జూన్ 14,ప్రభాతవార్త :



పార్టీ బలోపేతానికి బూత్ స్థాయి నుంచి కార్యకర్తలు శ్రమించాలని భాజపా జిల్లా అధ్యక్షుడు పరశురామ్ రాజు పిలుపునిచ్చారు. గాజువాక పాతకర్ణవానిపాలెంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణపై నియోజకవర్గ స్థాయి 'బీఎల్ఏ-2' కార్యశాల ఆదివారం కరణంరెడ్డి నరసింగరావు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి సురేంద్ర మోహన్, సోషల్ మీడియా కన్వీనర్ కేశవ్ కాంత్, ఎంఎస్ఎంఈ డైరెక్టర్ విజయానంద్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా ప్రారంభం కానున్న 'సర్' కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గంలోని 309 పోలింగ్ కేంద్రాల ఏజెంట్లకు దిశానిర్దేశం చేశామన్నారు. ఓటర్ల జాబితాలో చనిపోయిన వారి పేర్లు, నకిలీ ఓట్లను తొలగించి జాబితాను పారదర్శకంగా మార్చాలని సూచించారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరితో ఓటు నమోదు చేయించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు దామ సుబ్బారావు,సిరసపల్లి నూకరాజు, సోంబాబు, శంకరరావు, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

## చిన్నారి చదువుకు 'టి.డి.ఎస్. ఫౌండేషన్' భరోసా

గాజువాక, జూన్ 14, ప్రభాతవార్త :



అకాల మరణం చెందిన గండేపల్లి సంతోష్ కుమార్ కుమార్తె చదువుకు 'టి.డి.ఎస్. ఫౌండేషన్' అండగా నిలిచింది. మూడో తరగతి చదువుతున్న ఆ చిన్నారి విద్యాభ్యాసానికి ఆటంకం కలగకుండా ఉండేందుకు పుస్తకాలు, యూనిఫామ్, స్కూల్ ఫీజుల నిమిత్తం దాతల సహకారంతో సేకరించిన రూ.18,500 ఆర్థిక సహాయాన్ని ఆదివారం కుటుంబ సభ్యులకు అందజేశారు.ఈ సందర్భంగా ఫౌండేషన్ ప్రతినిధి ఢిల్లీ సనపల మాట్లాడుతూ.. చిన్నారి చదువుకు మున్ముందు కూడా తమ వంతు సహాయం అందిస్తామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు గెద్దం విష్ణు, పట్నాల రమేష్, గోపికృష్ణ, శివ , తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ కృష్ణ అర్పణంలో భక్తిరస నృత్య ప్రదర్శనలు

ఆనందపురం, జూన్ 14, ప్రభాతవార్త :



హరే కృష్ణ మూవ్ మెంట్ ఆధ్వర్యంలో గంభీరం ఐఐఎం రోడ్డులోని హరే కృష్ణ వైకుంఠంలో ఉన్న శ్రీ శ్రీ రాధా మధన మోహన్ మందిరంలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన "శ్రీ కృష్ణఅర్పణం" కార్యక్రమం భక్తి, కళల సమ్మేళనంగా విశేషంగా ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో శ్రీ నటరాజా నాట్య కళాక్షేత్రం కళాకారులు చేరకపు తర్లాడా ఆశ, చేరకపు లాస్య ఆధ్వర్యంలో శ్రీకృష్ణుని లీలలను నృత్యరూపంలో అద్భుతంగా ప్రదర్శించారు. చైత్ర, హర్షిత, దీపికా, వర్షిణి, స్వాతి వర్షిణి, డీవంశీ, ధరణి, లావణ్య, గీతికా, రోషిని, నిహారిక, పూర్విక, సాయి హర్షిని తదితర కళాకారులు తమ ప్రతిభను చాటుతూ భక్తి భావాన్ని ప్రేక్షకులకు చేరవేశారు.ఈ సందర్భంగా కార్యక్రమంలో పాల్గొన్న కళాకారులను హరే కృష్ణ మూవ్ మెంట్ విశాఖపట్నం అధ్యక్షులు డాక్టర్ నిష్కించన భక్త దాస అభినందించి, భారతీయ సాంస్కృతిక సంప్రదాయాల పరిరక్షణలో ఇటువంటి భక్తి కళా కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. "శ్రీ కృష్ణ అర్పణం" కార్యక్రమం ద్వారా సంగీతం, నృత్యం మరియు ఇతర సాంప్రదాయ కళారూపాలను శ్రీకృష్ణ భగవానునికి భక్తిపూర్వక సమర్పణగా అందించే అవకాశం కల్పిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. భక్తి ద్వారా భారతీయ ఆధ్యాత్మిక వారసత్వాన్ని ప్రోత్సహించడం, కళ ద్వారా భక్తిని ప్రజల్లో మరింతగా వ్యాప్తి చేయడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని వివరించారు. రాబోయే ఆదివారాల్లో నిర్వహించే "శ్రీ కృష్ణఅర్పణం" కార్యక్రమాల్లో పాల్గొనదలచిన కళాకారులు 95425 11108 నంబర్ లో సంప్రదించాలని హరే కృష్ణ వైకుంఠం ప్రతినిధి అంబరీష దాస కోరారు.

## మూడో విజయాన్ని నమోదు చేసిన అమరావతి రాయల్స్

### ఆల్‌రౌండ్ ప్రదర్శనతో ఆకట్టుకున్న అమరావతి రాయల్స్ ప్లేయర్ శశికాంత్

### సల్ప లక్ష్యాన్ని సైతం ఛేదించలేకపోయిన భీమవరం జట్టు

విశాఖపట్నం, జూన్ 14, ప్రభాతవార్త:



ఏసీ ఏ వి డి సి ఏ స్టేడియం విశాఖపట్నం వేదికగా ఏపీఎల్ 2026 సీజన్ 5 ఆరవ రోజు మొదటి మ్యాచ్ లో క్యాపిటల్ అమరావతి రాయల్స్ జట్టు , భీమవరం బుల్స్ జట్లు పోటీ పడ్డాయి టాస్ గెలిచిన అమరావతి జట్టు మొదటిగా బ్యాటింగ్ చేయాలని నిర్ణయించుకుంది.మొదటిగా బ్యాటింగ్ చేసిన అమరావతి జట్టు ఓపెనర్లు ఇద్దరూ తక్కువ పరుగులకే అవుట్ కావడంతో శుభ ఆరంభం ఆ టీమ్‌కు అందలేదు. దీంతో మిడిల్ ఆర్డర్ బ్యాటర్స్ టీంను ఆదుకున్నారు వర్షం కారణంగా మ్యాచ్కు కాసేపు అంతరాయం ఏర్పడింది. దీంతో సమయాభావం వలన అంపైర్లు ఒక ఓవర్ ను కుదించారు 19 ఓవర్లకే మ్యాచును జరిపించడం జరిగింది. అమరావతి జట్టు 18.4 ఓవర్లలో 169 పరుగులకు ఆల్ అవుట్ అయింది వన్ డౌన్ బ్యాట్స్మెన్ వెంకట రాహుల్ 20 బంతుల్లో 43 పరుగులు మూడు ఫోర్లు నాలుగు సిక్సర్లతో టీంకు అండగా నిలబడ్డాడు మరొక ఎండలో మిడిల్ ఆర్డర్ బ్యాటర్స్ అయిన కరెన్ షిండే 23 బంతుల్లో 33 పరుగులు 4 ఫోర్లు 24 బంతుల్లో 38 పరుగులు నాలుగు సిక్సర్స్ తో టీమ్ కు గౌరవప్రదమైన స్కోరును అందించారు.భీమవరం బుల్స్ బౌలర్లలో సత్యనారాయణ రాజు 3 వికెట్లు సాయి శ్రవణ్ రెండు వికెట్లు పడగొట్టారు.అనంతరం బ్యాటింగ్కు దిగిన భీమవరం బుల్స్ చెట్టు ఓపెనర్ హేమంత్ రెడ్డి మంచి స్టార్ట్ను అందించాడు. 38 బంతుల్లో 59 పరుగులు నాలుగు ఫోర్లు మూడు సిక్సర్స్ మెరుపు ఇన్నింగ్స్ ఆడాడు అనంతరం వన్ డౌన్ బ్యాటర్ సాయి శ్రవణ్ 26 బంతుల్లో 40 పరుగులు ఐదు ఫోర్లు ఒక సిక్సర్ మినహా బ్యాటర్ లెవరు రాణించకపోవడంతో ఆ జట్టు నిర్నిత 19 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 163 పరుగులు మాత్రమే చేయగలిగింది. దీంతో క్యాపిటల్ అమరావతి రాయల్స్ జట్టు 8 పరుగుల తేడాతో సీజన్లో మూడో విజయాన్ని అందుకుంది. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా ఆల్‌రౌండ్ పర్ఫామెన్స్ ఇచ్చిన కోడి వెంకట శశికాంత్ ఎంపికయ్యారు.

## ఎలమంచిలి మున్సిపాలిటీలో అభివృద్ధి పనులకు శ్రీకారం

### సుమారు 6 కోట్లతో పనులకు శంకుస్థాపన చేయనున్న ఎమ్మెల్యే సుందరపు

ఎలమంచిలి, జూన్ 14, ప్రభాతవార్త:



కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మున్సిపాలిటీలోని అభివృద్ధి పనులకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్న ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్. కార్యక్రమంలో భాగంగా సుమారు 6 కోట్లు విలువచేసే పనులకు శంకుస్థాపన కార్యక్రమాలను ఏర్పాటు దిశగా చర్యలు చేపట్టిన మున్సిపాలిటీ అధికారులు, ఎమ్మెల్యేగా సుందరపు విజయ్ కుమార్ బాధ్యతలు చేపట్టినప్పటి నుండి మున్సిపాలిటీలోని ప్రజల సమస్యలను ప్రజలకు ఏమి కావాలో వాటిని చేయు విధంగా ప్రత్యేక ప్రణాళికలతో ముందుకు వెళుతున్న తరుణంలో పట్టణంలో ప్రధానంగా రోడ్లు డ్రైనేజీ వ్యవస్థలోని సమూల మార్పులను తీసుకొచ్చే దిశగా చర్యలు చేపట్టారు. ఇందులోనే భాగంగా మొదటి దశలో సుమారు 6 కోట్ల వ్యయంతో డ్రైనేజీ, రోడ్లు, కల్వర్టు నిర్మాణాలకు శ్రీకారం చుట్టన వున్నారు. మున్సిపాలిటీగా ఏర్పడిన తర్వాత ఎప్పటికీ మున్సిపాలిటీలోని కొన్ని వార్డుల్లో డ్రైనేజీ లేకపోవడం విశేషం. ఇప్పుడు మంజూరైన నిధులతో డ్రైనేజీ, రోడ్లు, కల్వర్టులు నిర్మాణాలు చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు.

## సింహాద్రినాధుని దర్శించుకున్న మాడుగుల, చోడవరం ఎమ్మెల్యేలు

సింహాచలం, ప్రభాత వార్త, జూన్ 14:



వరాహ లక్ష్మీనరసింహస్వామి వారిని ఆదివారం మాడుగుల శాసనసభ్యులు బండారు సత్యనారాయణమూర్తి, చోడవరం శాసనసభ్యులు కె.ఎస్.ఎన్. రాజు దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ పర్యవేక్షణ అధికారి కె. వెంకటేశ్వరరావు ఆలయ మర్యాదలతో వారికి స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యేలు స్వామివారి సన్నిధిలో ప్రత్యేక దర్శనం చేసుకుని, సంప్రదాయబద్ధంగా కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. తదుపరి వేద పండితులు వారికి వేదాశీర్వచనం అందజేయగా, దేవస్థానం తరపున స్వామివారి శేషవస్త్రంతో సత్కరించి, ప్రసాదాలు అందజేశారు.

## అభివృద్ధిని చూసి ఓర్వలేక వైసిపి నేతలు తప్పుడు ప్రచారం

ఎలమంచిలి, జూన్ 14, ప్రభాతవార్త:



మున్సిపాలిటీ పరిధిలోని 12వ వార్డు కొత్తపేట శివాలయం రామాలయం రోడ్డు నిర్మాణాన్ని ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ చొరవతో పూర్తి చేశారని ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు గుర్రాల శేఖర్ తెలిపారు. ఎన్నో సంవత్సరాలుగా ఈ రోడ్డు అధ్వానంగా ఉన్న గత ప్రభుత్వం పట్టించుకోలేదని కనీసం కౌన్సిలర్ ఈ రోడ్డును నిర్మాణం చేద్దామనే ఉద్దేశం కూడా లేదని ప్రస్తుతం రోడ్డు నిర్మాణం పూర్తయ్యాక వైసిపి నాయకులు తామే అభివృద్ధి చేసినట్టు ప్రచారం చేసుకోవడం సిగ్గుచేటని విమర్శించారు. ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ మున్సిపాలిటీలోని వార్డుల్లోని , పంచాయతీలోని మండలాల్లోని ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని వారికి తగ్గట్టుగా అభివృద్ధి పనులను చేపడుతున్నారని అభివృద్ధి చేసే వారిని ప్రోత్సహించాలి తప్ప తామే అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. పిఎసిఎస్ చైర్మన్ గోపి, తెలుగుదేశం పట్టణ పార్టీ అధ్యక్షుడు గొర్లె నానాజీ,కూటమి నాయకులు ఊటకూటి రమేష్ నాయుడు, కొటారు శ్రీనివాసరావు, తెలుగుదేశం పార్టీ క్లస్టర్ ఇంచార్జ్ కరణం రవికుమార్ , జనసేన రాజు, లంకరాజు, సత్యనారాయణ, బిజెపి నాయకులు సుందరపు బాబ్జి, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పారిశుధ్య నిర్వహణలో నిర్లక్ష్యం ఉండకూడదు : కొణతాల

అనకాపల్లి , జూన్ 14, (ప్రభాతవార్త):



పారిశుధ్య నిర్వహణలో నిర్లక్ష్యం వహించరాదని ఎప్పటికప్పుడు పారిశుధ్య పనులు నిర్వహించి పరిశుభ్రంగా ఉంచాలని స్థానిక ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ అన్నారు. ఆదివారం ప్రజలకు మెరుగైన పారిశుధ్య వాతావరణాన్ని అందించాలనే లక్ష్యంతో చేపడుతున్న కాలువల శుభ్రత , మురుగునీటి పారుదల పనులను మాజీ మంత్రి, స్థానిక శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కాలువలో పేరుకుపోయిన చెత్త, మురుగును తొలగించే పనుల పురోగతిని అధికారులు , సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని కాలువలు పూర్తిగా శుభ్రంగా ఉండేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పారిశుధ్య నిర్వహణలో నిర్లక్ష్యం ఉండకూడదని అధికారులకు ఆదేశించారు.కాలువల శుభ్రతతో పాటు మురుగునీటి సాఫీ ప్రవాహానికి అడ్డంకిగా ఉన్న చెత్త, పొదలను తొలగించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. ప్రజారోగ్య పరిరక్షణకు పారిశుధ్యం అత్యంత ముఖ్యమని, పట్టణంలో అన్ని ప్రాంతాల్లో శుభ్రత పనులు నిరంతరం కొనసాగించాలని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, అధికారులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నూకాంబికను దర్శించుకున్న భక్తులు

అనకాపల్లి , జూన్ 14, (ప్రభాత వార్త) :



ఉత్తరాంధ్ర జిల్లాల ఇలవేల్పు అనకాపల్లి గవరపాలెంలోవెలిసిన శ్రీ నూకాంబిక అమ్మవారి దేవస్థానంలో ఆదివారం సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక అలంకరణ ప్రత్యేక పూజలు నిర్వహించారు. జిల్లా చుట్టుపక్కల నుండి పట్టణ గ్రామీణ ప్రాంతాలు నుండి అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ఆవరణలో వంటలు వండుకొని అమ్మవారికి ముక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ నిర్వహకులు చర్యలు తీసుకున్నారు. దీంతో ఆలయ పరిసర ప్రాంతాలన్నీ భక్తులతో కిక్కిరిశాయి. కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ పీలా నాగశ్రీను (గొల్ల బాబు), ఆలయ సహా కమిషనర్ యాళ్ళశ్రీధర్ ఆలయ ధర్మకర్తలుసూరే సతీష్, దాడి రవికుమార్ పొలిమేర స్వాతి ఆనంద్, మారిశెట్టి శంకర్రావు, కాండ్రేగుల రాజారావు ,మజ్జి జానకి శ్రీనివాసరావు,కొడుకుల శ్రీకాంత్, వద్దాది మంగ, కోనేటి సూర్యలక్ష్మి పైడిరాజు, యర్రవరపు సంతోషి కుమారినాగేష్, కూటమి నాయకులు, భక్తులు తదిరులు పాల్గొన్నారు.

## స్పీకర్‌కు అభినందనలు తెలిపిన మాజీ మంత్రి దాడి



అనకాపల్లి జూన్ 14 (ప్రభాత వార్త) చింతకాయల విజయ్ ను రాజ్యసభ సభ్యునిగా నియమించిన సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనసభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడుని ఆదివారం వారి నివాసంలో మాజీమంత్రి దాడి వీరభద్రరావు, తెలుగుదేశం పార్టీ విశాఖ జిల్లా మాజీ అధ్యక్షులు దాడి రత్నాకర్ కలిసి అభినందించారు. ఉత్తరాంధ్రలో యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ తరువాత సుమారు 30 సంవత్సరాలకు తెలుగుదేశం పార్టీ తరఫున రాజ్యసభకు విజయ్ ని నియమించినందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కి , నారా లోకేష్ కి ధన్యవాదాలు తెలియజేశారు .రాజకీయ కుటుంబానికి చెంది చిన్ననాటి నుండి పార్టీలో పనిచేసిన విజయ్ ను రాజ్యసభ సభ్యునిగా పంపడంపట్ల దాడి వీరభద్రరావు హర్షం వ్యక్తం చేశారు.

## బిఆర్‌టి కాలనీ టిడ్కో ఇళ్లను సందర్శించిన బిజెపి నేతలు

అనకాపల్లి , జూన్ 14, (ప్రభాత వార్త)



బిజెపి 12 ఏళ్ల సుపరిపాలనలో జరిగిన పలు అభివృద్ధి పనులు పరిశీలించడానికి బిజెపి ఎస్సీ మోర్చా నాయకులు జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు గొట్టివాడ సామ్రాట్. రాష్ట్ర ఎస్సీ సెల్ ఉపాధ్యక్షురాలు కట్ట పద్మ లతో బిజెపి నాయకులు, ప్రముఖ పారిశ్రామికవేత్త ముత్యాల వెంకటేశ్వరరావు ఆదివారం కలసి కేంద్ర ప్రభుత్వం చేస్తున్న పలు అభివృద్ధి పనులను సందర్శించారు . అందులో భాగంగా మండలంలోని బి ఆర్ టి కాలనీలో గల టీడ్కో ఇళ్లకు వెళ్లి పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడి వారి పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. స్థానికులతో వెంకటేశ్వరరావు, బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి గొర్లి రాము నాయుడుతో కలిసి మాట్లాడుతూ ఈ ఇల్లు కేంద్ర ప్రభుత్వ నిధులతో కట్టినవని అన్నారు. ఇల్లు లేని వారికి ఇల్లు ఇవ్వడమే బిజెపి లక్ష్యమన్నారు. అక్కడ వారి సమస్యలు అడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు . కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు కొణతాల సురేష్ , బిజెపి నాయకులు బొద్దేడ నాగేశ్వరరావు, మండల అధ్యక్షులు అప్పికొండ అప్పారావు ఉపాధ్యక్షులు బలిజ సాంబశివరావు ప్రధాన కార్యదర్శి గొర్లి రాము నాయుడు ఎం వి ఆర్ యువసేన సభ్యులు గైపూరి రాజు, సత్తి, మణికంఠ, ఏపూరి వాసు ,గంట సూరిబాబు, రాజు, తదితరులు పాల్గొన్నారు.

## యువత రక్తదానం చేయడానికి ముందుకు రావాలి : ఎం.వి.ఆర్

అనకాపల్లి , జూన్ 14, (ప్రభాతవార్త):




యువత రక్తదానం చేయడానికి స్వచ్ఛందంగా ముందుకు రావాలని బిజెపి నేత ప్రముఖ పారిశ్రామికవేత్త ముత్యాల వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా పట్టణంలోని సన్ క్యాస్టల్ హోటల్‌లో ఆదివారం నిర్వహించిన మెగా రక్తదాన శిబిరానికి ముఖ్యఅతిథిగా ఎం.వి.ఆర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.సర్వేజనా ఐక్యవేదిక వ్యవస్థాపకులు, ఎన్ హెచ్ ఆర్ పి ఎఫ్ హ్యూమన్ రైట్స్ అనకాపల్లి జిల్లా అధ్యక్షులు కోరిబిల్లి పరమేశ్వరరావు (పరి) ఆధ్వర్యంలో శ్రీ సూర్య అభయాంజనేయ బ్లడ్ సెంటర్ వారి సమక్షంలో ఈ భారీ రక్తదాన శిబిరం విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎం.వి.ఆర్ మాట్లాడుతూ ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన కోరిబిల్లి పరమేశ్వరరావు (పరి)ని, రక్త సేకరణ చేసిన బ్లడ్ సెంటర్ సిబ్బందిని ఆయన శ్లాఘించారు.సకాలంలో రక్తం అందడం వల్ల ఎన్నో ప్రాణాలను కాపాడవచ్చన్నారు. రక్తదాన శిబిరం నిర్వాహకులు కోరిబిల్లి పరమేశ్వరరావు (పరి) మాట్లాడుతూ తమ పిలుపు మేరకు రక్తదానం చేయడానికి తరలివచ్చిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం రక్తదాతలకు ముఖ్యఅతిథి ఎం.వి.ఆర్ ప్రశంసా పత్రాలను అందజేశారు. శ్రీ సూర్య అభయాంజనేయ బ్లడ్ సెంటర్ వైద్య సిబ్బంది, సర్వేజనా ఐక్యవేదిక ప్రతినిధులు, ఎన్‌హెచ్ఆర్‌పిఎఫ్ హ్యూమన్ రైట్స్ సభ్యులతో పాటు ఎంవిఆర్ యువసేన సభ్యులు గైపూరి రాజు, యేపూరి వాసు, సత్తి మణికంఠ, గంటా సూరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

## హోంమంత్రిపై గుడివాడ వ్యాఖ్యలు సరికాదు

ఎలమంచిలి, జూన్ 14, ప్రభాతవార్త:



వైఎస్సార్‌సీపీ మాజీమంత్రి గుడివాడ అమర్నాథ్ రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనితపై చేసిన అనుచిత వ్యాఖ్యలను తెలుగుదేశం పార్టీ తీవ్రంగా ఖండిస్తుందని రాష్ట్రయాదవ కార్పొరేషన్ డైరెక్టర్ ధూళి రంగనాయ కులు ఓ ప్రకటనలో తెలిపారు.మాజీ మంత్రి అమర్నాథ్ ఒక మహిళా నాయకురాలు, రాష్ట్ర హోంమంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తున్న వ్యక్తిపై వ్యక్తిగత దూషణలు చేయడం అత్యంత బాధ్యతారాహిత్య చర్య. రాజకీయాల్లో విభేదాలు ఉండవచ్చు, కానీ వ్యక్తిగత విమర్శలు, మహిళలను కించపరిచే వ్యాఖ్యలు చేయడం సమంజసం కాదు. మీరు మాట్లాడుతూ నేను వాడేసిన బుల్లెట్ ప్రూఫ్ కారులో మంత్రి అనిత తిరుగుతున్నారని చెప్పారు. ప్రజా సమస్యలపై మాట్లాడలేక, కూటమి ప్రభుత్వం సాధిస్తున్న విజయాలను జీర్ణించుకోలేక వైఎస్సార్‌సీపీ నాయకులు వ్యక్తిగత విమర్శలకు దిగుతున్నారు. ఇది మీ రాజకీయ దివాళాకోరుతనానికి నిదర్శనం.మహిళల గౌరవాన్ని కాపాడాలని చెప్పుకునే వైఎస్సార్‌సీపీ నాయకత్వం, తమ పార్టీ నేతలు చేస్తున్న ఇలాంటి వ్యాఖ్యలపై వెంటనే స్పందించి క్షమాపణ చెప్పించాలి. లేకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కొనే పరిస్థితి వస్తుందని అన్నారు.తెలుగుదేశం మహిళా నాయకులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిపై ప్రజాస్వామ్యబద్ధంగా ఏం చేయాలో త్వరలోనే నీకు తెలుస్తుందన్నారు. మండల పార్టీ మాజీ అధ్యక్షులు లాలం తాతబాబు పాల్గొన్నారు.

vsp10:vsp10.qxd 14-06-2026 21:52 Page 1






## అంతర్ జిల్లాల సీనియర్ రాష్ట్ర స్థాయి హాకీ పోటీల్లో సెమీఫైనల్స్ చేరుకున్న అనకాపల్లి జిల్లా జట్టు

ఎలమంచిలి, జూన్ 14, ప్రభాతవార్త:



అనంతపురంలో జరుగుతున్న సీనియర్ పురుషుల అంతర్ జిల్లాల రాష్ట్రస్థాయి హాకీ పోటీలలో అనకాపల్లి జిల్లా జట్టు ఎన్టీఆర్ జిల్లా జట్టుపై 1-0 గోల్స్‌తో విజయం సాధించిందని జిల్లా హాకీ అసోసియేషన్ కన్వీనర్ కోటారు నరేష్ తెలిపారు. క్వార్టర్ ఫైనల్స్ మ్యాచ్లో అద్భుత ప్రతిభ కనబరిచిఒక గోల్ సాధించినకుమార్‌ను అభినందించారు.

## తాళ్లపాలెంలో సుజల స్రవంతి పనులు పరిశీలన



అనకాపల్లి, జూన్ 14, ప్రభాతవార్త;

బిజెపి 12 ఏళ్ల సుపరిపాలనలో జరిగిన పలు అభివృద్ధి పనులు సందర్శించదానికి జిల్లా ప్రధాన కేంద్రం అనకాపల్లి నుండి బీజేపీ ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో ప్రగతి యాత్ర ప్రారంభించారు జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు గొట్టివాడ సామ్రాట్. రాష్ట్ర ఎస్సీ సెల్ ఉపాధ్యక్షురాలు కట్ట పద్మ లను. బిజెపి నాయకులు, ప్రముఖ పారిశ్రామికవేత్త ముత్యాల వెంకటేశ్వరరావు కలసి వారికి అభినందనలు తెలిపారు . బిజెపి ఎస్సీ మోర్చా నాయకులతో శరవేగంగా జరుగుతున్న సుజల స్రవంతి పనులు సందర్శించడానికి కశింకోట మండలం తాళ్లపాలెం చేరుకున్నారు. అక్కడ రాష్ట్ర నాయకులు పొన్నగంటి అప్పారావుతో కలసి అక్కడ పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ అటు ఏలూరు కాలువ ఈ పోలవరం కలుపుకొని సుజల స్రవంతిగా సాగుతున్న ఈ పనిలో పూర్తి అయితే ఉత్తరాంధ్ర సస్యశ్యామలమవుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నుండి ఒక పైసా పెట్టుబడి లేకుండా పూర్తిగా కేంద్రం నిధులతోనే ఈ పనులు జరుగుతున్నాయన్నారు. గత ప్రభుత్వంలో ప్రాజెక్టులన్నీ పడకే సాయిని తిరిగి కూటమి ప్రభుత్వం రాకతో ప్రాజెక్టు పనులు పూర్తి అవుతున్నాయన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు కొణతాల సురేష్ , బిజెపి నాయకులు బొడ్డెడ నాగేశ్వరరావు, మండల అధ్యక్షులు అప్పికొండ అప్పారావు ఉపాధ్యక్షులు బలిజ సాంబశివరావు ప్రధాన కార్యదర్శి గొర్లి రాము నాయుడు ఎంవిఆర్ యువసేన సభ్యులు గైపూరి రాజు, సత్తి, మణికంఠ, ఏపూరి వాసు ,గంట సూరిబాబు, రాజు, తదితరులు పాల్గొన్నారు.

## విజయవంతంగా బ్రాండిక్స్ 151వ ఉచిత కంటి వైద్యశిబిరం

### 590 మందికి పరీక్షలు.. 46 మందికి శస్త్ర చికిత్సలు

( అచ్యుతాపురం, జూన్ 14, ప్రభాతవార్త ) :



గ్రామీణ ప్రజలకు మెరుగైన కంటి ఆరోగ్య సేవలు అందించాలనే లక్ష్యంతో బ్రాండిక్స్ ఇండియా అపెరల్ సిటీ (బి ఐ ఎ సి ) ఆధ్వర్యంలో నిర్వహించిన 151వ ఉచిత కంటి వైద్య శిబిరం విజయవంతంగా జరిగింది. కార్పొరేట్ సామాజిక బాధ్యత (సియస్ఆర్ ) కార్యక్రమాల్లో భాగంగా నిర్వహించిన ఈ శిబిరంలో 590 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. విశాఖపట్నంలోని శంకర్ ఐ ఫౌండేషన్ ఆసుపత్రి వైద్య నిపుణులు పరీక్షలు నిర్వహించి, కంటి అద్దాలు అవసరమైన 453 మందికి అక్కడికక్కడే అద్దాలు తయారు చేసి పంపిణీ చేశారు. మరో 150 మందికి కంటి సంరక్షణకు అవసరమైన మందులు అందజేశారు. పరీక్షల్లో కేటరాక్ట్‌తో పాటు ఇతర కంటి సమస్యలు గుర్తించిన 46 మందిని ప్రత్యేక బస్సుల్లో విశాఖపట్నంలోని శంకర్ ఐ ఫౌండేషన్ ఆసుపత్రికి తరలించి శస్త్ర చికిత్సలు నిర్వహించారు. శిబిరానికి హాజరైన చిన్నారులతో పాటు అందరికీ కంటి సమస్యలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వైద్య నిపుణులు అవగాహన కల్పించారు. శిబిరానికి వచ్చిన వారికి మజ్జిగ, ఫలహారాలు, భోజన సదుపాయం కల్పించారు. ఇప్పటి వరకు బ్రాండిక్స్ నిర్వహించిన 151 ఉచిత కంటి వైద్య శిబిరాల ద్వారా వేలాది మంది కంటి చూపు సమస్యల నుంచి ఉపశమనం పొందినట్లు నిర్వాహకులు తెలిపారు. బ్రాండిక్స్ ఇండియా అపెరల్ సిటీ భారతీయ భాగస్వామి దొరస్వామి, బి ఐ ఎ సి సిబ్బంది, వైద్య నిపుణులు, శంకర్ ఐ ఫౌండేషన్ బృందం పాల్గొన్నారు.

## ఏడాది తర్వాత యజమానికి చేరిన ఒరిజినల్ సర్టిఫికెట్లు

### అచ్చుతాపురం పోలీసుల చొరవతో అప్పగింత

( అచ్యుతాపురం జూన్ 14 ప్రభాతవార్త )



ఏడాది క్రితం ఉపాధి నిమిత్తం అస్సాం రాష్ట్రం నుంచి అచ్యుతాపురం వచ్చిన చందన్ అనే వ్యక్తి తన ఒరిజినల్ విద్యార్హతల సర్టిఫికెట్లను పోగొట్టుకున్నాడు. అప్పటి నుంచి వాటి కోసం వెతికినా ఆచూకీ లభించలేదు. ఇటీవల పరవాడ పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న మురళీకృష్ణకు ఆ సర్టిఫికెట్లు లభించాయి. వాటిని పరిశీలించిన ఆయన సంబంధిత వ్యక్తిని గుర్తించి అచ్యుతాపురం పోలీసులకు సమాచారం అందించారు. ఈ నేపథ్యంలో ఆదివారం అచ్యుతాపురం పోలీస్‌స్టేషన్‌లో సీఐ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఎస్సై పోషణ చందన్‌కు అతని ఒరిజినల్ సర్టిఫికెట్లను అప్పగించారు. ఏడాది తర్వాత తన విలువైన పత్రాలు తిరిగి అందడంతో చందన్ ఆనందం వ్యక్తం చేస్తూ పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు. పోగొట్టుకున్న వస్తువులను యజమానులకు అప్పగించడంలో పోలీసులు చూపుతున్న చొరవ అభినందనీయమని స్థానికులు పేర్కొన్నారు.

## కోరుప్రోలులో సిటీ కంపోస్ట్ ఎరువుల నాణ్యతపై తనిఖీలు

(ఎస్ రాయవరం,జూన్ 14, ప్రభాతవార్త ):



కోరుప్రోలు గ్రామంలో సిటీ కంపోస్ట్ ఎరువు నాణ్యత పై వచ్చిన ఫిర్యాదు మేరకు, ఆదివారం వ్యవసాయ శాఖ అధికారులు ఏడి ఉమా ప్రసాదు, ఏవో సౌజన్య ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. ఎరువు నాణ్యతను నిర్ధారించేందుకు శాంపిల్స్ సేకరించి, పరీక్ష కేంద్రానికి పంపించామన్నారు, కొనుగోలు బిల్లులు, ఇన్వాయిస్ లు పరిశీలించారు. వచ్చిన రిపోర్టులు ఆధారంగా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో కోరా జగదీష్, బిక్కిన శ్రీను, కర్రి సతీష్ గ్రోమోర్ సిబ్బంది పాల్గొన్నారు.

## గూడుపమ్మను దర్శించుకున్న హెటెరో డీజీఎం



నక్కపల్లి, జూన్ 14, ప్రభాతవార్త :

రేబాక గూడుపమ్మతల్లి ఆలయాన్ని ఆదివారం ఉదయం హెటెరో (ప్రొడక్షన్) డీజీఎం కె.సత్యనారాయణ కుటుంబసభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఆలయంలో అమ్మవారికి ఆయన పసుపు,కుంకుమలు సమర్పించారు. ఆయన గోత్రనామాలతో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ప్రకృతి సోయగాలు, పచ్చని వనాల మధ్య కొలువతీరిన ఆలయం ఎంతో అద్భుతంగా వుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా గ్రామ మాజీ సర్పంచ్ సాదిరెడ్డి శ్రీనివాసరావు, మాజీ ఉప సర్పంచ్ సీహెచ్ శ్రీను, వెల్లంకి కాస బాబు, పోలినాటి నాయుడు, తోట గోవింద్ తదితరులు అమ్మవారి శేషవస్త్రంతో డీజీఎం సత్యనారాయణ దంపతులను సత్కరించారు.

## సముద్రంలో గల్లంతైన మత్స్యకారుడి మృతి

### పూడిమడక గ్రామంలో విషాదం

( అచ్యుతాపురం జూన్ 14 ప్రభాతవార్త )



అచ్యుతాపురం మండలం పూడిమడక గ్రామానికి చెందిన పేర్ల దేవుడు (45), నూకరాజు కుమారుడు, చేపల వేటకు వెళ్లి సముద్రంలో గల్లంతై మృతిచెందాడు. స్థానికుల వివరాల మేరకు, ఆదివారం తెల్లవారుజామున ఇతర మత్స్యకారులతో కలిసి బోటులో చేపల వేటకు వెళ్లిన దేవుడు ప్రమాదవశాత్తు సముద్రంలో పడిపోయినట్లు తెలిసింది. అదే బోటులో ఉన్న మత్స్యకారులు వెంటనే గాలింపు చర్యలు చేపట్టగా, కొంతసేపటి తర్వాత ఆయన మృతదేహం లభ్యమైంది. ఈ ఘటనతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. మృతుడికి భార్యతో పాటు ఇద్దరు కుమార్తెలు కలరు. కుటుంబ సభ్యుల రోదనలు హృదయ విదారకంగా మారాయి. ఘటనపై సంబంధిత అధికారులు వివరాలు సేకరిస్తున్నారు.

## అమ్మవారి ఆలయానికి పోటెత్తిన భక్తులు.!

(నక్కపల్లి, ప్రభాతవార్త):



అధిక జ్యేష్ఠమాసం అమావాస్య తిథి, ఆదివారం రావడంతో మండలంలోని రేబాక గూడుపమ్మ ఆలయాన్ని రికార్డు స్థాయిలో భక్తులు దర్శించుకున్నారు. అచ్యుతాపురం, ఎలమంచిలి, పాయకరావుపేట, నక్కపల్లి, ఎస్.రాయవరం, కోటనందూరు, కత్తిపూడి తదితర మండలాల నుంచి అనేక మంది భక్తులు అమ్మవారి ఆలయానికి తరలివచ్చారు. ఆలయంలో వున్న అష్టాదశ శక్తిపీఠాల దేవతామూర్తులను,ఉపాలయాలను భక్తులు దర్శించుకున్నారు. అమ్మవా రికి హారతులిచ్చారు. భక్తుల గోత్రనామాలతో పూజలు చేశారు. ఆలయ ధర్మకర్త గొట్టుముక్కల శ్రీహరిరాజు ఆధ్వ ర్యంలో సుమారు 500 మంది మహిళలకు సౌభాగ్య ప్రసాదంగా పసుపుకొమ్ములు, గాజులు పంపిణీ చేశారు. అనేక మంది ఆలయ పరిసరాల్లో వంటలు చేసుకుని భోజనాలు చేసి సాయంత్రం వరకూ ఎంతో సందడిగా గడిపారు.

## రోడ్డు ప్రమాదంలో బాలుడు మృతి .!



(నక్కపల్లి రూరల్, ప్రభాతవార్త ):

మండలంలోని జానకయ్యపేట గ్రామ సమీపంలో ఆదివారం ఉదయం స్కూటీ అదుపు తప్పిన జరిగిన సంఘటనలో 13 ఏళ్ల బాలుడు అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు అందించిన వివరాలిలా ఉన్నాయి. జానకయ్యపేటకు చెందిన కర్రి సూర్య వెంకట సాయి (13) వెనుక మరో ఫిలియన్ రైడర్ తో స్కూటీపై వెళ్తున్నాడు. మార్గ మధ్యలో స్కూటీ అదుపు తప్పి కల్వర్టు సమీపంలో కాలువలో పడిపోవడంతో స్కూటీ నడుపుతున్న బాలుడు తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడ మృతి చెందాడు. సంఘటన విషయం తెలిసిన వెంటనే సిఐ మురళి చేరుకొని ప్రమాదం జరగడానికి గల కారణాలు పరిశీలించారు. ఈ మేరకు కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మహిళా ఎస్సై షాహిబా అంజుమ్ తెలిపారు.

## ఘనంగా మోదకొండమ్మ జాతర

చోడవరం, జూన్ 14, ప్రభాత వార్త:



చోడవరంలో న్యూ శాంతినగర్‌లో వేంచేసియున్న మోదకొండమ్మ వారి జాతర మహోత్సవము ఆదివారం ఘనంగా జరిగింది. పట్టణ పరిధిలో గల అనేకమంది మహిళలు అమ్మవారికి ఘటాలు మొక్కులు సమర్పించారు. ఈ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే కేఎస్ఎన్ రాజు హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. తెలుగుదేశం పార్టీ రైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు జి మల్లు నాయుడు, చోడవరం టౌన్ ముఖ్య నాయకులు పంచాయతీ మెంబర్ టి శ్రీనివాస్, బోట్ల నరసింగ రావు, మురుగుతి అప్పారావు, దూళి అప్పయ్యమ్మ, కిల్లాడి సూరమ్మ, పార్థు, విస్సు, కందిపూడి మాజీ సర్పంచ్ పాల్గొని తల్లి దీవెనలు తీసుకోవడం జరిగింది. ఘటాలు, కోలాటం ప్రజలను విపరీతంగా ఆకర్షించాయి ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలు అందరూ ఆయురారోగ్యాలతో అష్టైశ్వర్యాలతో సుఖ సంతోషాలతో ఉండాలని,తల్లి దీవెనలు అందరిపై ఉండాలని మనస్పూర్తిగా ఆశాభావం వ్యక్తం చేశారు.

## నిత్య ఆరోగ్యానికి యోగా ఒక్కటే సరైన మార్గం

### పట్టణ సంచార ర్యాలీలో జిల్లా అధ్యక్షుడు దొరమ్మనాయుడు

అనకాపల్లి , జూన్ 14, (ప్రభాతవార్త):



స్థానిక జార్జ్ క్లబ్ నందు నిర్వహిస్తున్న పతాంజలి యోగాసమితి భారత స్వాభిమాన ట్రస్ట్ జిల్లా అధ్యక్షుడు ప్రముఖ యోగా గురువు బిశెట్టి దొరమ్మనాయుడు నిత్యం యోగా చేసే సభ్యులతో సుమారు 100 మంది పైగా పాల్గొని పలు ప్రాంతాల్లో మాట్లాడుతూ ఆరోగ్యంగా జీవించాలంటే యోగా ఒకటే సరైన మార్గం అని, శ్వాసపై ధ్యాస సంబంధిత ప్రాణయాలతో ఎన్నో రోగాలకు చెక్ చెప్పే మార్గం యోగ తోనే సాధ్యమని అన్నారు. ఆదివారం ఉదయం పట్నంలోని పలు ప్రాంతాలు అవగాహన ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని పలుచోట్ల సంచర ర్యాలీలో యోగా గురువులు పెంటకోట సుబ్రహ్మణ్యం, కాండ్రేగుల చిన్న, కర్రీ చిన సన్యాసినాయుడు, మారుతున్న కాలనుసారం శ్రమించే శక్తి ప్రతి ఒక్కరిలోనూ క్షీణించి పోతుందని దానిని పెంపొందించు కునేందుకు ప్రతిరోజు యోగ సాధన ద్వారా అనేక అనారోగ్య సమస్యలను దూరం అవుతాయన్నారు. ప్రతి ఒక్కరూ యోగాతో భాగస్వాములు కండి జ్ఞాపక శక్తి నీ పెంపొందించుకోండి, యోగా సాధన లేజినెస్ ని దూరం చేస్తుందన్నారు. కార్యక్రమంలో జార్జ్ క్లబ్ అధ్యక్షులు, కార్యదర్శి బి ఎస్ ఎం కె జోగి నాయడు ర్యాలీ ప్రారంభించారు. భీమరశెట్టి శ్రీనివాసరావు, కొణతాల శివాజీ, కె సత్యనారాయణ, కోలాపర్తి కన్నబాబు, ఆళ్ల సూర్య రామకృష్ణ, కొణతాల పెద్ద, బి చలపతి, బుద్ధ సత్యనారాయణ, మహిళాయోగా సభ్యులు, అన్ని ప్రాంతాల యోగ సాధకులు పాల్గొన్నారు.

## అమర్‌కు దిగజారుడు మాటలు తగదు : ఎమ్మెల్యే

చోడవరం, జూన్ 14,ప్రభాతవార్త:



రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనితపై మాజీమంత్రి గుడివాడ అమర్నాథ్ హుందాతనాన్ని మంట కలిపే విధంగా మాట్లాడడం సరైనది కాదని, దిగజారుడు విధానాలకు ఇది నిదర్శనమని ఎమ్మెల్యే కెఎస్ఎన్ రాజు తీవ్రంగా మండిపడ్డారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రజా జీవితంలో ఉన్న వ్యక్తులు బాధ్యతగల వ్యక్తులపై అవమానకర అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదన్నారు. వ్యక్తిగత విమర్శలను, మహిళలను అవమానించే విధంగా చేసిన వ్యాఖ్యలు సమాజానికి తప్పుడు సందేశాన్ని అందిస్తాయని ఆయన పేర్కొన్నారు. హుందాతనం సంస్కారం పాటించాలని సూచించారు. రాష్ట్రంలో హోం మంత్రిగా అనిత సమగ్రావంతంగా బాధ్యతలు నిర్వహిస్తున్న నేపథ్యంలో స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం వ్యక్తిగత స్థాయికి దిగజారి మాట్లాడటం తగదని, ఇలాంటి వ్యాఖ్యలు ప్రజలు కూడా సహించరని పేర్కొన్నారు. రాజకీయాల్లో పరస్పర గౌరవం ఇచ్చిపుచ్చుకోవడం, విలువలను కాపాడడం వంటివి ప్రతి నాయకుడిపై ఉందన్నారు. వైసిపి నాయకులు హుందాతనాన్ని మంట కలుపుతున్నారన్నారు.

## ప్రజల సమస్యల పరిష్కారమే మన లక్ష్యం : నానాజీ

(నక్కపల్లి రూరల్, ప్రభాతవార్త):



ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ప్రతి ఒక్క కార్యకర్త పనిచేయాలని మండల బిజెపి శాఖ అధ్యక్షులు పోలినాటి నానాజీ పిలుపునిచ్చారు ఆదివారం బిజెపి మండల శాఖ కార్యాలయంలో బిఎల్ఎ ల సమావేశంలో పలు సమస్యలపై చర్చించారు. భారత ప్రధాని మోదీ ఇచ్చిన పిలుపుమేరకు గ్రామస్థాయిలో ఉన్న సమస్యలపై ప్రతి ఒక్క కార్యకర్త దృష్టి పెడితే ప్రజలకు వారదులుగా పని చేయడానికి అవకాశం ఉంటుందని అన్నారు. ప్రతి సోమవారం జిల్లా కలెక్టర్ తో పాటు డివిజన్ స్థాయి ,మండల స్థాయిలో అధికారులు దృష్టికి పలు సమస్యలు తీసుకెళ్లి ప్రజలకు మరింత దగ్గరగా పనిచేయాల్సిన అవసరం ఉందని అన్నారు. సమావేశంలో బిజెపి జిల్లా, మండల స్థాయి నాయకులు కోసూరి శ్రీనివాసరావు, డాక్టర్ రత్నం భరత్, దాడి ఈశ్వరరావు, ఈగల వెంకటేశ్వరరావు, కొల్నాటి శివ, అప్పారావు, గెట్టం నానాజీ, అమ్మోరయ్య, బంగారు శివ, చందు, కృష్ణ, స్వామి, కుమారి, రంజాన్ బీబీ, తదితరులు ఉన్నారు.

## పేకాట శిబిరంపై పోలీసుల దాడి

కసింకోట, జూన్ 14, ప్రభాతవార్త;



కసింకోట పోలీస్ స్టేషన్ పరిధిలో పేకాటజూదం ఆడుతున్న శిబిరంపై దాడి చేసినట్లు కసింకోట సిఐ అల్లుడు సోమనాయుడు తెలిపారు. సీఐ అల్లు స్వామి నాయుడు మార్గదర్శకత్వంలో, కశింకోట ఎస్ఐ కే లక్ష్మణరావు సిబ్బంది వారికి అందిన సమాచారంపై గాడి వీధి కసింకోట గ్రామ గ్రామ శివారులో దాడి నిర్వహించారనీ తెలిపారు. ఈ దాడిలో పేకాట ఆడుతూ జూదానికి పాల్పడుతున్న 4 మంది వ్యక్తులను పట్టుకున్నారని చెప్పారు.వారి వద్ద నుండి 52 పేకాట కార్డులు, రూ. 610/- నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పట్టుబడిన వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నట్లు సోమనాయుడు చెప్పారు. మండల ప్రజలు ఇటువంటి అక్రమ జూద కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సిఐ అల్లు స్వామి నాయుడు విజ్ఞప్తి చేశారు.

## అమర్‌నాథ్ పై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు



(పాయకరావుపేట రూరల్, ప్రభాతవార్త )

రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనితపై వ్యక్తిగత విమర్శలు చేసిన వైసీపీ మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ పై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర నాటక అకాడమీ డైరెక్టర్ పల్లా విలియం కేరీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆదివారం పాయకరావుపేట పోలీస్ స్టేషన్లో నర్సీపట్నం డీఎస్పీ పి. శ్రీనివాసరావు, ఎస్ఐ జుత్తు పురుషోత్తంలను కలసి వినతిపత్రం అందజేశారు. దళిత మహిళ అనికూడా చూడకుండా హోం మంత్రి అనితపై అనుచిత వ్యాఖ్యలు చేసి దళితుల మనోభావాలను దెబ్బతీసిన అమర్ నాథ్ పై ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీకి చెందిన దళిత నాయకులు కశింకోట సత్తిబాబు, చిరుకూరి పేర్రాజు, సలికే చిన వెంకటరమణ, కుంచె ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

## హాకీ క్రీడాకారిణి గీతాశ్రీకి నక్కపల్లిలో ఘన స్వాగతం.. భారీ ర్యాలీ.!





( నక్కపల్లి /అడ్డు రోడ్డు, ప్రభాతవార్త):

జపాన్ లో జరిగిన హాకీ మహిళా ఆసియా కప్ అండర్ 18 విభాగం లో జరిగిన హాకీ పోటీలు ముగించుకొని కాశీస్య పతకం సాధించి పాయకరావుపేట నియోజకవర్గం నక్కపల్లి కి చేరుకున్న సందర్భంగా హాకీ క్రీడాకారులు పలువురు గ్రామ పెద్దలు క్రీడాకారులు తల్లిదండ్రులు పలువురు రాజకీయ ప్రముఖులు పూలు జల్లి ఘన స్వాగతం పలికారు. గీత శ్రీ నక్కపల్లి కి చేరుకోగానే జాతీయ జెండాను చేతను పట్టుకొని టాప్ లేని కారుపై అభివాదం చేస్తూ ఊరేగింపులో పాల్గొన్నారు. ఆదివారం మండల కేంద్రం లోబి ఎస్ హాకీ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ భారీ ర్యాలీకి గ్రామ పెద్దలు వీసం రామకృష్ణ, కొప్పిశెట్టి వెంకటేష్, జడ్పిటిసి గోసల కాసులమ్మ, మండల పరిషత్ ఉపాధ్యక్షులు వీసం నానాజీ , అదనపు ఉపాధ్యక్షులు వెలగ ఈశ్వరరావు, బిజెపి మండల శాఖ అధ్యక్షులు పోలినాటి నానాజీ, జిల్లా నాయకులు కోసూరు శ్రీనివాసరావు, యువ నాయకుడు మేడేటి శంకర్, మండల వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గొర్ల గోవిందు, రాష్ట్ర రైతు సంఘం కార్యదర్శి సూర్యకాసులు గోవిందు లతోపాటు బలిరెడ్డి సత్యవతి హాకీ క్లబ్ నిర్వాహకులు సూరిబాబు, తాతాజీ, రామచంద్ర రావు, నానాజీ లతోపాటు క్రీడాభిమానులు స్వాగతం పలికి సత్కరించారు. ఈ





సందర్భంగా జరిగిన కార్యక్రమంలో నమ్మి గీతా శ్రీ కుటుంబ సభ్యులను గ్రామ పెద్దలు సత్కరించి నక్కపల్లి కీర్తి ప్రతిష్టలను జాతీయస్థాయిలో చాటి చెప్పిన గీతాశ్రీ లాంటి బిడ్డ ఉండడం సంతోషమని రామకృష్ణ, వెంకటేష్ లు కొనియాడారు. ముందుగా నమ్మి గీతాశ్రీని అభినందిస్తూ భారీ ఎత్తున ఆర్టీసీ కాంప్లెక్స్ నుండి హైస్కూల్ హాకీ క్రీడా ప్రాంగణం వరకు ఊరేగిస్తూ స్వాగతం పలికారు. అనంతరం కాశీస్య పతకం విజేత నమ్మి గీతాశ్రీ కి ఘనంగా సత్కరించి అభినందనలు తో శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జరిగిన అభినందన కార్యక్రమంలో నాయకులు రామకృష్ణ, వెంకటేష్ మాట్లాడుతూ గీతాశ్రీ భవిష్యత్తు లో అనేక విజయాలు సాదించాలని, గ్రామీణ ప్రాంతం నుండి ప్రపంచ స్థాయికి వెళ్లి ఈ ప్రాంతానికే వన్నె తెచ్చి తోటి క్రీడాకారులకు స్ఫూర్తి గా నిలిచిందన్నారు. కార్యక్రమంలో బిస్ హాకీ ఫౌండర్ బలిరెడ్డి సూరిబాబు, అధ్యక్షులు చిన్న అప్పారావు, గాజులు రామచంద్ర రావు, కార్యదర్శి కొల్నాటి తాతాజీ, కోచ్ రాంబాబు,రంజిత్, నానాజీ లను గ్రామ పెద్దలు ఘనంగా సత్కరించారు. వీసం రాజు, పాము గణేశ్వరరావు, గిడుతూరి బాబ్జి, అల్లాడ కొండబాబు, భార్గవ్, ముద్ద శ్రీను, ఎలమంచిలి చందు, తదితరులు పాల్గొన్నారు.

## అమర్నాథ్ పై అనుచిత వ్యాఖ్యలు చేస్తే క్షమించేది లేదు

### వైకాపా రాష్ట్ర నేతలు హెచ్చరిక.!




(ఎస్. రాయవరం, ప్రభాతవార్త)

మాజీ మంత్రి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఉత్తరాంధ్ర నాయకులు గుడివాడ అమర్నాథ్ పై టిడిపి నాయకులు అనుచిత వ్యాఖ్యానాలు చేస్తే ఊరుకునే ప్రసక్తే లేదని వారు చేసిన వ్యాఖ్యానాలను తీవ్రంగా ఖండిస్తున్నామని రాష్ట్ర వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యదర్శులు వీసం రామకృష్ణ ,చిక్కాల రామారావు లు హెచ్చరించారు. ఎస్. రాయవరం మండలం అడ్డు రోడ్డు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం శాంతి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు ఇరువురు మాట్లాడుతూ గుడివాడ అమర్నాథ్ కుటుంబం చరిత్ర కలిగిన కుటుంబాన్ని ఉమ్మడి విశాఖ జిల్లా అభివృద్ధికి పాటుపడిన కుటుంబాన్ని అటువంటి కుటుంబాన్ని విమర్శిస్తే చూస్తూ ఊరుకోమని అన్నారు. టిడిపి నాయకులు పాయకరావుపేట నియోజకవర్గానికి హోం మంత్రి అభివృద్ధిలో భాగంగా పరిశ్రమలు తీసుకొచ్చామని ప్రగల్బాలు పలుకుతున్న నాయకులు ఈ వేసవికాలంలో మంచినీరు కూడా ఇవ్వలేని దుస్థితిలో ఉండి మాట్లాడడం దారుణం అని, మంచినీటి కోసం ఖాళీ బిందెలతో మహిళలు రోడ్ ఎక్కిన పరిస్థితులు మీకు కనిపించలేదని ప్రశ్నించారు. ముందు మంచినీరు సరఫరా చేయండి అప్పుడు మీరు ఎంత అభివృద్ధి చేశారు. ప్రజలు గ్రహిస్తారు అంతే తప్ప అభివృద్ధి చేసామంటే ప్రజలు నమ్మే పరిస్థితులు లేరని అన్నారు. ఈ ప్రాంతానికి పరిశ్రమలు తీసుకొచ్చింది, ఈ ప్రాంతానికి అభివృద్ధికి బాటలు వేసింది ఆనాటి ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి నాయకత్వంలో మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ కే దక్కుతుంది తప్ప మీరు తెచ్చింది శూన్యమని అన్నారు. స్టీల్ ప్లాంట్ జట్టి తదితర పరిశ్రమలు తీసుకొచ్చిన సందర్భంలో ఈ పరిశ్రమలు ఈ ప్రాంతానికి రాకూడదని ఆందోళన చేసిన పరిస్థితులు మర్చిపోయారా నేరుగా మీ జాతీయ అధినేత మండలంలోని రాజయ్యపేట ప్రాంతానికి వచ్చినప్పుడు భూములు ఇవ్వద్దు అని ప్రజలకి సందేశం ఇచ్చిన మాటలు మరిచిపోయారా ఇవన్నీ పక్కనపెట్టి ఈనాడు అభివృద్ధి చేసిన మేము అంటూ మాట్లాడటం విడ్డూరంగా ఉందని అన్నారు. పాయకరావుపేట నియోజకవర్గం అభివృద్ధి చేసింది ఎవరైనా ఉన్నారంటే అది ఆనాటి పరిశ్రమల మంత్రిగా ఉన్న గుడివాడ అమర్నాథ్ కే దక్కుతుందని అన్నారు. ఈ రాష్ట్రంలో ఇరువురు దళితుల మహిళలకు హోం మంత్రిని చేసిన ఘనత వైఎస్ జగన్మోహన్ రెడ్డి దక్కుతుంది తప్ప మీరేదో కొత్తగా హోం మంత్రి దళితులకు ఇచ్చే చెప్పుకోవడం విడ్డూరంగా ఉందని ఆ సంస్కృతి ప్రారంభించిందే జగన్ మోహన్ రెడ్డి అని అన్నారు. ఈ రాష్ట్రం నేరాల సంఖ్యలో భారతదేశంలో లెక్కల్లో చూస్తే మొదటి స్థానంలో ఉందని ఇది కూడా తెలుసుకోకుండా నేరాలు అదుపులో ఉన్నాయని మాట్లాడటం ఆశ్చర్యంగా ఉందని ఇదంతా ప్రజలు గ్రహిస్తున్నారని రామకృష్ణ చిక్కాల విమర్శించారు. గుడివాడ అమర్నాథ్ పై మరోసారి అనుచితమైన వ్యాఖ్యాన చేయడానికి ముందుకొస్తే ఊరుకునే ప్రసక్తి లేదని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎదుర్కొనే మీకు సిద్ధంగా ఉన్నామని హెచ్చరించారు. స్థానికులకు ఉద్యోగాలు కల్పించే విషయంలో పూర్తిగా విఫలమయ్యారని ఎటిరో డెక్కన్ తో పాటు సాయి మెరైన్ లాంటి కంపెనీలు నిబంధనలను పక్కనపెట్టి స్థానికులకు ఒక ఉద్యోగం కూడా ఇవ్వకుండా వ్యవహరిస్తుంటే చూస్తూ ఊరుకుంటున్నారే తప్ప మీరు చేసింది ఏముందని ఉద్యోగాలు ఇచ్చామని గొప్పలు చెప్పుకోవడం తప్ప అని విమర్శించారు. అభివృద్ధి ప్రజలకు జరగలేదు టిడిపి నాయకులు జరిగిందని, ఇసుక ,మట్టి, గ్రావెల్ ఈ దోపిడీ సరిపోతుందని తప్ప అభివృద్ధి మీద మీరు ఎక్కడ దృష్టి పెట్టారని ఎద్దేవా చేశారు. గుడివాడ అమర్నాథ్ గురించి పాయకరావుపేట నియోజకవర్గం చెందిన మహిళా నాయకులు మాట్లాడడం విడ్డూరంగా ఉందని ఒక మహిళ నాయకురాలు నిన్నటి వరకు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో ఉండి ఆనాడు మంత్రిగా ఉన్న గుడివాడ అమర్నాథ్ కాలికి మొక్కిన రోజులు మరచిపోయావా అంటూ ప్రశ్నించారు. వాస్తవాలు తెలుసుకొని మాట్లాడటం మంచిదని ఇదే పద్ధతి కొనసాగితే భవిష్యత్తులో ఎదురుదాడి తప్పదని హెచ్చరించారు. పాయకరావుపేట నియోజకవర్గం లో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆదరణ చూసి ఓర్వలేక విమర్శలు చేస్తున్నారని ఈ రాష్ట్ర ప్రజలు వైఎస్ జగన్మోహన్ రెడ్డి వైపు చూస్తున్నారని అన్నారు. ఈ పాత్రికేయుల సమావేశంలో జడ్పిటిసి గోసల కాసులమ్మ, మండల పరిషత్ అదనపు ఉపాధ్యక్షులు వెలగ ఈశ్వరరావు, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షులు గొర్ల గోవిందు మధువర్మ రమేష్ లతోపాటు రాష్ట్ర, జిల్లా పార్టీల నాయకులు సీరం నరసింహమూర్తి, గొర్ల బాబురావు, ఎలమంచిలి తాతబాబు, సూరకాసుల గోవిందు, కనక సుందర లత, రాజా కన్నా, సింహాద్రి, శ్రీను, ఎలమంచిలి చందు, జగతా శ్రీను, లోవ రాజు, తదితరులు ఉన్నారు.

## అమ్మవారి భక్తులకు అన్న ప్రసాదం ఏర్పాటు

పాడేరు,జూన్14, ప్రభాతవార్త:



గిరిజన హారధ్య దైవం పాడేరు శ్రీశ్రీశ్రీ మోదకొండమ్మ వారి ఆలయంలో ఆలయ కమిటీ ఛైర్మన్,పాడేరు శాసనసభ్యులు మత్స్యరాస విశ్వేశ్వర రాజు ఆదేశాల మేరకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్న సమారాధన కార్యక్రమం ఆదివారం నిర్వహిం చారు. కార్యక్రమానికి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అన్న ప్రసాదం స్వీకరించారు. అలాగే అమ్మవారి కలంకరించినటువంటి చీరలు భక్తుల సౌకర్యార్థం తక్కువ ధరలకు విక్రయించడం జరిగింది. అమ్మవారి చీరలు కొనుగోలుకు అధిక సంఖ్యలో మహిళా భక్తులు పాల్గొని భక్తిశ్రద్ధలతో అమ్మవారి చీరలు సొంతం చేసుకన్నారు. కార్యక్రమానికి ఆలయ కమిటీ సభ్యులు చల్లా రామకృష్ణ, భువనంగి వెంకటరమణ, కిల్లు చంద్రమోహన్ కుమార్, కొణతాల సతీష్, గూడెపు సూర్యప్రకాష్, లకే రత్నబయి పలాసి రమణమ్మ, జంపరంగి సత్తిబాబు, మోద స్వరూప, తదితరులు పాల్గొన్నారు.




## నేడు పాడేరు ఎంపీడీఓ కార్యాలయంలో ప్రజా పరిష్కార వేదిక

**పాడేరు,జూన్14,(ప్రభాతవార్త):**

జిల్లా కలెక్టర్ ఆదేశాలు మేరకు పాడేరు మండలం లో ప్రతి సోమవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఉదయం 10 గంటల నుండి ప్రజా పరిష్కార వేదిక (పి.జి.ఆర్ ఎస్) కార్యక్రమం నిర్వహించనున్నామని పాడేరు మండల తహశీల్దార్ బి.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.పాడేరు మండలంలోఉన్న ప్రజలు తమ సమస్యల అర్జీలను, పిర్యాదులు, సంక్షేమ పథకాలు, మరియు ప్రజా సమస్యలు నేరుగా అందజేసి పరిష్కరించుకోవాలని తహశీల్దార్ కోరారు..కావున అన్ని శాఖల మండల స్థాయిఅధికార్లు తప్పని సరిగా హాజరు కావాలనీ తహశీల్దార్ బి.శ్రీనివాసరావు సూచించారు.

## హుకుంపేట మండలంలో ప్రజా ఆందోళనలు పరిష్కరించేందుకు కలెక్టర్ మార్గదర్శకాలు జారీ

**పాడేరు,జూన్14,(ప్రభాతవార్త):**



హుకుంపేట మండలంలోని మజ్జివలస , పరిసర గ్రామాల ప్రజలు ఆ ప్రాంతంలో జరుగుతున్న సర్వే మరియు క్షేత్రస్థాయి కార్యకలాపాలపై వ్యక్తం చేస్తున్న ఆందోళనల నేపథ్యంలో, జిల్లా కలెక్టర్ టి.నిశాంతి సంబంధిత కార్యకలాపాలన్నీ పారదర్శకంగా, చట్టబద్ధంగా, సమన్వయంతో నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు.ఆ ప్రాంతంలో సర్వేలు, పరిశోధనలు లేదా క్షేత్రస్థాయి పర్యటనలు చేపట్టాలనుకునే అన్ని శాఖలు, సంస్థలు, ఏజెన్సీలు ముందుగా స్థానిక రెవెన్యూ అధికారులతో సమన్వయం చేసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. వర్తించే చట్టాలు మరియు ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు గ్రామసభలతో సంప్రదింపులు సహా సముచితమైన సామాజిక భాగస్వామ్య చర్యలు కూడా చేపట్టాలని కలెక్టర్ స్పష్టం చేశారు.ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు, సమాచారాన్ని అందించేందుకు కలెక్టరేట్, పాడేరులోని ఐటీడీఏ కార్యాలయంలో ప్రత్యేక గ్రీవెన్స్ సెల్‌లు ఏర్పాటు చేయనున్నామణి కలెక్టర్ ప్రకటించారు. గ్రామస్తులు తమ వినతులను నేరుగా సమర్పించవచ్చు లేదా సమాచారం ,ఫిర్యాదుల పరిష్కారం కోసం కంట్రోల్ రూమ్ నంబర్లు 9281856953, 08935-293448 ఫోన్‌నెంబర్ల యూ సంప్రదించవచ్చన్నారు. షెడ్యూల్డ్ ప్రాంతంలో జరిగే అన్ని కార్యకలాపాలు చట్టానికి అనుగుణంగా, పారదర్శకంగా, ప్రజా భాగస్వామ్యంతో, గిరిజన సమాజ హక్కులు మరియు సంక్షేమాన్ని గౌరవిస్తూ నిర్వహించాలని జిల్లా యంత్రాంగం పునరుద్ఘాటించింది.ఎలాంటి సమస్యలు లేదా ఆందోళనలు ఉన్నా గ్రీవెన్స్ సెల్‌లను సంప్రదించాలని ఈ ప్రాంతంలో శాంతి సామరస్యాలు నెలకొనేలా సహకరించాలని కలెక్టర్ కోరారు.

## హెల్మెట్ ధరించండి... ప్రాణాలను కాపాడుకోండి



**పాడేరు,జూన్14,(ప్రభాతవార్త):**

అల్లూరి సీతారామ రాజు జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్ ఆదేశాలు మేరకు పాడేరు మండలం సంతబయలు గ్రామంలో హెల్మెట్ వినియోగంపై ప్రజల్లో అవగాహన కార్యక్రమం పాడేరు సిఐ దీనబంధు ఆదివారం నిర్వహించారు. ప్రజలకు హెల్మెట్ ప్రాముఖ్యతపై, గంజాయి పై, సైబర్ నేరాలపై, మహిళలు పిల్లలు పై నేరాలు పై అవగాహన కల్పించారు.స్థానిక యువకులు, గ్రామస్తులు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## టిడిపి మండల అధ్యక్షురాలు కిల్లో సన్యాసమ్మ (సంధ్య)కు రాష్ట్ర స్థాయి మదర్ థెరిస్సా సేవారత్న అవార్డు

**గిరిజన సమాజ సేవకురాలిగా, సమాజానికి అందించిన సేవలను గుర్తించిన మదర్ థెరిస్సా సేవా సంస్థ ముంచంగిపుట్టు మండల టీడీపీ అధ్యక్షురాలు కిల్లో సన్యాసమ్మ సంధ్యను సేవా రత్న, రాష్ట్ర స్థాయి అవార్డు ను ..ప్రదానం చేసిన మదర్ థెరిస్సా సేవా సంస్థ**




**ముంచంగిపుట్టు జూన్ 14 (ప్రభాతవార్త):**

అల్లూరి సీతారామ రాజు జిల్లా, అరకు నియోజకవర్గం, ముంచంగిపుట్టు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షురాలు కిల్లో సన్యాసమ్మ సంధ్యను ఆదివారం విశాఖపట్నం లో 'మదర్ థెరిస్సా' సేవ సంస్థ రజతోత్సవ వేడుకల సందర్భంగా, డాబాగార్డెన్ వి,జె, ఎఫ్. ప్రెస్ క్లబ్ లో ఆమె గిరిజనులకు అందించిన సేవను గుర్తించి, ప్రముఖుల సమక్షంలో, మదర్ థెరిస్సా సేవ సంస్థ సేవ రత్న రాష్ట్ర స్థాయి అవార్డు' పురస్కారం తో పాటు, సర్టిఫికెట్ మెడల్, సన్మాన పత్రం, మెమొంటో ను, అందించి ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా అవార్డు అందుకొన్న తరవాత సన్యాసమ్మ సంధ్య.. మాట్లాడుతు... మానవ సేవే మాధవ సేవ అని నిరూపించిన మదర్ థెరిస్సా పేరిట ఇస్తున్న ఈ ప్రతిష్టాత్మక ' సేవ రత్న రాష్ట్ర స్థాయి అవార్డు అందుకోవడం, సమాజ సేవలో మరింత ముందుకు సాగేందుకు ఎంతో ఉత్సాహపరిచి,సామాజిక బాధ్యతను మరింత పెంచిందని, గర్వకారణంగా, సంతోషంగా ఉందని, తాను చేసిన చిన్నపాటి సేవ సమాజంలో నిరుపేదలకు, ఆరోగ్యం పై ,విద్య చిన్నారులకు, చేస్తున్న సేవలను గుర్తించి, సేవా రత్న రాష్ట్ర స్థాయి అవార్డు ప్రకటించడం అనేది అదృష్టంగా భావిస్తున్నానని,నిజంగా ఈ ఆనంద క్షణాలను ఊహించుకుంటే, ఎంతో సంతోషంగా ఉందన్నారు, తనను ప్రోత్సహించిన ప్రతి ఒక్కరికి పేరు పేరునా ధన్యవాదాలు తెలిపారు.కష్టాల్లో ఉన్నవారికి సాయం చేయడానికి డబ్బు కాదు, మంచి మనసు ముఖ్యం" అని మదర్ థెరిస్సా చెప్పారు. అదే స్ఫూర్తితో, అందరిని నా కుటుంబ సభ్యులుగా భావించి సేవ చేయడమే నా ఏకైక లక్ష్యంతో ముందుకు వెళుతున్నానని,తనపై ఉంచిన నమ్మకం, నా బాధ్యతను మరింత పెంచిందని. ప్రతి ఒక్క పేదవాళ్లు అభివృద్ధి చెందేంత వరకు, కృషి చేస్తానని,మదర్ థెరిస్సా జీవితం మనందరికీ స్ఫూర్తిదాయకమని, రాజకీయాలు అంటే కేవలం అధికారం కాదు, అది ప్రజలకు సేవ చేసే గొప్ప మాధ్యమం అని తాను నమ్ముతానని, తాను చేస్తున్న ప్రజా సేవను గుర్తించి ఈ అవార్డు ఇవ్వడం నా బాధ్యతను మరింత పెంచిందని. భవిష్యత్తులో పేదలు, అభాగ్యుల అభ్యున్నతి కోసం నా చివరి వరకు పాటుపడతానని ఈ వేదిక ద్వారా తెలియజేస్తున్నానని ఆమె భావోద్వేగంగా తెలిపారు.




## రెండు రోజులుగా తాగునీరు అందక అలమటిస్తున్న గిరిజనులు

### పట్టించుకోని పంచాయతీ అధికారులు

**డుంబ్రిగూడ, జూన్ 14 (ప్రభాతవార్త):**

మండల కేంద్రంలోని డుంబ్రిగూడ గ్రామంలో గత రెండు రోజులుగా తాగునీరు అందించడంలో సంబంధిత సిబ్బంది నిర్లక్ష్య ధోరణి అవలంబించడం వల్ల గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పాలయ్యారు. అసలే వేసవి తాపంతో చల్లటిల్లుతున్న గిరిజనులకు తాగినీరు సక్రమంగా అందకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పాలయ్యారు. పంచాయతీ స్థాయి అధికారులు గిరిజనులకు అందే తాగునీరు విషయంపై దృష్టిసారించకుండా నిమ్మకు నీరతినట్లు వ్యవహరించడం సరికాదని పలువురు గిరి మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి మాసంలోని ఇంటి పన్ను వసూల్లో పంచాయతీ అధికారులు చూపించే శ్రద్ధ గిరిజనులకు తాగునీరందించడంలో సుముఖత చూపకపోవడంపై గిరిజన మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాగునీరు అందించే సిబ్బంది సమయపాలన విధుల పట్ల శ్రద్ధ లేకపోవడం వల్లే తాగునీరు అందిపిచ్చు కోవడంలో గ్రామస్తులు పలు రకాల ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి నెలకొంటుందని మహిళలు అంటున్నారు. తాగునీరు అందించకుండా గ్రామంలోని ఎవరైనా సొంత పనుల నిమిత్తం చేతులు తడిపితేనే నీళ్లు ఇస్తున్నట్లు ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. ఈ విషయంపై పంచాయతీ సెక్రెటరీ గౌతమి ఆశ్రయిస్తే మన పంచాయతీ స్పెషల్ ఆఫీసర్ బాధ్యతలు చేపట్టలేదు మేము సెలవుల్లో ఉన్నాం మమ్మల్ని అడిగితే ఏం చేస్తాం అన్నటువంటి సమాధానం ఇవ్వడం సరికాదని గిరి మహిళలు వాపోతున్నారు. ఇప్పటికైనా మండల స్థాయి అధికారి అయిన ఎంపీడీవో స్పందించి డుంబ్రిగూడలో రెండు రోజులు పాటుగా గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్యపై పరిష్కార మార్గానికి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. లేనిపక్షంలో ఖాళీ బిందెలతో ఎంపీడీవో కార్యాలయాన్ని ముట్టడిస్తామని మహిళలు హెచ్చరించారు.

## పద్మాపురం బొటానికల్ గార్డెన్‌లో టికెట్ ధరల భారీగా తగ్గింపు

### అందుబాటులో చిల్డ్రన్స్ టాయ్ ట్రైన్

**అరకు రూరల్, జూన్ 14, (ప్రభాత వార్త :**





దేశ విదేశీ పర్యాటకులను ఆకర్షించేందుకు గాను పర్యాటక కేంద్రమైన అందాల అరకులోయ లోని ప్రముఖ సందర్శిక ప్రాంతమైన పద్మాపురం బొటానికల్ గార్డెన్ ఆధునికరిస్తూ భారీగా ప్రవేశారుసుములను తగ్గిస్తూ పాడేరు ఐటీడీఏ ప్రత్యేక చర్యలను తీసుకుంది. పాడేరు ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి ఆదిత్య వర్మ ఆదేశాలు, మార్గదర్శకాల మేరకు పర్యాటకులకు మరింత సౌకర్యం కల్పించాలనే ఉద్దేశంతో పద్మాపురం బొటానికల్ గార్డెన్ ప్రవేశ టికెట్ ధరలను గణనీయంగా తగ్గించారు. ఈ మేరకు గార్డెన్ ప్రవేశ రుసుము ను పెద్దలకు 100 రూపాయల నుండి.60 రూపాయలకు,పిల్లలకు, 50 రూపాయల నుండి 30 రూపాయలకు ఐటీడీఏ పీవో ఆదేశాల మేరకు తగ్గిస్తున్నట్లు. ఈ సందర్భంగా గార్డెన్ మేనేజర్ లకె బొంజు బాబు తెలిపారు. ఆదివారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ. పర్యాటకుల సందర్శనలను మరింత ఆనందదాయకంగా మార్చేందుకు పలు వినూత్న కార్యక్రమాల్లో అమలు చేసేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. దీనిలో భాగంగానే ప్రవేశారుసుములను భారీగా తగ్గిస్తున్నారని అలాగే వినోదాన్ని అందించేందుకుగాను చిల్డ్రన్స్ టాట్ ట్రైన్ ను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు మేనేజర్ తెలియజేశారు. పద్మాపురం బొటానికల్ గార్డెన్ లో జరుగుతున్న ఆధునీకరణ పనులతో పర్యాటకులు కుటుంబ సమేతంగా విచ్చేసి అందాలను వీక్షించవచ్చని చెప్పారు. ముఖ్యంగా పిల్లల వినోదాన్ని దృష్టిలో ఉంచుకొని చిల్డ్రన్స్ టాయ్ ట్రైన్ ను ఐటిడిఏ పిఓ ప్రత్యేక చొరవతో అందుబాటులోకి తీసుకువచ్చి సేవలను ప్రారంభించడం జరిగిందన్నారు. అలాగే త్వరలోనే పర్యాటకులకు సరికొత్త ప్రీమియం రెస్టారెంట్ ను అందించేందుకు వినూత్నమైన కే ఓ ఐ ప్రారంభించినట్లు తెలిపారు. రాష్ట్రంలోనే పద్మాపురం బొటానికల్ గార్డెన్‌ను అత్యుత్తమ ప్రకృతి వినోద కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ఆధునిక సౌకర్యాలు అభివృద్ధి పనులు శరవేగంగా కొనసాగుతున్నట్లు మేనేజరు బొంజుబాబు తెలిపారు. సమావేశంలో పాడేరు ఐటిడిఏ టూరిజం కోఆర్డినేటర్ గణపతి నాయుడు పాల్గొన్నారు.

## పాడేరు సుండ్రుపుట్టులో భరతమాత విగ్రహ పునఃప్రతిష్ఠా మహోత్సవం

### భక్తుల కోసం సిద్ధమైన అద్భుత ఆధ్యాత్మిక వేదిక



**పాడేరు,జూన్14,(ప్రభాతవార్త):**

అల్లూరి జిల్లా కేంద్రం పాడేరు పట్టణం సుండ్రుపుట్టు గ్రామంలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకొనునుంది.సుమారు ఆరు దశాబ్దాల చరిత్ర కలిగిన ప్రసిద్ధ భరతమాత ఆలయం, నూతన కళలతో పునఃప్రతిష్ఠ కార్యక్రమం జరగనుంది. ఈ అద్భుత ఘట్టాన్ని భక్తులు హాజరై అమ్మవారి ఆశీస్సులు పొందాలని ఆలయ కమిటీ కోరారు. .సుమారు 60 ఏళ్ల క్రితం శ్రీశ్రీశ్రీ స్వామి దయానిధి మహర్షి దివ్య హస్తాలతో ఈ ఆలయం ప్రతిష్ఠితమైంది.నాటి నుండి నేటి వరకు ఇక్కడ వెలుగుతున్న అఖండ జ్యోతి, భక్తుల కోర్కెలను తీర్చే పవిత్ర కేంద్రంగా విరాజిల్లుతోంది. అయితే, కాలక్రమేణా ఆలయం రోడ్డు మట్టం కంటే దిగువకు చేరడంతో, గ్రామస్తులు, దాతల సహకారంతో ఆలయ సంరక్షణకు నడుం బిగించారు. అత్యాధునిక ఇంజనీరింగ్ పరిజ్ఞానంతో (జాకీల సహాయంతో) ఆలయ నిర్మాణాన్ని మూడు అడుగుల మేర ఎత్తుకు పెంచి, అత్యంత భక్తిశ్రద్ధలతో సర్వాంగసుందరంగా తీర్చిదిద్దారు.శ్రీశ్రీశ్రీ స్వామి దయానిధి మహర్షి ట్రస్ట్ ఆధ్వర్యంలో, గ్రామ పెద్దలు, యువకుల కృషితో ఈ పునఃప్రతిష్ఠా మహోత్సవాలను ఈ నెల 16,17 తేదీల్లో వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. 16 తేదీ (మంగళవారం) మధ్యాహ్నం 2గంటల నుండి 4గంటల వరకు మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించనున్నారు. అలాగేసాయంత్రం 4 గంటల నుండి రాత్రి 9 గంటల వరకు అమ్మవారికి ప్రత్యేక పూజలు, విశేష హోమాలు నిర్వహిస్తారు.17 వ తేదీన (బుధవారం)ఉదయం 6 గంటలనుండి 8 గంటల30 నిమిషములకు విశేష పూజలుఅలాగే పూర్ణాహుతి నిర్వహించనున్నారు..ఉదయం 8 గంటల 53 నిమిషములకు అత్యంత పవిత్ర ముహూర్తాన విగ్రహ పునఃప్రతిష్ఠా మహోత్సవం నిర్వహించి మధ్యాహ్నం 12 గంటలకు భక్తజన సమూహానికి అన్నప్రసాద వితరణ (అన్న సమారాధన) కార్యక్రమం నిర్వహించనున్నారు.ఈ అరుదైన ఆధ్యాత్మిక కార్యక్రమానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి, భరతమాత అనుగ్రహాన్ని పొందాలని, మీ రాకతో ఈ మహోత్సవాన్ని దిగ్విజయం చేయవలసిందిగా సుండ్రుపుట్టు గ్రామస్తులు, ట్రస్ట్ సభ్యులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## మత్స్యగుండంలో కలెక్టర్ నిశాంతి



**పాడేరు,జూన్14,(ప్రభాతవార్త):**

హుకుంపేట మండలం,ప్రముఖ పుణ్యక్షేత్రం మత్స్యగుండం ప్రాంతంలో ఈ నెల 15వ తేదీ సోమవారం టెంపుల్ టూరిజం యోగా' కార్యక్రమం. సోమవారం ఉదయం 5.30 గంటల నుండి 10.గంటల వరకు "టెంపుల్ టూరిజం ప్రాంతంలో యోగా" కార్యక్రమాన్ని అత్యంత ఘనంగా నిర్వహించనున్నారు.ఇందుకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని ఏర్పాట్ల పర్యవేక్షణ,ఈ యోగా కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను నోడల్ అధికారిగా డిఆర్డిఏ పిడి విద్యాసాగర్ స్వయంగా క్షేత్రస్థాయిలో పరిశీలించి, ఏర్పాట్లు పర్యవేక్షించారు. ఈకార్యక్రమానికి వచ్చే వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని రకాల వసతులు కల్పించినట్లు ఆయన తెలిపారు.జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ ప్రతిష్టాత్మక టెంపుల్ టూరిజం యోగా కార్యక్రమం నిర్వహింకానున్నామని జిల్లా కలెక్టర్ నిశాంతి తెలిపారు.ఈ కార్యక్రమానికి జిల్లా, మండలస్థాయి అధికారులు అందరూ తప్పనిసరిగా హాజరు కావాలని జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. నిర్లక్ష్యం వహించకుండా అధికారులు సకాలంలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆమె పిలుపునిచ్చారు. అలాగే హుకుంపేట మండలం మత్స్యగుండం పరిసరాల ప్రాంతాల్లో గల ప్రజలు ప్రజాప్రతినిధులు యువకులు హాజరుకావాలని కలెక్టర్ కోరారు. కార్యక్రమం ద్వారా ఆధ్యాత్మికతతో పాటు పర్యాటక రంగానికి, ఆరోగ్యానికి పెద్ద పీట వేసినట్లవుతుందని అధికారులకు కలెక్టర్ పేర్కొన్నారు. ఏర్పాట్లు కార్యక్రమంలో మత్స్యగుండం యోగ నోడల్ అధికారి, డ్వామా పిడి విద్యాసాగర్ రావు, హుకుంపేట మండల తాసిల్దార్, మండల అభివృద్ధి కార్యాలయం సిబ్బంది, రెవిన్యూ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## 17న కొయ్యూరులో ఎంపీ , ఎమ్మెల్యే పర్యటన

### ఎంపీపీ బడుగు రమేష్ బాబు వెల్లడి



**కొయ్యూరు, జూన్ 14 (ప్రభాతవార్త :**

ఈ నెల 17న అరకు పార్లమెంటు సభ్యురాలు డా. గుమ్మ తనుజరాణి, అల్లూరి జిల్లా వైఎస్ఆర్సిపి అధ్యక్షుడు పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు మండలంలో పర్యటిస్తారని ఎంపీపీ బడుగు రమేష్ బాబు తెలిపారు. ఆదివారం స్థానిక విలేకరులకు విడుదల చేసిన ప్రకటనలో ఎంపీపీ రమేష్ బాబు మాట్లాడుతూ-ఎంపీ తనుజరాణి నిధులతో కొయ్యూరులో మాజీ జెడ్పిటిసి వారా నూకరాజు పేరుతో నిర్మించిన బస్ షెల్టర్ ను ప్రారంభోత్సవం చేస్తారని తెలిపారు. కార్యక్రమానికి మండలంలో ఉన్న మాజీ సర్పంచులు ఎంపీటీసీలు వైస్ ఎంపీపీలు పార్టీ పదవులు అలంకరించిన నాయకులు విధిగా హాజరై ఎంపీ ఎమ్మెల్యే పర్యటన విజయవంతం చేయాలని కోరారు.

## గిరిజన యువతా మేలుకో.. భవిష్యత్తు ఏమిటో తెలుసుకో...!

### మంప ఎస్ఐ సీదరి శ్రీనివాసరావు



**కొయ్యూరు, జూన్ 14, (ప్రభాతవార్త :**

వారపు సంతల్లో గిరిజనులకు నకిలీ వస్తువులు విక్రయించినట్లయితే కఠిన చర్యలు తప్పవని వ్యాపారస్తులకు మంప ఎస్సై సీదరి శ్రీనివాసరావు హెచ్చరించారు. ఆదివారం మండలంలో రాజేంద్రపాలెం వారపు సంతలో గిరిజనులకు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. ఈ మేరకు మంప ఎస్సై శ్రీనివాసరావు సంతకు మారుమూల ప్రాంతాల నుండి వచ్చే గిరిజనులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వ్యాపారులు నాణ్యమైన వస్తువులనే విక్రయించాలని ప్రజలను మోసగించకూడదని ఆయన సూచించారు. రోడ్డు భద్రత నియమాలు తప్పనిసరిగా ప్రతి ఒక్కరు పాటించాలన్నారు హెల్మెట్ ధరించాలని,వాహనాలను అతివేగంగా ప్రమాదంగా నడపకూడదని యువతకు హెచ్చరించారు. మహిళలు భద్రత యువతలకు రక్షణ ప్రభుత్వం , పోలీసులుతీసుకుంటున్న చర్యలను వివరించారు. ఎవరికి ఎటువంటి సమస్య ఏర్పడిన పోలీసులు సంప్రదించాలని దిశ యాప్ ఉంటే ఉపయోగించుకోవాలని తెలిపారు ఆన్లైన్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు అపరిచిత వ్యక్తులకు ఓటీపీలు బ్యాంకు వివరాలు చెప్పకూడదని సూచించారు. గంజాయి డ్రగ్స్ వంటి అలవాట్లకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. మాదక ద్రవ్యాల వల్ల జీవితాలు ఎలా నాశనం అవుతున్నాయో వివరిస్తూ వాటి నిర్మూలనకు ప్రజలందరూ పోలీసులకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో వివిధ మరుమూల గ్రామాల ప్రజలు వ్యాపారస్తులు స్థానిక పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగాఅమ్మవారి వార్షికోత్సవం



**పాడేరు,జూన్14,(ప్రభాతవార్త,:**

శ్రీశ్రీశ్రీ మోధ ఉమా ఎలక్ట్రిషన్ అండ్ ప్లంబర్ అసోసియేషన్ వార్షిక శ్రీ శ్రీ శ్రీ మోదకొండమ్మ అమ్మవారి అసోసియేషన్ పండగ నిమిత్తము అసోసియేషన్ సభ్యుల యొక్క సహకారంతో అమ్మవారి వార్షికోత్సవాన్ని నిర్వహించడం జరిగినది ఈ అసోసియేషన్ 2008 నాటి నుంచి ప్రారంభోత్సవం జరిగినది ప్రతి ఏడాది అనగా ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి అసోసియేషన్ తరపున అమ్మవారి పండగలను నిర్వహించడం ఆనవాయితీగా నిర్వహించడం జరిగినది అదేవిధంగా ఆదివారం అసోసియేషన్ సభ్యుల సహకారంతో అసోసియేషన్ అమ్మవారి వార్షికోత్సవాన్ని సభ్యుల యొక్క ఆమోదయోగ్యంతో నిర్వహించడం జరిగినది సహకరించిన సభ్యులందరికీ అసోసియేషన్ తరపున మరియు జిల్లా అసోసియేషన్ తరపున కృతజ్ఞతలు తెలియజేసుకుంటూ శ్రీశ్రీశ్రీ మోధ ఉమా నీలకంఠేశ్వర ఎలక్ట్రిషన్ మరియు ప్లంబర్స్ అసోసియేషన్ గౌర అధ్యక్షులు మరియు పాడేరు డివిజన్ అధ్యక్షులు తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## తాజా మాజీల చూపు.. జనసేన వైపు?

### స్థానిక , పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ఆశావహుల తర్జనభర్జనలు

**కొయ్యూరు, జూన్ 14 (ప్రభాతవార్త :**

ఇక రేపో, మాపో స్థానిక సంస్థల, పంచాయితీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో కొంతమంది వైసిపికు చెందిన తాజా మాజీ ఎంపీటీసీలు సర్పం చుల చూపు జనసేన వైపు ఉన్నట్టు కనబడుతోంది. ప్రస్తుతం రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలో ఉన్న నేపథ్యంలో సర్వసాధారణంగానే స్థానిక, పంచా యతీ ఎన్నికలలో అధికార పార్టీకి అనుకూలంగానే ప్రజా తీర్పు ఉంటుందని గమనించిన తాజా మాజీ వైసిపి సర్పంచులు, ఎంపీటీసీలు జనసేన వైపు చూస్తు న్నట్టు విశ్వసనీయంగా తెలియ వచ్చింది అయితే మండలంలో కూటమి ప్రభుత్వ పొత్తులో భాగంగా జనసే నకు ఎన్ని పంచాయితీలు కేటాయిస్తారు? అందులో తమ పంచాయతీ ఉంటుందా? లేదా? అనే మేమాంశలో ఈ ఆశావాహులు పడినట్టు తెలుస్తోంది. ఏదిఏమైనా రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోనూ, రాజకీయంలోనూ బలంగా ఉన్నప్పటికీ, మండలంలో మాత్రం టిడిపి మూడు వర్గాలుగా ఉండడంతో ఆ పార్టీలోకిగాని, దాని మిత్రపక్షాలైన జనసేన, బిజెపి లలోకి వెళ్లినా ప్రయోజనాలు లేదని మరికొంతమంది తాజా మాజీలు అభిప్రాయపడుతున్నట్లు తెలుస్తోంది. అయితే స్థానిక, పంచాయతీ ఎన్నికల షెడ్యూల్ విడుదలైన తర్వాత మండలంలో కూటమిలోని ఏ పార్టీకి ఎన్ని పంచాయితీలు కేటాయించబడ్డాయో?తెలిసిన తర్వాత తదుపరి నిర్ణయం తీసుకుందామని మరి కొంతమంది భావిస్తున్నట్టు తెలియ వస్తోంది.

## రహదారుల అభివృద్ధి పనులు యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలి

### -అధికారులను ఆదేశించిన గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు

**గాజువాక, జూన్ 14,(ప్రభాతవార్త :**



నియోజకవర్గంలోని ప్రధాన రహదారులపై జరుగుతున్న అభివృద్ధి పనులను జీవీఎంసీ ఇంజనీరింగ్ అధికారులు ప్రతిష్టాత్మకంగా తీసుకుని, యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని గాజువాక శాసనసభ్యులు పల్లా ఆదేశించారు. బీసీ రోడ్డు కాకతీయ కూడలి నుండి పెదగంట్యాడ గాంధీ విగ్రహం వరకు ఇరువైపులా రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన 14వ ఫైనాన్స్ నిధులతో జరుగుతున్న రహదారి అభివృద్ధి పనులను ఆదివారం ఆయన దయాళ్ నగర్ వద్ద క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లా మాట్లాడుతూ.. సుమారు 15 కోట్ల రూపాయల వ్యయంతో ఈ రహదారి అభివృద్ధి పనులు జరుగుతున్నాయని తెలిపారు. గాజువాక నియోజకవర్గంలో గత రెండు సంవత్సరాల కాలంలో 250 కోట్ల రూపాయల నిధులతో వివిధ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పన పనులు చేపట్టామన్నారు. పనుల్లో ఎక్కడా నాణ్యత లోపించకుండా, 120 అడుగుల రహదారి మధ్యలో 8 అడుగుల సెంటర్ డివైడర్‌ను ఏర్పాటు చేస్తూ అత్యంత ఆధునికంగా ఈ రహదారిని నిర్మిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజల సౌకర్యార్థం పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్, 74వ వార్డు క్లస్టర్ ఇంచార్జ్ శ్రీనివాసరావు, గాజువాక టీడీపి నాయకులు గాంధీ, వియ్యపు కొండబాబు తదితరులు పాల్గొన్నారు.

## సేంద్రియ వ్యవసాయ మేళాలో రైతులకు ఘన సన్మానం



**ఆనందపురం, జూన్ 14, (ప్రభాతవార్త :**

ఆనందపురంలో బీజేపీ కార్యకర్తల ఆధ్వర్యంలో ఆదివారం సేంద్రియ వ్యవసాయ మేళా మరియు అవగాహన సమావేశం ఘనంగా నిర్వహించారు. రైతుల్లో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన పెంపొందించడం, సేంద్రియ సాగు పద్ధతులను ప్రోత్సహించడం లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా ప్రాజెక్టు మేనేజర్ బుసాల శ్యామల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక స్టాళ్లలో సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తులు, ప్రకృతి వ్యవసాయ నమూనాలు, విలువ ఆధారిత ఉత్పత్తులను ప్రదర్శించారు. రైతులు స్టాళ్లను సందర్శించి ప్రకృతి వ్యవసాయ సాంకేతికతలు, సాగు విధానాలు, దిగుబడి పెంపు మార్గాలపై వివరాలు తెలుసుకున్నారు. సమావేశంలో ప్రకృతి వ్యవసాయం వల్ల కలిగే ప్రయోజనాలు, తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు సాధించే అవకాశాలు, ఆరోగ్యకరమైన ఆహార ఉత్పత్తి వంటి అంశాలపై అవగాహన కల్పించారు. రైతుల ఆదాయ వృద్ధికి ప్రకృతి వ్యవసాయం కీలకమని వక్తలు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయంలో విశేష కృషి చేసి ఆదర్శంగా నిలిచిన 10 మంది రైతులను శాలువాలు, ప్రశంసా పత్రాలతో ఘనంగా సన్మానించారు. సన్మాన గ్రహీతలు తమ అనుభవాలను పంచుకుంటూ ఇతర రైతులు కూడా సేంద్రియ, ప్రకృతి వ్యవసాయం వైపు అడుగులు వేయాలని సూచించారు. మండలంలోని పలు గ్రామాల నుంచి వచ్చిన సుమారు 100 మంది రైతులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతు నాయకులు, ప్రజాప్రతినిధులు, బీజేపీ కార్యకర్తలు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. సేంద్రియ వ్యవసాయ విస్తరణకు ఇలాంటి మేళాలు ఎంతో దోహదపడతాయని రైతులు అభిప్రాయపడ్డారు.

15skl13:15skl13.qxd 14-06-2026 22:33 Page 1



## గిరిబాబుకి సీతయ్య ఫౌండేషన్ సన్మానం



ఇచ్ఛాపురం, జూన్ 14 ప్రభాతవార్త:

ఆదివారం ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా సీతయ్య ఫౌండేషన్ వృద్ధాశ్రమంలో నిర్వహించిన మెగా రక్తదాన శిబిరం కార్యక్రమంలో భాగంగా 19 సార్లు నిర్విరామంగా రక్తదానం అందించిన సామాజిక సేవకులు పాతిర్ల గిరిబాబు రెడ్డిని సన్మానించారు. ఈ సందర్భంగా సీతయ్య ఫౌండేషన్ వ్యవస్థాపకులు గుల్ల రమేశ్ బాబు మాట్లాడుతూ నిరంతరం రక్తదాన సేవను కొనసాగిస్తున్న పాతిర్ల గిరిబాబురెడ్డి సేవా సంకల్పాన్ని కొనియాడారు. తమ ఫౌండేషన్ తరుపున సన్మానించడం ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గుల్ల మోహన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

## ఆదినారాయణ కుటుంబానికి పరామర్శ



కంచిలి, జూన్ 14 ప్రభాతవార్త:

గొల్ల కంచిలిలో గూడ ఆదినారాయణ తండ్రి స్వర్గస్తులైన సందర్భంగా పరామర్శలో భాగంగా జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ విజయమ్మ మరియు ఎక్స్ ఎం సి చైర్మన్ కొల్లి ఈశ్వరరావు, మాజీ ఎంపీపీ ఇప్పిలి కృష్ణారావు, గుమ్మడి రామదాసు, డొక్కరి బలరాం, డొక్కరి దాలయ్య, మునకాల వీరాస్వామి, తదితరులు పాల్గొన్నారు.

## కూటమి ప్రభుత్వం రెండేళ్లు' కార్యక్రమం విజయవంతం చేయండి

### తెదేపా అధ్యక్షులు శాంతి స్వరూప్ రెడ్డి



సంతబొమ్మాళి, జూన్ 14, ప్రభాతవార్త:

కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పాలన పూర్తి అవుతున్న సందర్భంగా రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు టెక్కలిలో సోమవారం నిర్వహిస్తున్న ప్రత్యేక కార్యక్రమానికి మండలం నుంచి ప్రతి ఒక్కరూ హాజరు కావాలని తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు సుగ్గ శాంతి స్వరూప్ రెడ్డి పిలుపునిచ్చారు. టెక్కలి ఆదిత్య కల్యాణ మండపంలో ఉదయం 8 గంటలకు జరగనున్న ఈ కార్యక్రమంకు సంతబొమ్మాళి మండలంలోని ప్రజా ప్రతినిధులు, అనుబంధ విభాగాల నాయకులు, కార్యకర్తలు, పార్టీ అభిమానులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని స్వరూప్ రెడ్డి కోరారు.

## రోడ్డు భద్రత,మహిళల భద్రతపై అవగాహన



సీతంపేట, జూన్ 14 ప్రభాతవార్త :

హెల్మెట్ ధరించండి. ప్రాణాలను కాపాడుకోండి నినాదంతో సీతంపేట ఐటిడిఏ అడ్వెంచర్ పార్క్ సమీపం లో ఆదివారం పోలీసులు ఆధ్వర్యంలో రోడ్డు భద్రత, మహిళల భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహిం చారు. ఎస్ఐ వై.అమ్మన్నారావు మాట్లాడుతూ మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని రోడ్డు ప్రమాదాల్లో ప్రాణనష్టం తగ్గించేందుకు ప్రతి ద్విచక్ర వాహనదారుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని స్పష్టం చేశారు. ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, ద్విచక్ర వాహనాలపై ప్రయాణించే సమయంలో హెల్మెట్ ధరించడం ద్వారా ప్రాణాపాయ పరిస్థితులను నివారించవచ్చని తెలిపారు. అలాగే మహిళలపై జరిగే నేరాలను అరికట్టేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అందుబాటులో ఉన్న సహాయ సేవల గురించి వివరించారు. సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, తెలియని వ్యక్తులకు బ్యాంకు వివరాలు, ఓటీపీలు, పాస్‌వర్డ్‌లు వెల్లడించరాదని సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

## నేడు జిల్లా స్థాయి జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశం

### ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కలెక్టర్ డా. ఎన్.ప్రభాకర రెడ్డి పిలుపు



వీరఘట్టం, జూన్ 14 ప్రభాతవార్త:

పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంలో ఈ నెల 15వ తేదీన జిల్లా స్థాయి జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ డా. ఎన్.ప్రభాకర రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2026-27 సంవత్సరంలో తొలి సమావేశాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. కలెక్టరేట్ కార్యాలయంలో మధ్యాహ్నం 3:00 గంటలకు ప్రారంభం కానున్న ఈ సమావేశానికి జిల్లాలోని అన్ని గుర్తింపు పొందిన ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు తప్పనిసరిగా హాజరు కావాలని కలెక్టర్ కోరారు. ఈ మేరకు జిల్లాలోని అన్ని ప్రభుత్వ శాఖల అధికారులకు, 15 ప్రధాన ఉద్యోగ సంఘాల (ఏపీ ఎన్జీవో, ఎస్టీయూ, పీఆర్‌టీయూ, యూటీఎఫ్, ఏపీటీఎఫ్, రెవెన్యూ, ట్రెజరీ, సర్వే, డ్రైవర్స్ , క్లాస్-4 అసోసియేషన్స్ తదితర) ప్రతినిధులకు అధికారిక సమాచారం పంపినట్లు కలెక్టర్ వెల్లడించారు.

## విహార కేంద్రంగా జగన్నాథ్ సాగర్ : ఎమ్మెల్యే గౌతు శిరీష



పలాస, జూన్ 14, ప్రభాతవార్త:

పలాస పట్టణ ప్రజల చిరకాల కోరిక త్వరలో నెరవేరబోతోంది. పలాస మున్సిపాలిటీ పరిధిలో ఉన్న జగన్నాథ్ సాగర్ గట్టును ఆధునిక హంగులతో అభివృద్ధి చేసి ప్రముఖ విహార కేంద్రంగా తీర్చిదిద్దేందుకు చర్యలు వేగవంతం అవుతున్నాయి. ఈ మేరకు పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష ఆదివారం మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు, సంబంధిత శాఖల అధికారులతో కలిసి జగన్నాథ్ సాగర్ గట్టు పరిసర ప్రాంతాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈసందర్భంగా గట్టు అభివృద్ధికి సంబంధించిన ప్రతిపాదిత పనులపై అధికారులతో సమీక్ష నిర్వహించిన ఎమ్మెల్యే, ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేలా ప్రత్యేక ప్రణాళికతో అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. మున్సిపల్ అధికారులు, ఇంజినీరింగ్ విభాగ సిబ్బంది, ప్రజాప్రతినిధులు మరియు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## రక్తదానం చేసిన ఎస్ఐ షణ్ముఖరావు



వీరఘట్టం, జూన్ 14 ప్రభాతవార్త :

డివిజన్ కేంద్రం పాలకొండలోని ఆదివారం ప్రపంచ రక్తదాన దినోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో వీరఘట్టం ఎస్సై షణ్ముఖరావు పాల్గొని రక్తదానం చేశారు. ఇటు శాంతి భద్రతలు పరిరక్షించడంతో పాటు, విధి నిర్వహణలో అలుపెరుగని లక్ష్యంతో ముం దుకు వెళ్తున్న తరుణంలో సేవ చేయడంలోనూ ముందుండాలనే తపనతో ఎంతో ఉత్సాహంతో రక్తదానం చేశారు. పలువురికి ఆదర్శంగా నిలిచిన ఎస్సై షణ్ముఖరావును స్థానికులు అభినందనలతో ముంచెత్తారు.

## తలసేమియా వ్యాధిగ్రస్తునికి కూటమి ప్రభుత్వం ఆసరా



కోటబొమ్మాళి, జూన్ 14 ప్రభాతవార్త:

తిలారు గ్రామానికి చెందిన ఇప్పిలి సింహాచలం కుమారుడు షణ్ముఖసాయి కొంతకాలంగా తలసేమియా వ్యాధితో బాధపడుతున్నాడు. ప్రస్తుతం చెన్నైలో (మద్రాస్) ఎం.జి రామచంద్ర హాస్పిటల్‌లో చికిత్స పొందుతునాడు. షణ్ముఖ సాయిని కోటబొమ్మాళి మాజీ ఎంపీపీ తర్ర రామకృష్ణ వెళ్ళి పరిస్థితిని పరిశీలించి వారి కష్టాలను రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు దృష్టికి తీసుకొని వెళతానని ఆ కుటుంబానికి భరోసా ఇచ్చారు. ఈ మేరకు ముఖ్యమంత్రి సహాయనిధి నుండి 8 లక్షల రూపాయలు అందించారు. ప్రస్తుతం షణ్ముఖ సాయి కోలుకోవడం కోసం ఇంకా ఆర్థిక సహాయం అవసరం ఉందని డాక్టర్లు చెబుతున్నారు. అయితే రోగి తండ్రి సింహాచలంకు ఇద్దరు కుమారులు కాగా పెద్ద కుమారుడు గత 4 సంవత్సరాల క్రితం ఇదే రకంగా తలసేమియా వ్యాధితోనే మృతి చెందాడు. ప్రస్తుతం షణ్ముఖ సాయి కూడా తలసేమియా వ్యాధితోనే బాధపడుతూ చికిత్స పొందుతున్నాడు. వారి సమస్యలను రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు దృష్టికి తీసుకొని వెళ్ళి పరిష్కారం కోసం ప్రయత్నం చేస్తానని రామకృష్ణ హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆ కుటుంబాన్ని ఆయన ఓదార్చారు. ధనవంతు సహాయంగా కొంత మొత్తాన్ని అందజేశారు.

## యువత జీవితాలను నాశనం చేసే గంజాయి, డ్రగ్స్ జోలికి పోవద్దు

సంతకవిటి, జూన్ 14 ప్రభాతవార్త

సంతకవిటి పోలీస్ స్టేషన్ పరిధిలోని పొనుగుటివలస గ్రామంలోని యువత, మహిళలు స్థానిక ప్రజలతో జిల్లా ఎస్పీ ఏ.ఆర్.దామోదర్ శనివారం మమేకమై, యువత జీవితాలను నాశనం చేసే డ్రగ్స్ జోలికి పోవద్దని, డ్రగ్స్, మద్యం, వంటి చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ చెడు వ్యసనాలతో యువత జీవితాలను నాశనం చేసుకుంటున్నారని అన్నారు. యువత మంచి మార్గంలో నడవాలని, డ్రగ్స్ జోలికి పోవద్దని ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలని, తల్లిదండ్రుల కలలను నిజం చేసేందుకు లక్షసాధనకు కృషి చేయాలని అన్నారు. ఇటీవల కాలంలో యువత గంజాయికి అలవాటు పడి భవిష్యత్తు నాశనం చేసుకుంటున్నారన్నారు. ఏదైనా కారణంతో మనం ప్రమాదానికి గురైతే అర్ధాంతరంగా వారి కుటుంబాలను నిరాశ్రయులవుతారన్నారు.

## మౌలిక సౌకర్యాలకు పెద్దపీట : ప్రభుత్వ విప్



కవిటి, జూన్ 14, ప్రభాతవార్త:

మత్స్యకార గ్రామాల్లో మౌలిక సౌకర్యాలకు పెద్దపీట వేస్తున్నట్టు ప్రభుత్వ విప్ డాక్టర్ బెందాళం అశోక్ ఘంటాపదంగా చెప్పారు. ఆదివారం మండలం కవిటి పంచాయతీ కొత్తపాలెం, ఇద్దివానిపాలెం గ్రామాల్లో సుమారు 7 లక్షల రూపాయలతో నిర్మించిన మంచినీటి కొళాయిలను విద్యుత్ బోరులను ప్రభుత్వ విప్ డాక్టర్ బెందాళం అశోక్ ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్స్యకారుల పక్షపాతి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అంటూ కొనియాడారు. మత్స్యకారులు సంక్షేమానికి కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తుందని అన్నారు. మత్స్యకార గ్రామాల్లో రోడ్లు మంచినీటి సౌకర్యం కాలువల నిర్మాణం చేపట్టనున్న ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీలు బెందాళం రమేష్, పి.కృష్ణారావు ఏఎంసీ చైర్మన్ మణి చంద్రప్రకాశ్, పిఎసిఎస్ అధ్యక్షులు బాస్ జయప్రద మాజీ మండల కోసం బాసుదేవ్‌రౌళో, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ బార్ల చిన్నబాబు, తెలుగుదేశం నాయకులు బెందాళం సురేష్‌తో పాటు ఏవో శ్రీనివాసరెడ్డి, మహిళా సంఘాల ప్రతినిధులు, ప్రజా ప్రతినిధులు, తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు, మత్స్యకార పెద్దలు పాల్గొన్నారు.

## బాధితులకు అండగా కూటమి ప్రభుత్వం : ఎమ్మెల్యే కూన



ఆమదాలవలస, జూన్ 14 (ప్రభాతవార్త)

నియోజకవర్గంలో ఆమదాలవలస మండలం కొర్లకోట గ్రామానికి చెందిన అంపోలు మీనా కుమారి లబ్ధిదారునికి ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కును ఎమ్మెల్యే కూన రవికుమార్ ఇంటికి వెళ్లి రూ.52 వేల రూపాయలు ఆదివారం పంపిణీ చేశారు. అదేవిధంగా సరుబుజ్జిలి మండలం పాలవలస గ్రామానికి చెందిన కరణం రమాదేవి భర్త గోవిందరావు రాజాం పట్టణంలోని ఉంటున్నాడని తెలుసుకొని ఇంటికి వెళ్లి ఎమ్మెల్యే రవికుమార్ చెక్కును అందించారు. వైద్య ఖర్చులకోసం ముఖ్యమంత్రి సహాయ నిధి అందించాలని మీనా కుమారి, రమాదేవి కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే రవికుమార్‌కు విన్నవించుకున్నారు. వారి విన్నపాన్ని ఎమ్మెల్యే ముఖ్యమంత్రి కార్యాలయానికి అందించారు. ఈ దరఖాస్తులు పరిశీలించిన ముఖ్యమంత్రి కార్యాలయం సహాయనిధి మంజూరు చేశారు. సీఎం సహాయనిధి చెక్కులను వైద్య చికిత్స నిమిత్తం ఇంటికి వెళ్లి అందజేశారు. ఎమ్మెల్యే రవికుమార్ మాట్లాడుతూ అర్హులైన ప్రతి కార్యకర్తకు టీడీపీ అండగా ఉంటుందన్నారు. సీఎంఆరఎఫ్ సహాయం అందడంతో లబ్ధిదారుల కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే రవికుమార్‌కు, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు. నారాయణపురం ఆనకట్టు చైర్మన్ సనపల డిల్లేశ్వరరావు, మాజీ ఎంపీటీసీ అన్నెపు భాస్కరరావు, సనపల అప్పలనాయుడు, కరణం గోవిందరావు, గ్రామస్తులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల సమ్మేళనం



జలుమూరు/నరసన్నపేట, జూన్ 14, ప్రభాతవార్త:

నరసన్నపేట మండలంలోని ఉర్లాం జడ్పీహెచ్ఎస్ స్కూల్ విద్యార్థులు 30 ఏళ్ల తర్వాత ఒకరినొకరు చూసుకుని, కలుసుకొని పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం ఆదివారం ఆటపాటలతో గడిపారు. పాత జ్ఞాపకాలు, పాఠశాలలోనే చిలిపి చేష్టలు గుర్తు చేసుకుంటూ అపూర్వ సమయంలో పూర్వ విద్యార్థులు కలుసుకున్నారు. ఉర్లాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1987-88 లో పదవ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులంతా ఆదివారం అదే పాఠశాలలో అపూర్వ సమ్మేళన కార్యక్రమమును ఘనముగా నిర్వహించారు. ఒక్కొక్కరు వేరువేరు ప్రాంతాలలో స్థిరపడి ఒక్కో వృత్తి చేసుకుంటూ ఉన్న వారంతా ఒకేసారి కలవడంతో ఓ చక్కటి వాతావరణము నెలకొన్నది. చదువుకున్న రోజుల్లోనూ జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ సందడిగా గడిపారు. అనంతరం ఈ కార్యక్రమము ప్రస్తుత ప్రధానోపాధ్యాయులు భారతి మేడం అధ్యక్షత వహించారు. అప్పటి ఉపాధ్యాయులైన తాడేల లక్ష్మీనారాయణ దంపతులను, యాళ్ల రంగారావు, ఉరిటి ప్రసాదరావు, బగ్గు రాజారావు, వై.నారాయణరావులను ఘనంగా దుశ్శాలువలతో సత్కరించారు. ఉపాధ్యాయుల ఆశీస్సులను పొందారు. కృషిచేసి బాధ్యతలు తీసుకొని సమావేశంలో కీలక పాత్ర వహించిన గుజ్జల ప్రసాదరావు, రాజేష్ బాబు, సీతాపతి, భాను నాయుడు, అందరిని తనదైన శైలిలో సమకూర్చడంలో కె వెంకటరమణ, రాడ చక్రవర్తి, రాడ చంద్రమౌళి, వకముళ్ళ చక్రధరరావు, గవర భాస్కర్, వై తేజేశ్వరరావు, వెలుగు శ్రీరాములు, విజయలక్ష్మి, పుష్పలత, వాకముళ్ళ ధనం సహకరించారు.

## నిరాధారిత ఆరోపణలు వద్దు



నరసన్నపేట, జూన్ 14 ప్రభాతవార్త

నరసన్నపేట నియోజకవర్గ ప్రైవేట్ పాఠశాలల యాజమాన్య ప్రతినిధులు సమావేశాన్ని రాష్ట్ర ఆప్సా నాయకత్వం ఆధ్వర్యంలో శ్రీజ్ఞానజ్యోతి పాఠశాల ఆవరణలో శనివారం నిర్వహించారు. బడ్జెట్ ప్రైవేట్ పాఠశాలలపై ఇటీవల సామాజిక, ప్రసార మాధ్యమాలలో జరుగుతున్న నిరాదర ఆరోపణలను ఆప్సా ప్రతినిధులు తీవ్రంగా ఖండించారు. పాఠశాలల నిర్వహణలో అనేక ఒడిదుడుకులకు భరిస్తూ, గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఉన్నత, నాణ్యమైన విద్యను అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వ ఆదేశాలను పాటిస్తూ జీవో 1 ప్రాప్తికి బడ్జెట్ పాఠశాలలను నిర్వహిస్తున్నామని, పాఠశాలల మౌలిక వసతులు కల్పనలో విద్యాశాఖ ఆదేశాలను క్రమం తప్పకుండా పాటిస్తూ, విద్యాశాఖ అధికారుల సలహాలు, సూచనలు, ఆదేశాలను అనువర్తిస్తూ పాఠశాలను నిర్వహిస్తున్నామని, ప్రతి ఏటా మెరుగైన సదుపాయాలను కల్పిస్తూ, నాణ్యమైన విద్య అందించేందుకు కృషి చేస్తున్నామని, విద్యార్థుల ప్రగతిలో మెరుగైన ఫలితాలు అందిస్తున్నామని ఆప్సా ప్రతినిధులు అన్నారు. కొన్ని పత్రికలలో, ప్రచార మాధ్యమాలలో అవాస్తవ కథనాలను, అనుచితరాతలను విద్యాశాఖ అధికారులపై రాయవద్దని, వాస్తవాలు గ్రహించి వార్తలను ప్రచురించాలని పత్రికా ప్రతినిధులకు విజ్ఞప్తి చేశారు. ఆప్సా స్టేట్ ఉపాధ్యక్షులు ఎం.జనార్ధనరావు, స్టేట్ కౌన్సిలర్ ఎం.రామ్మోహన్రావు, స్టేట్ కౌన్సిల్ సభ్యులు కె.వి అప్పలనాయుడు, ఉత్తరాంధ్ర ఉపాధ్యక్షులు ఐ.గణపతిరావు, జిల్లా గౌరవ అధ్యక్షులు ఎం.సత్యనారాయణ, జిల్లా సెక్రెటరీ ఈ.వేణుగోపాలరావు, జిల్లా కోఆర్డినేటర్ ఐ.రవికుమార్, నియోజకవర్గ గౌరవ అధ్యక్షులు ఆర్.శ్రీనివాసరావు, నియోజకవర్గ అధ్యక్షులు వి.భాస్కరరావు, నరసన్నపేట నియోజకవర్గంలోని ప్రైవేటు పాఠశాలల యాజమాన్య ప్రతినిధులు పాల్గొన్నారు.

## కూటమి నాయకులు పరామర్శ



రణస్థలం, జూన్ 14 ప్రభాతవార్త

మండలం కేంద్రం జెర్ పురానికి చెందిన సిరిపురపు తిరుపతిరావు (స్వామి)కి ఇటీవల ఒక ఫంక్షన్‌లో వంట చేస్తుండగా ప్రమాదవశాత్తు కాలుకి గాయమైంది. ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు ఆదేశాల మేరకు కూటమి నాయకులు దన్నాన మహేష్ ఆధ్వర్యంలో సిరిపురపు తిరుపతిరావుని ఆదివారం పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వారి కుటుంబనికి ఎమ్మెల్యే, కూటమి నాయకులు అండగా ఉంటారని ధైర్యం చెప్పారు. కూటమి నాయకులు ముద్దాడ సత్యనారాయణ, దన్నాన రాము, గొర్ల సత్యం, చిన్ని రవి, పిన్నింటి గోవింద తదితరులు ఉన్నారు.

## అమ్మవారి కాలనీ మెయిన్ కాలువలో వ్యర్థాలు తొలగించండి



రాజాం, జూన్ 14 ప్రభాతవార్త

రాజాం మున్సిపాలిటీ పరిధిలో ఉన్న అమ్మవారి కాలనీ దగ్గరలో ఎంపీడీవో కార్యాలయం ప్రక్కన ఉన్న ప్రధాన డ్రైనేజీ కాలువలో మొక్కలు, వ్యర్థాలు, తాండవం చేస్తున్నాయి. చాలా రోజులుగా డ్రైనేజీలో చెత్తను తొలగించుకపోవడంతో పిచ్చి మొక్కలు పెరిగి ఉండడంతో కాలువలు వ్యర్థాలు నిల్వ ఉండడంతో చుట్టుపక్కల దుర్వాసన వెదజల్లుతుందని స్థానికులు ఆరోపిస్తున్నారు. తక్షణమే మున్సిపల్ అధికారులు స్పందించి కాలువలో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

## విశిష్ట సేవలకు సన్మానం



ఇచ్ఛాపురం, జూన్ 14 ప్రభాతవార్త:

ఇచ్ఛాపురం రోటరీ క్లబ్ మజ్జిగ పంపిణీ కార్యక్రమం చేపట్టగా సుమారు 25 రోజులకు 60వేలు రూపాయల వ్యయంతో ప్రతి రోజు వెయ్యి మందికి ఉచితంగా మజ్జిగ పంపిణీ కార్యక్రమం దిగ్విజయంగా సాగింది. ఈ కార్యక్రమం ప్రాజెక్ట్ చైర్మన్ రోటేరియన్ కె.రామారావు ఆధ్వర్యంలో దిగ్విజయంగా నిర్వహించబడింది. వారి సేవలను గుర్తించిన క్లబ్ సభ్యులు సన్మాన కార్యక్రమం చేశారు. అలాగే పలు సేవలు అందజేసిన రోటేరియన్ కె.నవీన్‌కుమార్‌కు కూడా సన్మానం చేశారు. డాక్టర్ త్రినాథ్‌రెడ్డి, ప్రెసిడెంట్ డాక్టర్ మోహన్ వెంకటేష్, సెక్రటరీ కె.రామకోటి, డి.క్రిష్ణారావు, పి.దినేష్‌కుమార్, తదితరుల సమక్షంలో కార్యక్రమం జరిగింది.

## వైకాపాకు రాష్ట్రంలో ధర్నా చేసే నైతిక హక్కు లేదు



రణస్థలం, జూన్ 14 ప్రభాతవార్త :

వైసిపి ఐదేళ్ల పాలనలో జగన్ రెడ్డి మాటతప్పిన 130 హామీలు ఇచ్చారని అవేమీ అమలు చేయలేదని రాష్ట్ర రజక కార్పొరేషన్ డైరెక్టర్ గురజాపు రాము ఆరోపించారు. ఆదివారం మండల కేంద్రంలో స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ వైసీపీ నోటికొచ్చిన హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన తరువాత ఇచ్చిన హామీలు ఎగ్గొట్టిన మీరు సిగ్గుఎగ్గూ లేకుండా 'వెన్నుపోటుకు రెండేళ్లు' అంటూ రోడ్లెక్కి ధర్నాలు చేసే నైతిక హక్కు మీకెక్కడిదని చంద్రబాబు నాయక త్వంలో కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో జరిగిన అభివృద్ధి, సంక్షేమం చూసి ఓర్వలేక మీరు చేస్తున్న చిల్లర ధర్నా రాజకీయాలను ప్రజలు గమనిస్తున్నారని దుయ్యబట్టారు.

# శ్రీకాకుళం వార్త



## సోషల్ మీడియా ద్వారా ప్రభుత్వ సంక్షేమం

### పలాస నియోజకవర్గ సమన్వయకర్త వెంకన్న చౌదరి



పలాస, జూన్ 14 ప్రభాతవార్త:

ప్రజలకు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల గురించి పూర్తి స్థాయిలో అవగాహన కల్పించడం నేటి పరిస్థితుల్లో అత్యంత ముఖ్యమైన అంశం అని నియోజకవర్గ సమన్వయ కర్త వెంకన్న చౌదరి కోరారు. ప్రభుత్వాలు ప్రజల సంక్షేమం కోసం అనేక పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తున్నప్పటికీ, వాటి గురించి సరైన సమాచారం ప్రతి కుటుంబానికి చేరుకోవడం అవసరం. ఈ నేపథ్యంలో సామాజిక మాధ్యమాల ప్రతినిధులు, కార్యకర్తలు మరియు ప్రజా ప్రతినిధుల అనుచరులు మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన అవసరం ఉంది. సామాజిక మాధ్యమాలు ప్రస్తుతం ప్రజలతో నేరుగా అనుసంధానం కలిగించే అత్యంత ప్రభావవంతమైన వేదికలుగా మారాయి. ఇటీవలి కాలంలో కొన్ని రాజకీయ పార్టీలు మరియు ప్రతిపక్ష నేతలు వాస్తవాలను వక్రీకరిస్తూ అసత్య ప్రచారాలకు పాల్పడుతున్నారని స్పష్టం చేసారు. సామాజిక మాధ్యమాల ద్వారా అసత్య సమాచారాన్ని వ్యాప్తి చేసి ప్రజల్లో గందరగోళం సృష్టించే ప్రయత్నాలు జరుగుతున్న నేపథ్యంలో, వాటిని వాస్తవాలు మరియు ఆధారాలతో ఖండించడం అవసరం. ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రచారాలకు దీటుగా సమాధానం ఇవ్వడం ద్వారా నిజాలను ప్రజల ముందుకు తీసుకురావాలి. కొంతమంది ప్రతిపక్ష నాయకులు తమ రాజకీయ ఉనికిని చాటుకోవడానికి నిరాధార ఆరోపణలు, తప్పుడు కథనాలు ప్రచారం చేస్తున్నారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. సామాజిక మాధ్యమాల ప్రతినిధులు కేవలం రాజకీయ ప్రచారానికే పరిమితం కాకుండా ప్రజలకు ఉపయోగపడే సమాచారం అందించే వారధిగా పనిచేయాలి. ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించడం, ప్రజల సందేహాలకు సమాధానాలు ఇవ్వడం, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల దృష్టికి తీసుకురావడం మరియు వాస్తవాలను ఆధారాలతో తెలియజేయడం ద్వారా సమాజంలో సానుకూల చైతన్యం తీసుకురావచ్చు. ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజలకు చేరవేయడంతో పాటు అసత్య ప్రచారాలను వాస్తవాలతో ఖండిస్తూ, బాధ్యతాయుతమైన సమాచార వేదికలుగా సామాజిక మాధ్యమాలు ముందుకు సాగాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

## పిడుగుపాటు.. ఏడుగురు మహిళలకు అస్వస్థత



వీరఘట్టం, జూన్ 14, ప్రభాతవార్త :

మండలంలోని అడారు పంచాయితీ చేబియ్యంవలస గ్రామ సమీపంలో ఆదివారం సాయంత్రం పడిన పిడుగు పాటుకు ఏడుగురు మహిళలకు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. గ్రామ సమీపంలోని చెరువులో ఉపాధి హామీ పనులు చేస్తుండగా సమీపంలో ఒక్కసారిగా పడిన పిడుగుపాటుకు యశోదమ్మ, గంగమ్మ, లక్ష్మి, గౌరమ్మ, జ్యోతి, శిమాలమ్మ, మంగమ్మ, దేవర అస్వస్థత గురయ్యారు ఏడుగురు మహిళలను పాలకొండ ఏరియా ఆసుపత్రికు 108 వాహనంలో తరలించారు. వీరికి ఎటువంటి ప్రమాదం లేదని వైద్యుల నుండి వచ్చిన సమాచారం.

## 29 ఏళ్ల తర్వాత మళ్లీ కలిసిన మిత్ర బృందం



సోంపేట, జూన్ 14 ప్రభాతవార్త:

సోంపేట మండలం ఎర్రముక్కాం జిల్లా ఉన్నత పాఠశాలలో 1993-98 విద్యా సంవత్సరంలో చదివిన పూర్వ విద్యార్థులు దాదాపు 34 సంవత్సరాల అనంతరం ఆదివారం ఎర్రముక్కాం నేతాజీ రాక్ బీచ్‌లో ఆత్మీయంగా కలుసుకొని అపూర్వ సమ్మేళనాన్ని నిర్వహించారు. జీవిత ప్రయాణంలో ఉద్యోగాలు, వ్యాపారాలు, కుటుంబ బాధ్యతలతో దేశంలోని వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన ఆనాటి విద్యార్థులు ఒకచోట చేరడం ఆనందోత్సాహాల నడుమ సాగింది. ఈ సందర్భంగా చిన్ననాటి మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ, పాఠశాల రోజుల్లో జరిగిన సరదా సంఘటనలు, ఉపాధ్యాయుల బోధనలు, స్నేహితులతో గడిపిన అమూల్యమైన క్షణాలను పరస్పరం పంచుకున్నారు. దశాబ్దాల తర్వాత ఒకరినొకరు చూసుకున్న మిత్రులు ఆప్యాయంగా పలకరించుకుంటూ, ఆలింగనం చేసుకొని తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ అపూర్వ సమ్మేళనంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ చిరస్మరణీయ అనుభూతిని మిగిల్చింది. కాలం ఎంత మారినా, పాఠశాల రోజుల స్నేహం మాత్రం ఎప్పటికీ చెరగదనే విషయాన్ని ఈ సమావేశం మరోసారి చాటి చెప్పింది.

## ముగిసిన చేపల వేటకు విరామం

### నేటి నుంచి సముద్రంలో చేపల వేట ప్రారంభం



సంతబొమ్మాళి, జూన్ 14, ప్రభాతవార్త

సముద్రంలో చేపల వేట నిషేధానికి తెరపడింది మళ్లీ సోమవారం నుంచి బోట్లతో చేపల వేట ప్రారంభం కానుంది. సుమారు 61 రోజులు సుదీర్ఘ విరామం తర్వాత చేపల వేట ప్రారంభం కావడంతో మత్స్యకారుల్లో ఆనందం వెల్లి విరుస్తుంది. సముద్రంలో చేపలు గుడ్లు పెట్టి సంతానోత్పత్తికి సమయం ఆసన్నం కావడంతో ప్రభుత్వం ఏప్రిల్ 15 నుంచి జూన్ 14 వరకు 61 రోజులు పాటు వేట నిషేధం విధించింది. ఆ సమయంలో మత్స్యకారులు బోట్లతో సముద్రంలో చేపలు వేట చేయరాదని ప్రభుత్వం షరతులు విధించింది. సంతబొమ్మాళి మండలంలో భావనపాడు నుంచి ఉమిలాడ వరకు 8 గ్రామ పంచాయతీలలో సుమారు 5వేల పై చిలుకు మత్స్యకార కుటుంబాలు ఉన్నాయి. వీరిలో దాదాపు 1600మంది మత్యాకారులు సముద్రంలో బొట్లుతో వేట సాగిస్తున్నారు. మిగిలిన వారు కూడా వేటాడి తెచ్చిన మత్స్యసంపద పై ఆధార పడి జీవిస్తున్నారు. వేట నిషేధం సమయంలో దాదాపు మత్స్యకార కుటుంబాల అందరికీ ఉపాధి లేకుండా పోతుంది. సంతబొమ్మాళి మండలంలో ఈ ఏడాది 1547మంది మత్యాకారులు ప్రభుత్వభృతి కోసం దరఖాస్తు చేసుకోగా ఇందులో 1286మందికి మాత్రమే సాయం అందింది. మరో 70మందికి అకౌంట్ లింక్ లేక సాయం అందలేదని మత్యాశాఖ అభివృద్ధి అధికారి ధర్మరాజ్ పాత్రో తెలిపారు. మరో 191మంది అనర్హులుగా గుర్తించామని చెప్పారు. 5వేల పైబడి మత్స్యకార కుటుంబాలకు కేవలం 1286మందికే ప్రభుత్వం వేట నిషేధం సాయం అందించింతే మిగిలిన కుటుంబాలు పరిస్థితి ఏంటని మత్స్యకార నాయకులు ప్రభుత్వ అధికారులను ప్రశ్నిస్తున్నారు.

## నాణ్యత ప్రమాణాలతో తారు రోడ్లు : డీఈ

ఆముదాలవలస, జూన్ 14 (ప్రభాతవార్త):

రాగోలు పాలకొండ రహదారి వయా ముద్దాడ పేట తొగరం కొర్లకోట కే యం 0/0 నుండి కే యం 20/0 వరకు అభివృద్ధి పనులు జరుగుతున్నాయిని ఆర్ అండ్ బి డీఈ ఆర్.గణపతిరావు అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ జీవో నెంబర్ 115 ద్వారా మూడు కోట్ల 20 లక్షల రూపాయలు మంజూరయ్యాయని ఈ నిధులతో కే యం 0/0 నుండి కే యం 5/400 వరకు ప్రస్తుతం పనులు జరుగుతున్నాయని, అలానే కేయం 5/400 నుండి కేఎం 10/0 వరకు జీవో నెంబర్ 179 ద్వారా మూడు కోట్ల 65 లక్షల రూపాయలతో పనులు జరుగుతున్నాయని తెలిపారు. అలానే కేఎం 10/0 నుండి కె ఎం 20/0 వరకు మరమ్మత్తుల కోసం రూ.30 లక్షల రూపాయలు మంజూరయ్యాయని, ఈ అభివృద్ధి పనులన్నీ స్థానిక ఆముదాలవలస ఎమ్మెల్యే, పియుసి కమిటీ చైర్మన్ కూన రవికుమార్ చొరవతో మంజూరు చేయబడ్డాయని తెలిపారు.

## రోడ్డు ప్రమాదాలు, మహిళల భద్రత, గంజాయి నిర్మూలనకే తొలి ప్రాధాన్యత

### జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్



వంగర, జూన్ 14 ప్రభాతవార్త

వంగర పోలీస్‌స్టేషన్‌ను జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ ఆదివారం సందర్శించి, పోలీసు స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. క్షేత్ర స్థాయిలో మహిళల భద్రత, గంజాయి నిర్మూలనకే తొలి ప్రాధాన్యత కల్పించే విధంగా రక్షణ, నియంత్రణ చర్యలు చేపట్టాలని పోలీసు సిబ్బందికి జిల్లా ఎస్పీ ఆర్.దామోదర్ ఆదేశించారు. ముందుగా వంగర పోలీస్ స్టేషన్ సిబ్బందితో ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొని వారి యొక్క బాగోగులను అడిగి తెలుసుకున్నారు. ఎవరికైనా మీ యొక్క సర్వీస్ పరంగా ప్రభుత్వం నుండి రావలసిన రాయితీలు, ప్రమోషన్స్ ఏమైనా పెండింగ్ ఉంటే తెలియజేయునని ఆయన అన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ దామోదర్ మాట్లాడుతూ గంజాయి నియంత్రణ, మహిళల భద్రతకు తొలి ప్రాధాన్యత కల్పించాలని, క్షేత్ర స్థాయిలో మహిళల సంరక్షణ, గంజాయి నియంత్రణకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని పోలీసు అధికారులను జిల్లా ఎస్పీ ఆదేశించారు. మహిళల భద్రతకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఎం.ఎస్.పి.లు, శక్తి బృందాలు తరుచూ స్కూల్స్, కళాశాలలు సందర్శించి మహిళల భద్రత, రక్షణ పట్ల అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ రాఘవులు, రాజం రూరల్ సిఐ రూపేంద్ర, వంగర ఎస్సై షేక్ శంకర్, సుబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

15vzm15:15vzm15.qxd 14-06-2026 23:26 Page 1



## బంగారం కొదవబెట్టి మోసపోయాం.. తక్కువ వడ్డీకే బంగారం



**బొబ్బిలి, జూన్ 14, ప్రభాతవార్త:**

ఆభరణాలపై రుణాలు ఇస్తామని, మా బ్యాంకుల్లో 5 నిమిషాల్లోనే రుణాలు ఇప్పిస్తాం అంటూ పరిచయమైన వ్యక్తులకు నమ్మించి మోసగించిన వైనం పై పట్టణంలోనిపలువురు బాధితులు ఆదివారం విలేకరుల ముందు తమ గోడును వెళ్ళబుచ్చారు. పాత బొబ్బిలికి చెందిన జి.ప్రతాప్ పలు ప్రైవేట్ బ్యాంకుల్లో ఉద్యోగి గాపని చేసేవాడు అన్నారు. మా వద్దకు వచ్చి ఆభరణాలపై నామాత్రపు వడ్డీ కిరుణాలు ఇస్తామని చెప్పడంతో నమ్మి మోసపోయమని వాపోయారు . బొబ్బిలి మండలం బాజ్జులసి చెందిన చంద్రశేఖర్ నాలుగు తులాల బంగారు ఆభరణాలు కుదరబెట్టి లక్షన్నర తీసుకున్నాడు తర్వాత 1,27,000 వడ్డీ అని చెప్పి కట్టించుకున్నారు ఆ ఆభరణాలు ఎక్కడున్నాయో తెలియని పరిస్థితి సదరు వ్యక్తి కూడా పరారీ కావడంతో ఆయన లబోదిబోమంటున్నాడు ఆభరణాలు ఇచ్చిన సమయంలో రసీదులు తర్వాత ఇస్తానని చెప్పి ఇంతవరకు ఇవ్వకపోవడంతో బాధితులకు అనుమానం వచ్చి రోడ్డు ఎక్కారు అదే గ్రామానికి చెందిన కేటి నాయుడు కూడా రెండు నెలల బంగారు ఆభరణాలు కుదరపెట్టి 70000 వాడుకున్నాడు ఆయన కూడా రసీదులు ఇవ్వకపోవడంతో ఆవేదన వెలగెక్కాడు పట్నాయక్ చెందిన సతీష్ ఐదుతురాల బంగారు ఆభరణాలు కుదవపెట్టి కొంత నగదు తీసుకున్నాడు. మిగిలిన నగదు బ్యాంక్ ఖాతాకు వేస్తామని చెప్పాడు. ఖాతాలో ఇంతవరకు పడలేదు సదరు వ్యక్తి కనిపించకపోవడంతో లబోదిబోమంటున్నారు. అలాగే సాయి కృష్ణ ది అదే పరిస్థితి. సొండి లత కూడా ఏడు తులాల బంగారు ఆభరణాలు బ్యాంకు లో పెట్టినట్టు ఆమె చెబుతున్నారు. కొంత నగదు ఇచ్చాడని మరి కొంత నగదు బ్యాంకులో వేస్తానని చెప్పి ఇంతవరకు వేయలేదని ఆమె వాపోయారు .ఆయా బ్యాంకులో ఆభరణాలు ఎక్కడ ఉన్నాయో తెలియని పరిస్థితి నెలకొందని వాపోతున్నారు. బ్యాంకుల్లో ఉద్యోగ పని చేసేవాడని ఆ నమ్మకతోనే ఆభరణాలు ఇచ్చి మోసపోయామన్నారు. దీనిపై అధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరుతున్నారు.

## మంత్రి సంధ్యమ్మ మాట వరాలమూట : టీడీపీ



**సాలూరు 14 ప్రభాతవార్త :**

కూటమి ప్రభుత్వంలో మంత్రి గుమ్మిడి సంధ్యా రాణి నియోజకవర్గంలో చేస్తున్న అభివృద్ధిని చూసీ కడుపు మంటతో మాజీ డిసీఎం రాజన్నదొర మా సంధ్యమ్మ పైఅవాకు చెవాకులు పేలడం ఎంత వరకు సమంజసమని టీడీపీ నాయకులు ధ్వజ మెత్తారు. ఆదివారం టీడీపీ మండల ప్రెసిడెంట్ ఆముదాల పరమేసు ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి పార్టీ లీడర్స్ మాట్లాడుతు 20 ఏళు గా ఎమ్మెల్యేగా ఇంకా మంత్రి, డిప్యూటీ సీఎంగా పనిచేసిన రాజన్నదొర కనీసం శివరాంపురం వంతెన నిర్మించలేని అసమర్ధ పాలన చేసారని ఆగ్రహించారు. అలాగే గతంలో ఆ గ్రామంలో నిండుబహింగసభ లో బ్రిడ్జి కట్టించ లేకపోతే చెప్పుతో కొట్టండని అప్పుడు ప్రగల్బాలు పలికారన్నారు.అంతేకాకుండా ఎవరికి డబ్బులిచ్చి,భోజనాలు పెట్టి టీడీపీ కండవాలు వేయడం లేదని దమ్ముంటే నిరూపించండని సవాల్ విసిరారు.ఇంకా మా సంధ్యమ్మ మాటస్తే నిలుబెట్టుకుం టారని ఈ రెండేళ్ల పాలన పట్టణ,గిరిజన గ్రామాల్లో రోడ్ల ఇంకా వంతెనలు, హాస్పిటల్స్ అభివృద్ధిని చూడడండని కడుపుమంటగా ఉంటే ఈనో వాడండనని అంతే కాని మా నాయకురాలు జోలికి రావద్దని వైసీపీ అండ్ కో చీప్ రాజకీయాలు నమ్మడానికి ప్రజలు చెవిలో పువ్వులు పెట్టుకోలేదని అలాగే మాజీ డిప్యూటీ సీఎం.రాజన్నదొర పప్పులు ఉడకవని క్లారిటీ ఇచ్చారు.పార్టీ నాయకులు కోట.లక్ష్మణ్,బాస్కర్,గణపతి, తదితరులు పాల్గొన్నారు.

## గడసాంలో 232 మందికి వైద్య చికిత్సలు

**దత్తిరాజేరు, జూన్ 14, ప్రభాతవార్త :**



మండలంలోని గడసాం గ్రామంలో ప్రపంచ రక్త దాన దినోత్సవం సందర్భంగా గ్రామంలో 10 మంది యువకులు రక్తదానం చేశారన్నారు నెలిమర్ల మిమ్స్ హాస్పిటల్ వైద్యుల సహకారంతో ఆ గ్రామ మాజీ సర్పంచ్ నేతేటి వెంకటరమణ బూడి గణపతి నేతేటి రామచంద్రరావు ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం మరియు రక్తదాన శిబిరం ఘనంగా నిర్వహించారు ఈ శిబిరంలో సుమారు 232 మంది రోగులు పాల్గొన్నారు చర్మవ్యాధులు మరియు ఇతర సాధారణ ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నారు వైద్యుల సూచనలు మేరకు ఆరోగ్య పరిరక్షణకు సంబంధించిన అవగాహన కూడా డాక్టర్ కల్పించారు ఈ కార్యక్రమంలో ఆర్థోపెటిక్ జనరల్ సర్జరీ చర్మవ్యాధులను నేత్ర వైద్య నిపుణులు పాల్గొని ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించారు ప్రజల ఆరోగ్య సమస్యలను పరిశీలించి తగిన సలహాలు చికిత్స అందించడంతోపాటు అవసరమైన మందులు ఉచితంగా పంపిణీ చేశారు ప్రజల సహకారంతో నిమ్స్ హాస్పిటల్ వైద్య బృందం సేవాభావంతో ఈ వైద్య మరియు రక్తదాన శిబిరం విజయవంతంగా నిర్వహించబడిందని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన వైద్య బృందానికి రక్తదాతలకు గ్రామ పెద్దలకు ప్రజాప్రతినిధులకు ప్రజలందరికీ కృతజ్ఞతలు తెలిపారు

## విబిజి రామ్‌జితో వ్యవసాయ రంగానికి మేలు




**వేపాడ ,జూన్ 14 ,ప్రభాతవార్త:**

వి బి జి రామ్ జి(ఉపాధి హామీ) పథకం తో వ్యవసాయ రంగానికి మేలు జరుగుతుందని ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు ఆశాభావం వ్యక్తం చేశారు. ఆదివారం తాత్కాలిక అధ్యక్షులు నీలకంఠరాజపురం ఎంపీటీసీ వేచలపు వెంకట చినరామునాయుడు అధ్యక్షతన వేపాడ మండల సర్వసభ్య సమావేశం జరిగింది. వేపాడ ఎంపీపీ, ఉపాధ్యక్షులు ఆదివారం జరిగిన సమావేశానికి హాజరు కాకపోవడంతో కోరం సరిపోయిందని హాజరైన ఎంపీటీసీ సభ్యులు తాత్కాలిక ఎంపీపీగా చినరామునాయుడును బలపరచడంతో మండల సమావేశం సాఫీగా సాగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని మార్పు చేసి అమలు చేస్తున్నందున ఇకపై వ్యవసాయ రంగంలో వినూత్న మార్పులు చోటుచేసుకుని రైతులకు లాభదాయకంగా మారుతుందన్నారు. దీనివలన విజయనగరం జిల్లాకు కొంతమేర నష్టం వాటిల్లినా దేశవ్యాప్తంగా మంచే జరుగుతుందన్నారు. మూడు నెలలకు ఒకసారి జరిగే మండల సమావేశాల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో వ్యవహరించి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు .ఈ సమావేశంలో వ్యవసాయ అధికారిని ఎం స్వాతి మాట్లాడుతూ ఈ ఏడాది ఎల్ ని నో ప్రభావంతో వర్షాలు తక్కువగా పడే అవకాశం ఉన్నందున రైతులు అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఖరీఫ్ సీజన్లో 1650 క్వింటాళ్లు వరి విత్తనాలు అలాట్మెంట్ వచ్చిందని, త్వరలో రైతు సేవా కేంద్రాలకు వచ్చిన తరువాత పంపిణీ చేపడతామన్నారు. ముఖ్యంగా అన్నదాత సుఖీభవ నిధులు మంజూరుకు కొత్తగా రైతులెవరూ దరఖాస్తు చేసుకోనవసరం లేదని ఆన్లైన్లో రైతుల భూములకు సంబంధించి ఆధార్ లింకు ఉంటే నేరుగా రైతుల ఖాతాలకు ప్రభుత్వమే నిధులు జమ చేస్తుందని తెలిపారు. అనంతరం వైద్యం, ఆర్డబ్ల్యూఎస్, హార్టికల్చర్, తదితర శాఖలపై సమీక్ష జరిపారు. ఈ సమావేశంలో ఎంపీడీవో సిహెచ్ సూర్యనారాయణ తహసిల్దార్ జె రాములమ్మ, ప్రత్యేక అధికారి లక్ష్మీనారాయణ ,జడ్పిటిసి ఎస్ అప్పారావు, ఎంపీటీసీ సభ్యులు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

## గంజాయి, డ్రగ్స్, సైబర్ నేరాలపై ఉక్కు పాదం : ఎస్పీ దామోదర్

**మెరకముడిదాం, జూన్ 14 ( ప్రభాతవార్త) :**



జిల్లాలో గంజాయి, మత్తు పదార్థాలు రవాణా, సైబర్ నేరాలపై ఉక్కు పాదం మోప నున్నట్లు జిల్లా ఎస్పీఎ. ఆర్. దామోదర్ వెల్లడించారు. ఆదివారం సాధారణ సందర్శనలో భాగంగా బుధ రాయవలస పోలీస్ స్టేషన్ ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఎస్పి మాట్లాడుతూ మహిళల భద్రతతో పాటు సైబర్ నేరాలు అదుపుకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా మహిళల భద్రత పట్ల అన్ని పోలీస్ స్టేషన్ పరిధిలో తరచూ అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రమాదాల నివారణకు మైనర్లకు వాహనాలు ఇవ్వకుండా తల్లిదండ్రులకు అవగాహన కల్పించడమే కాకుండా, వాహన చోధకులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని సూచించారు. అనంతరం సిబ్బందితో సమావేశమై పలు సూచనలు చేశారు. అనంతరం స్టేషన్ ప్రాంగణాన్ని పరిశీలించి పరిశుభ్రతపై సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం స్టేషన్లో దస్త్రాలను పరిశీలించి, సిబ్బంది పనితీరును కొనియాడారు. ఆయనతో పాటు డి.ఎస్.పి. ఎస్ రాఘవులు, సిఐ జి శంకర్రావు ఉన్నారు. కార్యక్రమంలో ఎస్సై జె. లోకేష్ కుమార్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## రెండేళ్ల విజయోత్సవ సభను విజయవంతం చేయాలి

**శృంగవరపుకోట,జూన్14,ప్రభాతవార్త:**



కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా జిల్లా కేంద్రంలోని పోలీసు బ్యారాక్స్ లో ప్రభుత్వ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహిస్తున్న రెండేళ్ల నమ్మకం,అభివృద్ధి,సంక్షేమం విజయోత్సవ సభను విజయవంతం చేసేందుకు నియోజకవర్గ జనసేన పార్టీ అధ్యక్షులు,నాయకులు, జనసైనికులు, వీర మహిళలు తరలిరావాలని ఎస్.కోట నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ వబ్బిన సత్యనారాయణ తెలిపారు. ఉదయం 8గంటలకు సభకు తప్పక హాజరవ్వాలని వబ్బిన పిలుపునిచ్చారు.

## నూతన ఓటర్లను గుర్తించండి : బేబీ నాయన

**రామభద్రపురం.. జూన్ 14..ప్రభాత వార్త**



ఈ నెల 15 నుంచి నిర్వహించనున్న సార్ కార్యక్రమంలో భాగంగా తెలుగుదేశం పార్టీ భూత్ ఇన్చార్జిలంతా ఇంటింటికి వెళ్లి నూతన ఓటర్లను గుర్తించాలని ఎమ్మెల్యే బేబీ నాయన అన్నారు రామభద్రపురం మండల తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆదివారం కార్యనిర్వాహక మాజీ కార్యదర్శి చింతల రామకృష్ణతో పాటు విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రతి పంచాయతీలోని బూత్ ఇన్చార్జిలంతా పర్యటించి నూతన వార్డులు గుర్తింపుతో పాటు చేర్పులు మార్పులు సరిచేయాలని ఆయన కోరారు కోటమి ప్రభుత్వం పాలనలో రెండేళ్లలో ఎంతో అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందని ఆయన అన్నారు తాగునీరు పాఠశాలల అభివృద్ధి గ్రామాల్లో సిసి రోడ్లు కాలువలు ఇంటింటి కొళాయిలు వంటి అనేక అభివృద్ధి చేయడం జరిగిందని ఆయన అన్నారు గ్రామీణ ప్రాంతాల్లో తారు రోడ్డు నిర్మాణం చాపడడం జరిగిందని ఆయన అన్నారు ఖరీఫ్ లో విత్తనాలు ఎరువులు సాగునీటి పథకాల బాగు చేస్తామన్నారు మహిళ అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని మహిళలంతా వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దేందుకు కోపం అనేక రాయితీలు కల్పించి ఆదుకుంటుందని ఆయన అన్నారు ఈ సమావేశంలో మండల తెదేపా నాయకులు చింతల చెన్నమ్మ తల్లి, వసంతల సన్యాసినాయుడు, కనిమేరక వెంకటి నల్ల నారాయణ, సూర్యనారాయణ గొర్లి అప్పారావు , తదితరులు పాల్గొన్నారు.

## త్వరలో ప్లాస్టిక్ వ్యర్థాల రీసైక్లింగ్ యూనిట్లు

### 210పంచాయతీల్లో ఏర్పాటుకు నిర్ణయం

**శృంగవరపుకోట,జూన్14,ప్రభాతవార్త:**



కాలుష్యాన్ని తగ్గించేందుకు గ్రామీణ ప్రాంతాల్లో త్వరలో ప్లాస్టిక్ వ్యర్థాల రీసైక్లింగ్ యూనిట్లు ఏర్పాటుకు ప్రభుత్వం కసరత్తులు ప్రారంభించింది. ఈమేరకు అనువైన 210 పంచాయతీలను గురించినట్లు తెలుస్తోంది.స్వచ్ఛంద్ర కార్పొరేషన్,సెర్ఫ్ అనుసంధానంతో యూనిట్లను ఏర్పాటు చేయనున్నారు.ఒక్కో యూనిట్ ఏర్పాటుకు 16లక్షల రూపాయలు ఖర్చు అవుతుందని దీన్ని ప్రభుత్వం గ్రాంటుగా ఇవ్వనుందని తెలుస్తోంది.ఒక యూనిట్ పరిధిలో ఉన్న జనాభా లెక్కల ఆధారంగా ఏడు లేదా ఎనిమిది గ్రామాలను అనుసంధానం చేస్తారు.వీటి నిర్వహణ భాధ్యతలను డ్వాక్రా మహిళలకు అప్పగించనున్నారు.ఇక అసలు విషయానికొస్తే ప్లాస్టిక్ వ్యర్థాలను పంచాయతీ సిబ్బంది ద్వారా కొనుగోలు చేస్తారు.ఇక ప్లాస్టిక్ వ్యర్థాలను రీసైక్లింగ్ చేసిన తరువాత వాటిని విక్రయిస్తారు. వాటిని విక్రయించిన ద్వారా నిర్వాహణ ఖర్చులు పోగా మిగతా ఆదాయాన్ని డ్వాక్రా మహిళా సభ్యులు పంచుకుంటారు.ఈవిధానంతో ఒక్కొక్క మహిళకు నెలకు సుమారు 15వేల నుంచి 20వేల రూపాయల వరకు ఆదాయం వస్తుందని అంచనా వేస్తున్నారు.ప్రభుత్వం తలపెట్టనున్న ప్లాస్టిక్ వ్యర్థాల రీసైక్లింగ్ విధానంతో బహిరంగంగా ప్లాస్టిక్ ను దహనం చేయకుండా నిరోధించే అవకాశం ఉందని అందువలన ప్రభుత్వం ప్లాస్టిక్ కాలుష్యాన్ని తగ్గించేందుకు ఈవిధానాన్ని తీసుకువస్తున్నట్లు తెలుస్తోంది.

## చీపురుపల్లిలో గాలి వాన బీభత్సం

### విరిగిపడ్డ చెట్లు ... విద్యుత్ సరఫరాకు అంతరాయం

### సినిమా హాల్ వద్ద కారుపై పడిన ఐరన్ స్తంభం.. గాయపడ్డ బాలుడు

**చీపురుపల్లి ,జూన్ 14 ప్రభాతవార్త**



చీపురుపల్లి పట్టణంలో ఆదివారం మధ్యాహ్నం వీధుల గాలులతో బీభత్సంగా కురిసిన వర్షం కారణంగా చీపురుపల్లి మండలంలోని పలు ప్రాంతాల్లో తీవ్ర నష్టం వాటిల్లింది. పలుచోట్ల చెట్లును విరిగిపడడంతో విద్యుత్ సరఫరాకు అంతరం ఏర్పడింది. అంతేకాకుండా పట్టణంలోని వంశీ విష్ణు సినిమా హాలు సమీపంలో పార్కింగ్ స్థలంలో గల ఓ కారు పైన గాలుల కారణంగా ఇనుప స్తంభం విరిగిపడడంతో కారు పూర్తిగా ధ్వంసం అయింది. అంతేకాకుండా కారులో గల చిన్న బాలుడు గాయపడ్డాడు. పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాల సమీపంలో పలు చెట్లు నేలకి వాడడంతో తీవ్ర నష్టం వాటిల్లింది.. మండలంలోని పలు గ్రామీణ ప్రాంతాల్లో కూడా చెట్లు నేలకొరిగాయి. ఎక్కడ ఇటువంటి ప్రాణ నష్టం జరగకపోవడంతో అధికారులు పీల్చుకున్నారు. విద్యుత్ శాఖ అధికారులు సహాయక చర్యలను ముమ్మరం చేశారు.

## యోగాతో ఆరోగ్యం, ఐశ్వర్యం : మంత్రి శ్రీనివాస్

**విజయనగరం, (బొండపల్లి), జూన్ 14 : ప్రభాతవార్త:**



యోగా అభ్యసించడం ద్వారా ఆరోగ్యంతో బాటు ఆనందం, ఐశ్వర్యం సిద్ధిస్తాయని రాష్ట్ర ఎంఎస్ఎంఈ, సెర్ప్, ఎన్నారై సాధికారత సంబంధాల శాఖామంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. ప్రతీ ఒక్కరూ తమ జీవితంలో యోగా ఒక భాగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎస్ రాంసుందర్ రెడ్డి పిలుపునిచ్చారు.12వ అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకల్లో భాగంగా విజయనగరం జిల్లా బొండపల్లి మండలం నెలివాడ గ్రామంలోని అంకన్న చెరువు వద్ద "యోగాంధ్ర" థిమేటిక్ యోగా కార్యక్రమాన్ని ఆదివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. మంత్రి కొండపల్లి శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ రాంసుందర్ రెడ్డి సంయుక్తంగా జ్యోతి ప్రజ్వలన చేసి ఈ ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. అనంతరం ఏర్పాటు చేసిన వేదికపై మంత్రి, కలెక్టర్, ఇతర ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్వయంగా పాల్గొని పలు యోగాసనాలు వేశారు. కార్యక్రమంలో భాగంగా అంకన్న చెరువు గట్టు పైన అర కిలోమీటరు మేర సుమారు వెయ్యి మంది ఉపాధి హామీ వేతనదారులు ఒకేసారి ఆసీనులై యోగాసనాలు వేయడం విశేషంగా నిలిచింది.

**యోగా పూర్వీకులు మనకిచ్చిన గొప్ప వరం**

ఈ సందర్భంగా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ.. భారతదేశంలో మన పూర్వీకులు మానవాళికి అందించిన అత్యంత గొప్ప వరం యోగా అని కొనియాడారు. కరోనా కష్టకాలంలో తాను సైతం యోగా, సూర్య నమస్కారాలు, ప్రాణాయామం చేయడం ద్వారానే ఆరోగ్యాన్ని కాపాడుకున్నానని ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. రాష్ట్రంలోని ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలనే దృఢ సంకల్పంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారు ఈ యోగా కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారని మంత్రి స్పష్టం చేశారు. వందలాది మంది ఒకేచోట చేరి యోగాలో పాల్గొనడం చాలా సంతోషంగా ఉందని, కేవలం ఈ ఒక్క రోజే కాకుండా ఇదే ఒరవడిని ప్రతి నిత్యం జీవితంలో భాగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా నిరంతరం ఇంటి పనులతో అలసిపోయే మహిళలు, యోగా చేయడం ద్వారా శారీరక, మానసిక ప్రశాంతతను పొందవచ్చని మంత్రి సూచించారు.

**శరీరాన్ని, మనస్సును ఆహ్లాదపరిచేదే యోగా : కలెక్టర్ రామ్ సుందర్ రెడ్డి**

జిల్లా కలెక్టర్ రాంసుందర్ రెడ్డి మాట్లాడుతూ.. మానవ శరీరాన్ని, మనస్సును ఒకేసారి ఆహ్లాదపరిచే అద్భుత శక్తి యోగాకు మాత్రమే ఉందన్నారు. నిత్య జీవితంలో ఎదురయ్యే ఒత్తిడిని అధిగమించడానికి ఇది ఎంతగానో తోడ్పడుతుందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో కనీసం అరగంట పాటు వ్యాయామం లేదా యోగా చేయడం అలవాటు చేసుకోవాలని, తద్వారా సంపూర్ణ ఆరోగ్యంతో జీవించవచ్చని కలెక్టర్ పిలుపునిచ్చారు. గజపతినగరం ఏఎంసీ చైర్మెన్ గోపాలరాజు, వైస్ ఛైర్మన్ కోరాడ కృష్ణ, డిఆర్డిఏ పిడి శ్రీనివాస పాణి, డ్వామా పిడి శారదాదేవి, జెడ్పీ సీఈవో నాగలక్ష్మి, యోగా నోడల్ ఆఫీసర్ డాక్టర్ వరప్రసాద్, స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, మండల అధికారులు, నాయకులు, డ్వామా, డీఆర్డీఏ, ఆయుష్ అధికారులు, భారీ సంఖ్యలో ఉపాధి హామీ కూలీలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఆశ్రమ పాఠశాలలో విద్యార్థుల మరణాలు లెక్కలేదా ..!

### గిరిజనమంత్రి తొలి సంతకం హామీ మరిచారా

**సాలూరు జూన్14 ప్రభాతవార్త :**




జిల్లా పరిధిలోని గిరిజన సంక్షే ఆశ్రమ పాఠశాలలు అలా పోస్టుమాట్రిక్ కాలేజీహాస్టల్లో ఏఎన్ఎ లను నియమించి విద్యార్థుల మరణాల నుంచి కాపాడాలని ప్రభుత్వాన్ని ఆదివా గిరిజన సంఘం నిలదీసింది. ఆదివార విలేకరుల సమావేశంలో గౌర అధ్యక్షులు శ్రీదరపు.అప్పారావు మాట్లాడుతు గత విద్యా సంవత్సరం ఇంకా వేసవి సెలవుల్లో ఆశ్రమ పాఠశాల విద్యార్థిని,విద్యార్థులు అనారోగ్యంతో మరణించారని తెలిపారు.అలాగే గిరిజన మంత్రి తొలిసంతకం పాఠశాల్లలో ఏఎన్ఎం లను నియమించి విద్యార్థుల మరణాలను అరికట్టాలని లక్ష్యాన్ని ఎందుకు అమలు చేయలేదు ప్రశ్నించారు. అంతేకాకుండా రాష్ట్రప్రభుత్వం ఏఎన్ఎం లను నియమించి విద్యార్థుల మరణాలు అరికట్టేలా చర్యలు తీసుకోవాలని లేదంటే గిరిజన ప్రాంత ప్రజలు, విద్యార్థులు కదిలించి ఆదివాసీ గిరిజన సంఘం పెద్ద ఎత్తున పోరాటానికి సిద్ధపడుతుందని హెచ్చరించారు.నాయకులు రాజయ్య, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

విజయనగరం పార్వతీపురం మన్యం 25 వార్త

## గరివిడిలో ఘోర రోడ్డు ప్రమాదం.. నేల రాలిన విద్యాకుసుమం

**గరివిడి , జూన్ 14, ప్రభాత వార్త:**



గరివిడిలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఓ విద్యార్థి అసువులు బాసాడు.ఇంటికి మరో అర నిముషములో చేరుకోవాల్సిన ఆ విద్యార్థిని వ్యాన్ రూపంలో మృత్యువు కాటేసింది. బడి గంట మోగిన వెంటనే ఇంటికి సైకిల్ పై వెళుతున్న ఆ విద్యార్థి ని మ్యాక్సీ క్యాబ్ వాహనం రూపంలో మృత్యువు కబళించింది. కన్నవారికి పుత్ర శోకం మిగిల్చింది. 14 ఏళ్లకే ఆ విద్యా కుసుమం నేల రాలడంతో ఆ ఇంట రోదనలు మిన్నంటాయి.. తల్లిదండ్రులు గుండెలవిసేలా విలపించే తీరు అక్కడివారిని కంట తడిపెట్టించింది. తన కొడుకు పార్థీవ దేహాన్ని చూసేందుకు విచ్చేసిన సహచర విద్యార్థులను చూసిన ఆ తల్లిదండ్రులు కన్నీరు మున్నీరయ్యారు. గరివిడి శ్రీమతి గోదావరి దేవి సరాఫ్ సెకండరీ పాఠశాల లో 9 వ తరగతి చదువుతున్న గరివిడి టీచర్స్ కాలనీ లో నివసిస్తున్న గుంటు అవినాష్ అనే విద్యార్థి ఈ నెల 12 న పాఠశాల లు ప్రారంభమైన రోజే బడికి వెళ్లి ఇంటికి సైకిల్ పై వస్తున్న సమయంలో వ్యాన్ డీ కొంది.తలకు బలమైన గాయమైన నేపథ్యంలో అవినాష్‌కు విజయనగరంలో ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించి మెరుగైన వైద్యాన్ని అందించారు. తలకు బలమైన గాయమైన నేపథ్యంలో ఆదివారం ఉదయం ఆ విద్యార్థి మృతి చెందారు. ఇంటికి అతి సమీపం ,ప్రధాన రహదారి మలుపు వద్ద జరిగిన ప్రమాదంలో ఆ విద్యార్థి కన్నవారికి దూరమయ్యాడు. అర నిమిషంలో అమ్మ ఒడికి చేరాల్సిన ఆ విద్యార్థి అనంత లోకానికి వెళ్లడం తో గరివిడి లో విషాదం చోటుచేసుకుంది. ఫేకర్ అల్లాయిస్ పరిశ్రమలో అకౌంట్స్ డిపార్ట్మెంట్ ఉద్యోగి అయిన గుంటు మోహన్ కుమారుడైన అవినాష్ మృతి గరివిడి వాసులను దిగ్భ్రాంతికి గురిచేసింది. విద్యార్థిలోకానికి కంట తడిపెట్టించింది. తల్లిదండ్రులు కి పుత్ర శోకాన్ని మిగిల్చింది. వాహన చోదకులు అతివేగం ఓ నిండు ప్రాణం బలితీసుకుంది. విద్య లో మేటిగా నిలిచే ఆ విద్యార్థి విద్యాభ్యాసం బాల్య దశలోనే ముగియడం విచారకరం. విద్యాధికుల కుటుంబంలో పుట్టిన అవినాష్ ఆకస్మిక మృతి ఆ కుటుంబాన్ని మనోవేదనకు, మానసిక క్షోభకు గురిచేసింది.

## నేరాల నియంత్రణ ప్రధాన లక్ష్యం : డీఎస్పీ రాఘవులు



**చీపురుపల్లి, జూన్ 14, ప్రభాత వార్త :**

జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు నేరాలను నియంత్రణ చేయడమే ప్రధాన లక్ష్యంగా పనిచేస్తున్నామని చీపురుపల్లి డిఎస్పిఎస్ రాఘవులు అన్నారు. శనివారం అర్ధరాత్రి వరకు చీపురుపల్లి నియోజకవర్గ ప్రధాన కేంద్రంలో ఆయన తన సిబ్బందితో వాహనాల తనిఖీలు నిర్వహించారు. చిగురుపల్లి పోలీస్ సర్కిల్ పరిధిలోని గరివిడి మెరకముడుదాం గొర్ల పోలీస్ స్టేషన్ ఎస్ఐలతో పాటు పోలీస్ సిబ్బందితో కార్బన్ చర్చ్ నిర్వహించారు. ప్రత్యేకించి అక్రమ గంజాయి రవాణా, డ్రంక్ అండ్ డ్రైవ్ , అదే విధముగా మూగజీవాల తరలింపు.. తదితర అంశాల పట్ల నిస్తంగా పరిశీలన జరిపారు. కార్యక్రమంలో సర్కిల్ ఇన్స్పెక్టర్ జి శంకర్రావు, గరివిడి ఎస్ఐ లోకేష్, చీపురుపల్లి ఇన్చార్జ్ ఎస్ఐ లోకేష్ పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఏడుగురు విద్యార్థులకు ట్రిపుల్ ఐటీలో సీట్లు

**దత్తిరాజేరు, జూన్ 14, ప్రభాతవార్త :**

మండలంలోని షికారుగంజి మోడల్ స్కూల్లో పదో తరగతి పరీక్షా ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించిన ఏడుగురు విద్యార్థులకు ట్రిపుల్ ఐటీ కళాశాలకు ఎంపికయ్యారని మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ ఈశ్వరరావు తెలిపారు ప్రభుత్వం విడుదల చేసిన ట్రిపుల్ఐటీ ఫలితాల్లో సిహెచ్ శ్రావణి వీ అంజలి ఏ జోగేష్ నాయుడు టి వర్షిని ఎం లావణ్య కే కుసుమ శ్రీ పి మోహిని విద్యార్థులు సీట్లు వచ్చాయి అన్నారు విద్యా సంవత్సరం ఈ మోడల్ స్కూల్ నుండి ఏడుగురు విద్యార్థులకు ట్రిపుల్ ఐటీ సీట్లు రావడం ఆనందంగా ఉందన్నారు ఈ ఘనవిజయం పాఠశాల బోధన సిబ్బంది కృషి విద్యార్థులు పట్టుదల తల్లిదండ్రుల సహకారం అందించడం వల్ల మనస్ఫూర్తిగా అభినందిస్తున్నట్లు తెలిపారు

## స్టార్ జర్నలిస్ట్ కార్యవర్గం ఎన్నిక

**కొత్తవలస, జూన్ 14, (ప్రభాత వార్త ):**



మండలంలో స్టార్ జర్నలిస్ట్ అసోసియేషన్ కార్యవర్గం వార్షికోత్సవము ఆదివారం జరిగింది. స్టార్ జర్నలిస్టుకి అసోసియేషన్ కి గౌరవ అధ్యక్షులుగా రిట్ట పల్లి అప్పన్న,. ప్రెసిడెంట్ గా కాకర శ్రీనివాస్, వైస్ ప్రెసిడెంట్ బోని రాంబాబు, సెక్రెటరీ తుర్రు దేముడు, జాయింట్ సెక్రెటరీ రమేష్, ట్రెజరర్ రమణ, జాయింట్ ట్రెజరర్ అప్పలసూరి, సీనియర్ జర్నలిస్ట్ నాయుడు, ( వార్త) శంకర్. పి.రమేష్. జి.గోవింద్, కృష్ణ ప్రసాద్ , పాల్గొనేరే. అసోసియేషన్ సభ్యులు, మాట్లాడుతూ, ప్రజలకు ఏ సమస్య వచ్చిన, పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు.

## పశుసంవర్ధక పాలిటెక్నిక్ ప్రవేశ దరఖాస్తులకు 20 వరకు గడువు పొడిగింపు

**గరివిడి, జూన్ 14, ప్రభాత వార్త:**

తిరుపతి శ్రీ వెంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయం పరిధిలోని గుర్తింపు పొందిన యూనివర్సిటీ, ప్రైవేటు యాజమాన్య కళాశాలలో రెండేళ్ళ కాలవ్యవది గల పశు సంవర్ధక పాలిటెక్నిక్ డిప్లొమా కోర్స్ లో ప్రవేశానికి ఆన్ లైన్ లో దరఖాస్తులు చేసుకునేందుకు ఈ నెల20 వరకు గడువు పొడిగించినట్లు తిరుపతి పశు వైద్య విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఉత్తర్వులు జారీ చేశారు.ఈ నెల 15 వరకు ఉండే దరఖాస్తుల గడువును 20 వరకు పొడిగించి నట్లు రిజిస్ట్రార్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.పదవ తరగతి మార్కుల ప్రాతిపదికన సీట్లు పొందేందుకు అవకాశం ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు విశ్వవిద్యాలయ వెబ్ సైట్‌ను

## ముళ్ళ కిరీటం.. చీపురుపల్లి రెవెన్యూ కార్యాలయం... ఎవరు పదిలం?.

### పాలకుల తీరుపై విమర్శల వెలువ.. చీపురుపల్లి రెవెన్యూ అధికారుల పనితీరుపై ప్రశ్నల వరద

**చీపురుపల్లి , జూన్ 14, ప్రభాతవార్త :**

కడబంతి లో కూర్చున్న మనవాడైతే మనకి జరుగుతుంది అనేది పెద్దల సామెత. ఆ సామెతకు అనుకూలంగా చీపురుపల్లిలోని రెవెన్యూ అధికారుల పాలనపై క డబంతి పాలన కొనసాగుతున్న పట్ల పలు విమర్శ వ్యక్తమవుతున్నాయి. చీపురుపల్లి రెవెన్యూ పరిధిలో కలెక్టర్ ఆదేశాలను సైతం బేకాతర్ చేస్తూ అధికార పార్టీ నాయకులు చేస్తున్న హడావిడి కి ప్రజల్లో విమర్శలు చెలరేగుతున్నాయి. చీపురుపల్లి మండల తాసిల్దార్ గా పనిచేసిన డి ధర్మరాజు డిప్యూటీ కలెక్టర్ స్థాయిలో పార్వతిపురం డివిజన్ కి బదిలీ అయిన తర్వాత అదే కార్యాలయంలో పనిచేస్తున్న డిప్యూటీ తాసిల్దార్ సూర్యకాంతం అనే మహిళకు చీపురుపల్లి తాసిల్దార్ నియమిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు చేసినప్పటికీ స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు కొంతమంది విముఖత వ్యక్తం చేయడంతో చీపురుపల్లిలో రెవెన్యూ పనితీరుల పట్ల పలు అనుమానాలను ప్రజలు వ్యక్తం చేస్తున్నారు. ఎట్టకేలకు చీపురుపల్లి రెవెన్యూ కార్యాలయంలో పనిచేసే తాసిల్దార్ గా పదోన్నతి పొందిన సంతోష్ ను చీపురుపల్లి తాసిల్దార్ గా నియమించడం పట్ల రాజకీయ వర్గాల్లో చర్చగా మారింది. గతంలో పనిచేసిన అధికారిగా స్థానికంగా పలువురు ప్రశంసలు పొందిన తాసిల్దార్ అధికార పార్టీ నాయకుల పనులను చక్కదిద్దడానికి నియమించారంటూ పలువురు ఆరోపిస్తున్నారు. రాజకీయ నాయకులకు వారి పనులకు తలలు ఊపుతూ రెవిన్యూ అధికారులు పనిచేయడం కారణంగా సామాన్యులు వారు ఇబ్బందులకు గురవుతున్నట్లు కొంతమంది ఆరోపిస్తున్నారు. ఇప్పటికే చీపురుపల్లి మండలంలో రెవెన్యూ లీలల బాగోతం బహిర్గతం అయినప్పటికీ గతంలో పనిచేసిన అధికారుల సైతం కళ్లకు గంతలు కట్టుకొని సదరు పనులను పూర్తి చేయకుండా చేతులు దులుపుకుంటున్నారంటూ పలువురు ఆరోపణలు చేస్తున్నారు. చీపురుపల్లి మండలంలోని కర్లాం రెవిన్యూ పరిధిలో 408.. సర్వే నెంబర్లో సుమారు 89 ఎకరాలు భూ కబ్జాకి పాల్పడిన వ్యక్తి పైన రెవెన్యూ అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదంటూ పలువురు ప్రశ్నిస్తున్నారు.

## అక్రమ పశువుల రవాణాపై చర్యలు : ఎస్పీ దామోదర్

**రామభద్రపురం.. జూన్ 14..ప్రభాత వార్త**

రామభద్రపురం పోలీస్ స్టేషన్ పరిధిలో అక్రమంగా పశువులను రవాణా చేస్తున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు, రామభద్రపురం ఎస్.ఐ వి జ్ఞానప్రసాద్ రావు మరియు సిబ్బంది ఆధ్వర్యంలో 14-06-2026 న రామభద్రపురం మండలం గ్రామంలోని శివాలయం సమీపంలో మరియు గ్లోబల్ వ్యూ స్కూల్ సమీపంలో ప్రత్యేక దాడులు నిర్వహించడమైనది.ఈ దాడులలో శివాలయం ప్రాంతంలో 32 పశువులు, గ్లోబల్ వ్యూ స్కూల్ ప్రాంతంలో 10 పశువులు, మొత్తం 42 పశువులను స్వాధీనం చేసుకొని రక్షించడమైనది.అక్రమంగా పశువులను రవాణా చేస్తున్న 7 మంది వ్యక్తులను అరెస్ట్ చేసి, వారి మీద జంతు హింస నిరోధక చట్టం-1960 నిబంధనల మేరకు కేసులు నమోదు చేయడమైనది.స్వాధీనం చేసుకున్న 42 పశువులను కోర్టు ఆదేశాల మేరకు గోశాలకు తరలించి అప్పగించడమైనది. పశువుల సంరక్షణ మరియు ఆహార ఏర్పాట్లను గోశాల నిర్వాహకుల పర్యవేక్షణలో చేపట్టడమైనదన్నారు.

